


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


రాష్ట్రంపై వాసవీ అమ్మవారి చల్లని దీవెనలు
- సీఎం చంద్రబాబు ప్రార్థనలు

4

# పెట్టుబడులకు అత్యుత్తమం ఏపీ

## ఏపీలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

- లక్ష ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టులు
- ముందుకొచ్చిన ఆర్ఎంజడ్ సంస్థ.. దావోస్‌లో మంత్రి లోకేష్ సమక్షంలో ప్రకటన
- విశాఖలో 50 ఎకరాల్లో జీసీసీ పార్క్
- 1 గిగావాట్ లక్ష్య సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్
- రాయలసీమలో 1000 ఎకరాల్లో పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్
- మంత్రి లోకేష్ చర్చలు ఫలవంతం




6

- రాష్ట్రానికి రండి... పరిస్థితులు గమనించండి
- దావోస్ వేదికపై పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు
- 'ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై సీఎం ప్రసంగం

2




## ప్రపంచ దేశాల చూపు భారత్ వైపు

- విదేశీ పెట్టుబడులకు సురక్షిత గమ్యస్థానం
- నేషన్ ఫస్ట్ అన్నదే టీమ్ ఇండియా నినాదం
- రాష్ట్రాలుగా వేరైనా... దేశంగా మేమంతా ఒక్కటే
- సంపదతో పాటు ప్రజల జీవన ప్రమాణాల పెంపుపైనే మా దృష్టి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- దావోస్‌లో కేంద్ర మంత్రులు, సీఎంలు, మంత్రులతో కలిసి ఇండియా లాంజ్ ప్రారంభించిన చంద్రబాబు

3




## అభివృద్ధి అందరికీ చేరాలి



- అందరి భాగస్వామ్యంతో ఓ తరం అభివృద్ధి చెందేలా ప్రభుత్వ నిర్ణయాలు
- లోకల్ బ్రాండ్ కోసం ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం
- దావోస్‌లో వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానంపై చర్చలో సీఎం చంద్రబాబు
- ప్రపంచ ఆర్థిక సదస్సు చర్చా వేదికలో ఈ విధానానికి పలువురి ప్రశంసలు
- ఆదర్శ విధానం తెచ్చారని సీఎం చంద్రబాబుకు కితాబు

4



## ఏపీలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్

- రాష్ట్రంలో యువతకు ఏఐ, క్వాంటం, సైబర్ సెక్యూరిటీలో శిక్షణ
- 10 లక్షల మందిని తీర్చిదిద్దాలి
- ఐబీఎం చైర్మన్, సీఈవోను కోరిన సీఎం చంద్రబాబు
- దావోస్‌లో దిగ్గజ కంపెనీల సీఈవోలతో సీఎం చంద్రబాబు భేటీ

3

## ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏపీకి సహకరిస్తాం

- సీఎం చంద్రబాబుకు యూఏఈ ఆర్థిక మంత్రి అల్ మార్రీ హామీ
- మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుపైనా చర్చ



- వివరాలు 2లో..

## దావోస్‌లో నేడు సీఎం చంద్రబాబు మూడోరోజు పర్యటన

- పారిశ్రామిక పురోగతిపై డబ్ల్యూఈఎఫ్ సెషన్‌లో ప్రసంగించనున్న సీఎం
- పలువురు పారిశ్రామిక వేత్తలతో భేటీకానున్న ముఖ్యమంత్రి

4

## గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

- 2029 నాటికి సాధించటమే లక్ష్యం
- ఏపీకి ఇప్పటికే రూ.5.22 లక్షల కోట్ల మేర క్లీన్ ఎనర్జీ పెట్టుబడులు
- తద్వారా పునరుత్పాదక శక్తి, అనుబంధ రంగాల్లో 2.7 లక్షల ఉద్యోగాల కల్పన
- సస్టెయినబులిటీపై సీఐఐ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్



- వివరాలు 6లో...

### విశాఖలో డెడికేటెడ్ సెంట్రలైజ్డ్ స్కిల్లింగ్ క్యాంపస్

- కాగ్నిజెంట్ ఉన్నతస్థాయి బృందానికి మంత్రి లోకేష్ వినతి

5

### మారిటైమ్ మౌలిక సదుపాయాల్లో జపాన్ పెట్టుబడులకు సహకరించండి

- జేబిఐసీ ఎండీ షిగెటోకు మంత్రి లోకేష్ వినతి

7

### విశాఖ డేటా సెంటర్ పనులు వేగవంతం

- బ్రూక్ ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీకి మంత్రి లోకేష్ వినతి

5

### నిర్మాణాత్మక చర్యలతో..
### ఆవిష్కరణ, పరిశ్రమ మధ్య అంతరాల తగ్గింపు



- ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ ఏర్పాటుకు వ్యూహాత్మక అడుగులు
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో ఇన్నోవేషన్స్‌కు ప్రోత్సాహకాలు
- ఆవిష్కరణల్లో పెట్టుబడులపై అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం
- మౌలిక సదుపాయాలు, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో భారీగా తగ్గుతున్న పెట్టుబడులు
- ఇన్నోవేషన్స్‌పై ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి నారా లోకేష్

- వివరాలు 4లో..

# పెట్టుబడులకు అత్యుత్తమం ఏపీ

- రాష్ట్రానికి రండి... పరిస్థితులు గమనించండి
- దావోస్ వేదికపై పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు
- 'ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై సీఎం ప్రసంగం




దావోస్ (చైతన్యరథం): ఏపీని మించిన అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానం మరొకటి లేదని, పారిశ్రామికవేత్తలకు రాష్ట్రం అతిపెద్ద మార్కెట్ అవుతుందని దావోస్‌లోని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏపీకి వచ్చి రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తోన్న పాలసీలు, పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితుల్ని స్వయంగా పరిశీలించాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను చూశాకే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి భారత్ ప్రపంచ శక్తిగా మారుతుందని, అందులో ఏపీ మొదటి స్థానంలో నిలుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. దావోస్ పర్యటనలో రెండో రోజు మంగళవారం జరిగిన 'ది ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై సీఐఐ బ్రేక్ ఫాస్ట్ సెషన్‌లో సీఎం ప్రసంగించారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీ ఆకర్షించినట్టు చెప్పారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఇంధనం, డిజిటల్ ఇన్ ఫ్రా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై ఈ సెషన్‌లో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, తదితర రంగాల్లో పెట్టుబడుల గురించి ముఖ్యమంత్రి వివరించారు. గ్రీన్ అమ్మోనియా, గూగుల్ పెట్టుబడులు, ఏపీ బ్రాండ్ ఇమేజ్ గురించి పారిశ్రామిక వేత్తలకు తెలిపారు. స్పేస్ సిటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవే కనెక్టివిటీ, తదితర అంశాలపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అన్ని విధాలుగా సహకరిస్తోందని, వ్యవసాయం రంగంతో పాటు వైద్య రంగంలోను డ్రోన్లను ఉపయోగిస్తామని సీఎం చెప్పారు. 2026లో డ్రోన్ అంబులెన్స్ కూడా ఏపీ నుంచి లాంచ్ చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. 1,054 కిలోమీటర్ల సముద్ర తీరం, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఏపీ బలమని చెప్పారు. వచ్చే 3-4 ఏళ్లలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందన్నారు.

## బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్ ఆంధ్రప్రదేశ్

దశాబ్దాలుగా దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరవుతున్నాను. దావోస్‌కు వచ్చిన ప్రతిసారీ పారిశ్రామికవేత్తలు, నిపుణుల నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటాను. కొత్త ఆలోచనలు పంచుకుంటాను. టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో వస్తున్న మార్పులను తెలుసుకుని పాలసీలు రూపొందిస్తాను. దావోస్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల ఆలోచనలు అర్థం చేసుకుని రాష్ట్రాన్ని బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్‌గా మారుస్తున్నాం. నాలెడ్జ్ ఎకానమీ దేశ ఆర్థిక వ్యవస్థనే మారుస్తుంది. సంపద సృష్టి జరుగుతుంది. భారతీయులు... అందులోనూ తెలుగు ప్రజలు టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ముందుంటారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటేనే అద్భుత ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. మరే దేశంలో లేని యువశక్తి భారత్‌లో ఉంది. దేశానికి నేడు తిరుగులేని సమర్థ నాయకత్వం ఉంది. గతంలో పారిశ్రామికవేత్తలను ఏపీకి తీసుకురావాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. తెలుగు ప్రజల విజయాలు, ఏపీ బ్రాండ్ సానుకూల అంశంగా మారాయి. ప్రతీ రంగంలో నిర్దిష్ట లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. కలిసి ఎదుగుదాం... కలిసి పయనిద్దాం... భవిష్యత్‌ని కలిసి నిర్మిద్దాం...అని ముఖ్యమంత్రి అన్నారు. బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, మాస్టర్ కార్డ్ సీఏఓ, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ సహా విదేశీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సెషన్‌కి హాజరైన జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల దగ్గరకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారు.







# ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏపీకి సహకరిస్తాం





- సీఎం చంద్రబాబుకు యూఏఈ ఆర్థిక మంత్రి అల్ మార్రీ హామీ
- మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుపైనా చర్చ

దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక-పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ - యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంతో కలిసి యూఏఈ దుబాయ్ ఫుడ్ క్లస్టర్ పని చేసేందుకు అల్ మార్రీ అంగీకారం తెలిపారు. అలాగే యూఈఏకి చెందిన సుమారు 40 సంస్థలు ఏపీలో ఏర్పాటు చేసేలా తోడ్పాటు అందిస్తామన్నారు. మరోవైపు ఆహార భద్రత, లాజిస్టిక్స్, పోర్ట్ ఆధారిత పరిశ్రమలు, పునరుత్పాదక శక్తి, పట్టణాభివృద్ధి,పర్యాటకం,మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను అల్ మార్రీకి ముఖ్యమంత్రి వివరించారు. యూఏఈకి చెందిన షరాఫ్ గ్రూప్.. ఆంధ్రప్రదేశ్‌లో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై చర్చ జరిగింది. లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమింగ్ సాంకేతికతతో అమరావతిలో ఆధునిక నిర్మాణ యూనిట్ ఏర్పాటు, డీపీ వరల్డ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద స్థాయి పోర్ట్ టెర్మినల్స్, లాజిస్టిక్స్ మౌలిక వసతుల అభివృద్ధి, ఏడీఎన్ఓసీ సంస్థ ద్వారా ఫ్లోటింగ్ స్టోరేజ్, రీగ్యాసిఫికేషన్ యూనిట్ ఏర్పాటు, విశాఖలో లూలూ గ్రూప్ మెగా షాపింగ్ మాల్ నిర్మాణంపైనా చర్చించారు. యూఏఈతో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఏపీలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఎగుమతులు మరింత వేగంగా పెరుగుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ భవిష్యత్‌లో యూఏఈ ప్రభుత్వంతో పాటు ప్రముఖ సంస్థల భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ పాల్గొన్నారు.

# కడప స్టీల్ ప్లాంట్ పనులు త్వరగా ప్రారంభించండి

- ఏపీలో పెయింట్స్ తయారీ యూనిట్ ఏర్పాటుచేయండి
- జెఎస్‌డబ్ల్యు ఎండి పార్థ్ జిందాల్‌తో భేటీలో మంత్రి లోకేష్

దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): జెఎస్‌డబ్ల్యు సిమెంట్స్ అండ్ పెయింట్స్ విభాగం మేనేజింగ్ డైరెక్టర్ పార్థ్ జిందాల్‌తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం దావోస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కడపలో జెఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంట్ కు భూమిపూజ షెడ్యూలుపై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి లోకేష్ కోరారు. పెయింట్స్ తయారీ రంగంలో మేజర్ ప్లేయర్లు అయిన బర్జర్ పెయింట్స్, ఆసియన్ పెయింట్స్ వంటి సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో డెకరేటివ్, ఇండస్ట్రియల్ పెయింట్స్ తయారీ సౌకర్యాన్ని ఏర్పాటుచేయండి. భారత్ లో జెఎస్‌డబ్ల్యు - ఎల్ జి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని భావిస్తున్న బ్యాటరీ తయారీ యూనిట్ కు అంతర్జాతీయస్థాయి ఎకోసిస్టమ్ కలిగి ఉన్న శ్రీసిటీ లేదా విశాఖను పరిశీలించండి. ఏపీలో ఎంజి మోటార్ బ్రాండ్ ద్వారా కొత్త ఈవీ, ఐసీఈ మ్యానుఫ్యాక్చరింగ్ లైన్‌ను ఏర్పాటుచేయడానికి గల అవకాశాలను అన్వేషించండి. జెఎస్‌డబ్ల్యు గ్రూప్ చేపట్టిన హెరిటేజ్ ఎడాప్షన్ ఇనిషియేటివ్స్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట కోట, ఉండవల్లి గుహలు వంటి వారసత్వ ప్రదేశాలను స్వీకరించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. పార్థ్ జిందాల్ స్పందిస్తూ...ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



చైతన్యరథం




# ప్రపంచ దేశాల చూపు భారత్ వైపు

- విదేశీ పెట్టుబడులకు సురక్షిత గమ్యస్థానం
- నేషన్ ఫస్ట్ అన్నదే టీమ్ ఇండియా నినాదం
- రాష్ట్రాలుగా వేరైనా... దేశంగా మేమంతా ఒక్కటే
- సంపదతో పాటు ప్రజల జీవన ప్రమాణాలపైనే మా దృష్టి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- దావోస్‌లో కేంద్ర మంత్రులు, సీఎంలు, మంత్రులతో కలిసి ఇండియా లాంజ్ ప్రారంభించిన చంద్రబాబు



దావోస్ (చైతన్యరథం): ప్రపంచ వ్యాప్తంగా విదేశీ పెట్టుబడులకు సురక్షిత గమ్యస్థానం భారతదేశమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపే చూస్తున్నాయని ఆయన అన్నారు. దేశం వేగంగా మార్పు చెందుతోందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిక దావోస్‌లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్‌ను కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులతో కలిసి సీఎం చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. పార్టనర్ విత్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన ఈ ఇండియా లాంజ్‌లో కొద్దిసేపు సమావేశం అయ్యారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. నేషన్ ఫస్ట్ అనే స్ఫూర్తి చాటేలా టీమ్ ఇండియాగా అంతా కలిసి పనిచేద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. దేశంలోని వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చినా అందరం భారత దేశానికే ప్రాతినిధ్యం వహిస్తున్నామని అన్నారు.రాష్ట్రాలుగా పోటీపడినా దేశంగా ఒక్కటిగానే ఉన్నామని వివరించారు. పరస్పరం సహకారం అందించుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా వేగంగా రూపాంతరం చెందుతోందన్నారు. వచ్చే రెండేళ్లలో ప్రపంచంలో భారత్ 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని.. 2047 నాటికి అగ్రస్థానానికి చేరుకుంటుందన్నారు. శక్తివంతమైన నేత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పామని సీఎం స్పష్టం చేశారు.

### సంపదతో పాటు జీవన ప్రమాణాలు కీలకం

అభివృద్ధిలో సంపద సృష్టి అత్యంత కీలకమే అయినా ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏపీలో ప్రజలందరి జీవన ప్రమాణాలు పెంచడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రపంచం ఎలా ముందుకు వెళ్తోందో నేర్చుకునేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో వీలుంటుందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అంతా గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉందన్నారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్ నాయుడు, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ రమేశ్ కుమార్ సంఘవి, కేరళ మంత్రి పి.రాజీవ్, యూపీ మంత్రి సురేశ్‌కుమార్ ఖన్నా, తెలంగాణా మంత్రి డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తదితరులు హాజరయ్యారు.

# ఏపీలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్




ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో ఐబీఎం చైర్మన్, సీఈవో అర్వింద్ కృష్ణ భేటీ

- రాష్ట్రంలో యువతకు ఏఐ, క్వాంటం, సైబర్ సెక్యూరిటీలో శిక్షణ
- 10 లక్షల మందిని తీర్చిదిద్దాలి
- ఐబీఎం చైర్మన్, సీఈవోను కోరిన సీఎం చంద్రబాబు
- దావోస్‌లో దిగ్గజ కంపెనీల సీఈవోలతో సీఎం చంద్రబాబు భేటీ

దావోస్ (చైతన్యరథం): రాష్ట్రంలో యువతను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం, సైబర్ సెక్యూరిటీ నిపుణులుగా తీర్చిదిద్దాలని ఐబీఎం చైర్మన్, సీఈవోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. దావోస్ పర్యటన రెండోరోజు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఐబీఎం చైర్మన్ అర్వింద్ కృష్ణతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా ఏఐ, క్వాంటం, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో రాష్ట్ర యువతకు శిక్షణ ఇవ్వడంపై చర్చించారు.

ఇప్పటికే దేశవ్యాప్తంగా 50లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం, సైబర్ సెక్యూరిటీలో శిక్షణ ఇవ్వాలని ఐబీఎం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 10లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అమరావతిలో ఐబీఎం భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ పైనా ఈ సమావేశంలో చర్చించారు. క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల పై సానుకూలంగా స్పందించిన ఐబీఎం సీఈవో వీటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### వేగంగా విశాఖ గూగుల్ డేటా సెంటర్

అనంతరం గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. విశాఖలో 'గూగుల్ ఏఐ డేటా సెంటర్' నిర్మాణంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఎలాంటి జాప్యం లేకుండా డేటా సెంటర్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్(WIPO) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, డైరెక్టర్ అనిల్ మూర్తితోనూ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మేధోసంపత్తి హక్కుల రక్షణ, స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి, పరిశోధన-అభివృద్ధి, పేటెంట్ వ్యవస్థ బలోపేతం చేయడం లాంటి అంశాలపై చర్చించారు. ఆర్థిక వృద్ధికి ఆవిష్కరణలు కీలకమని.. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ, ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్టార్టప్ వ్యవస్థకు డబ్ల్యుఐపీఓ సహకారం అందించాలని సీఎం ప్రతిపాదించారు.




వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, డైరెక్టర్ అనిల్ మూర్తితో సీఎం చంద్రబాబు భేటీ




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్

# అభివృద్ధి అందరికీ చేరాలి

- అందరి భాగస్వామ్యంతో ఓ తరం అభివృద్ధి చెందేలా ప్రభుత్వ నిర్ణయాలు
- లోకల్ బ్రాండ్ కోసం ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం
- దావోస్‌లో వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానంపై చర్చలో సీఎం చంద్రబాబు
- ప్రపంచ ఆర్థిక సదస్సు చర్చా వేదికలో ఈ విధానానికి పలువురి ప్రశంసలు
- ఆదర్శ విధానం తెచ్చారని సీఎం చంద్రబాబుకు కితాబు

దావోస్ (చైతన్యరథం): అభివృద్ధి అనేది ఏ ఒక్కరికో పరిమితం కాకూడదని... అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి... అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఉద్దేశ్యంతోనే ఏపీ ప్రభుత్వం వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు తన పర్యటనలో భాగంగా రెండో రోజైన మంగళవారం నాడు వివిధ పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారు. వివిధ చర్చా వేదికల్లో పాల్గొన్నారు. దీంట్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానంపై ప్రపంచ ఆర్థిక సదస్సులో చర్చ జరిగింది. ఈ చర్చా వేదికలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానాన్ని తెచ్చి ఏపీ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి చొరవ తీసుకుందని చర్చా వేదికలో పాల్గొన్న ప్రతినిధులు కితాబు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అభివృద్ధి సాధించేలా... ఆదర్శవంతంగా ఉండే విధానాన్ని తీర్చిదిద్దారని ఏపీ సీఎంను ప్రశంసించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...అభివృద్ధిలో అందర్నీ భాగస్వాములను చేసే ఉద్దేశ్యంతోనే వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానం తెచ్చామన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలకు మేలు జరగాలి... ఓ తరం అభివృద్ధి చెందాలి. నా ఆలోచనలు ఎప్పుడూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోణంలోనే ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉండే టెక్నాలజీలను, పరిణామాలను అందిపుచ్చుకునేలా ఆలోచించాలి. భారతదేశం ఇప్పుడు ఉత్పత్తి రంగం వైపు వేగంగా అడుగులు వేస్తోంది. దాన్ని అందిపుచ్చుకునే దిశగా మేం వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ విధానం తెచ్చామని సీఎం వెల్లడించారు.

### గైడెన్స్ ఇస్తున్నాం... ఇన్ఫ్రా ఏర్పాటు చేస్తున్నాం...

వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ అనే విధానం తేవడమే కాదు... దానికి అవసరమైన గైడెన్స్ ఇస్తున్నాం, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలకు, వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ ద్వారా పారిశ్రామికవేత్తలు కావాలనుకునే వారికి గైడెన్స్ ఇస్తాం. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ఇన్ఫ్రాను సిద్ధం చేస్తున్నాం. అలాగే వినూత్న ఆలోచనలతో ఉన్న వారిని ప్రోత్సహించేందుకు పీ-4 అనే వ్యవస్థను కూడా ఏర్పాటు చేశాం. పీ4 ద్వారా పేదరికాన్ని తగ్గించడంతోపాటు... కొత్త ఆలోచనలు ఉన్న వారికి చేయూత ఇచ్చే విధంగా కూడా వ్యవస్థను తీర్చిదిద్దాం. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా పారిశ్రామికాభివృద్ధిని ప్రమోట్ చేస్తున్నాం. గతేడాది మహిళా దినోత్సవం నాడు లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారుచేస్తామని ప్రకటించాం.. పురోగతి సాధించాం. ఇదే విధంగా విదతల వారీగా మహిళలను పారిశ్రామిక వేత్తలను చేసేలా ప్రోత్సహిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు.

### ఉత్పత్తితో పాటు బ్రాండింగ్ ముఖ్యం

ఏపీలో 10 లక్షల మందికి ఏఐ, క్వాంటం టెక్నాలజీలో శిక్షణ ఇవ్వాలని ఐబీఎంను కోరాను. నైపుణ్యం ఉన్న మానవవనరులను కంపెనీలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇలా చేయగలిగితేనే రాష్ట్రాభివృద్ధితోపాటు.. ప్రజలు కూడా అభివృద్ధి సాధించగలుగుతారు. ఎన్నో రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది... చాలా పరిణామాలు చోటు చేసుకుంటాయి... అదనపు విలువ జోడించినప్పుడే అభివృద్ధి ఫలాలు అందుకోగలం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు వాల్యూ ఎడిషన్ కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. పారిశ్రామికవేత్తలుగా ఎదిగాక.. ఉత్పత్తులను తయారు చేయడమే కాదు... వాటికి బ్రాండింగ్ కూడా ముఖ్యం. ఏపీ ఉత్పత్తులకు బ్రాండింగ్ వచ్చేలా మేం కృషి చేస్తున్నాం. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి వచ్చే వారిని మేం అతిథుల్లా చూస్తాం.. గౌరవిస్తాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అనుమతులు ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## రాష్ట్రంపై వాసవీ అమ్మవారి చల్లని దీవెనలు

### - సీఎం చంద్రబాబు ప్రార్థనలు

అమరావతి (చైతన్యరథం): శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా ఆ తల్లి త్యాగాన్ని గౌరవిస్తూ ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించాం. ఆడబిడ్డల ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ గౌరవం చాటేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆ తల్లి చల్లని దీవెనలతో అందరికీ మేలు జరగాలని ప్రార్థిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా తెలిపారు.

# నిర్మాణాత్మక చర్యలతో.. ఆవిష్కరణ, పరిశ్రమ మధ్య అంతరాల తగ్గింపు

- ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ ఏర్పాటుకు వ్యూహాత్మక అడుగులు
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో ఇన్నోవేషన్స్‌కు ప్రోత్సాహకాలు
- ఆవిష్కరణల్లో పెట్టుబడులపై అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం
- మౌలిక సదుపాయాలు, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో భారీగా తగ్గుతున్న పెట్టుబడులు
- ఇన్నోవేషన్స్‌పై ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి నారా లోకేష్

దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కరణల కోసం స్థానికంగా పెట్టుబడులను సమీకరించి, దీర్ఘకాలిక రాబడులను ఇచ్చే ఆవిష్కరణల ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తూ తమ ప్రభుత్వం విశ్వసనీయ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. దావోస్ కాంగ్రెస్ విలేజ్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ఆధ్వర్యాన.. దృఢమైన ఆవిష్కరణల కోసం పెట్టుబడులను బలోపేతం చేయడంలో మనం ఎక్కడ.. (Where Capital Lands: Anchoring Investment for Resilient Innovation) అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్త ఆవిష్కరణలకు మూలధన పెట్టుబడుల్లో లోపాలు ఎందుకు ఉన్నాయి? పెట్టుబడి లేకపోవడం వల్ల ఆవిష్కరణలు ఎలా ఆగిపోతున్నాయి? ఆవిష్కరణాత్మక ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి పెట్టుబడులపై అంతర్జాతీయంగా ఏ విధంగా దృష్టిసారించాలి అనే అంశాలపై చర్చించారు. సదస్సులో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పెట్టుబడులను ఆకర్షించడం అంటే కేవలం సంస్థలను తీసుకురావడం కాదు, ఆవిష్కరణకు అవసరమైన స్థిరమైన ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయడమని అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన మేము స్వల్పకాలిక ప్రోత్సాహకాలపై కాకుండా.. నమ్మకం, సామర్థ్యం, దీర్ఘకాలిక నిబద్ధత, విజిబిలిటీ కలిగి ఉంటేనే ఆవిష్కరణలు వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో మేము ఆవిష్కరణ, పరిశ్రమ మధ్య అంతరాన్ని తగ్గించేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాం. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పిస్తున్నాం. విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్, సిస్కో, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ భాగస్వామ్యంతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లతోపాటు ఆర్ అండ్ డిపై ప్రత్యక్షంగా పెట్టుబడి పెడుతున్నాం. తద్వారా ఆలోచనలు వేగంగా స్టార్టప్‌లుగా మారతాయి. ఇదే సమయంలో మేము ప్రతిభపై కూడా పెట్టుబడి పెడుతున్నామని మంత్రి లోకేష్ వివరించారు.

### పెట్టుబడిదారులకు భరోసా

ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక ప్రతిభ ప్రపంచ సవాళ్లకు పరిష్కారం చూపుతుందని మేం భావిస్తున్నాం. ఈ దిశగా ముందుకు సాగుతూ మేము పారిశ్రామిక క్లస్టర్‌లలో ఆర్ అండ్ డిని ఏకీకృతం చేస్తూ టాలెంట్‌పై పెట్టుబడి పెట్టి, ప్రపంచ భాగస్వామ్యాలకు విశ్వసనీయ యాంకర్‌గా పనిచేస్తున్నాం. అనిశ్చితి లేని పాలసీలు, డిజిటల్ గవర్నెన్స్, భారతదేశంలో మొట్టమొదటి సారిగా పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ఎస్క్రో మెకానిజంను ప్రవేశపెట్టాం. ఇవన్నీ పెట్టుబడిదారులకు భరోసా కల్పించడమేగాక స్థిరమైన ఆవిష్కరణలకు ఊతమిస్తున్నాయి. 2047 నాటికి క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను సాధించేందుకు ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ తెచ్చాం. ఈ రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి, 167 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫ్రంటియర్ టెక్నాలజీలలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోసం క్వాంటమ్ వ్యాలీ, భారతదేశంలో మొట్టమొదటి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. త్రిముఖ వ్యూహాలతో మేం ముందుకు సాగుతున్నాం. 1). వివిధ రంగాలకు సంబంధించిన క్లస్టర్లవారీ అభివృద్ధి. 2). విశ్వవిద్యాలయాలు, నైపుణ్య సంస్థలతో పరిశ్రమలను అనుసంధానించడం 3). దీర్ఘకాలిక విలువను సృష్టించే విధానాన్ని రూపొందించడం. ట్రిపుల్ హెలిక్స్ మోడల్‌ను ఉపయోగించి అప్లయిడ్ రీసెర్చి, కొలాబరేటివ్ ఆర్ అండ్ డి, పరిశ్రమ నేతృత్వంలోని ఆవిష్కరణ వేదికలలో స్థిరమైన పెట్టుబడిపై ఆంధ్రప్రదేశ్ దృష్టి సారిస్తోంది. ఇది ఆధునిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి దోహదపడుతోంది. ఇందుకోసం ప్రభుత్వం, పారిశ్రామిక సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయడంతో ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన ఫలితాలు సాధించాం. కేవలం 18 నెలల వ్యవధిలో మా రాష్ట్ర పెట్టుబడి ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ద్వారా రూ. 8.75 లక్షల కోట్ల ( 97 బిలియన్ డాలర్ల) విలువైన 211 ప్రాజెక్టులను ఆమోదించింది. ఈ పెట్టుబడుల ద్వారా 8.36 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని మంత్రి లోకేష్ తెలిపారు.



### ప్రభుత్వాలు దృష్టిసారించాలి

అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరతలు ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించే క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌పై ప్రభావం చూపుతున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక విభజన, సాంకేతిక అస్థిరతలు, పర్యావరణ సంక్షోభాలు, పెరుగుతున్న అసమానతలు ఇందుకు ప్రధాన అడ్డంకులుగా మారాయి. మరోవైపు డీగ్లోబలైజేషన్ జాతీయ-నియంత్రిత వ్యవస్థలను పెంపొందిస్తోంది. ఇది ఆర్థిక మార్కెట్లపై కూడా ప్రభావం చూపుతోంది. పెరిగిన పాలసీ అనిశ్చితి, వాణిజ్య అడ్డంకుల నేపథ్యంలో ప్రపంచ ఇన్నోవేషన్ క్యాపిటల్ తక్కువ గ్రాఫికల్ ప్రాంతాల్లో కేంద్రీకృతమవుతోంది. ఇది సిస్టమిక్ రిస్క్‌ను, అసమానతలను సృష్టిస్తుంది. యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (అంక్టాడ్) నివేదిక ప్రకారం 2024లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులు భారీగా తగ్గిపోయాయి. పునరుత్పాదక శక్తి ప్రాజెక్టుల్లో పెట్టుబడులు 31%, నీరు, స్వచ్ఛత రంగాల్లో 30%, వ్యవసాయ-ఆహార రంగాల్లో 19% తగ్గాయి. అంతర్జాతీయ సమాజ సంక్షేమంలో కీలకమైన ఈ రంగాలు దీర్ఘకాలికంగా తక్కువ నిధులతో ఉండటం ఆందోళనకరం. ఈ పరిస్థితుల్లో రెన్యువబుల్ ఎనర్జీ, రీజనరేటివ్ ప్రొడక్షన్, సమ్మిళిత సమాజాలు, ఆహార వ్యవస్థలు వంటి రంగాల్లో ప్రభుత్వాలు స్థిరమైన పెట్టుబడులు పెట్టడం అత్యవసరం. లాభాలపై దృష్టి పెట్టే ప్రైవేట్ సంస్థలు ప్రాథమిక పరిశోధన, ప్రారంభదశ టెక్నాలజీలు, ఎకోసిస్టమ్ అభివృద్ధిపై తక్కువ పెట్టుబడులు పెడతాయి. ఈ అంతరాన్ని భర్తీచేయడానికి పబ్లిక్ ఫైనాన్స్ ద్వారా గ్రాంట్లు, ఆర్ అండ్ డి సబ్సిడీలు, మిశ్రమ ఆర్థిక సహాయం, వ్యూహాత్మక రంగాలలో నేరుగా పెట్టుబడులు పెట్టాలి. ఆవిష్కరణలకు అవసరమైన ఎకోసిస్టమ్ నిర్మాణానికి నియంత్రిత చట్రాలు, డిజిటల్, ఫిజికల్, ఎడ్యుకేషనల్ మౌలిక సదుపాయాలను ప్రభుత్వాలు కల్పించడం తప్పనిసరి. స్థిరమైన ఆవిష్కరణలు పెరుగుదలకు అవసరమైన నైపుణ్యాలతో వర్క్ ఫోర్స్‌ను సన్నద్ధం చేసే విద్య, శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించడంపై ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు దృష్టిసారించాలని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.




# రాష్ట్రంలో జీసీసీ ఏర్పాటు చేస్తాం

**- సీఎం చంద్రబాబుతో ఎన్ విడియా గ్లోబల్ ఏఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్**

దావోస్ (చైతన్యరథం): స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎన్ విడియా గ్లోబల్ ఏఐ ఇనిషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మెండ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించటంతో పాటు యువతకు నైపుణ్యశిక్షణ, ఉపాధి అవకాశాలను అందిస్తూ ఏఐ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేసేలా ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రికి కాలిస్టా రెడ్మండ్ తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఇరువురి మధ్యా చర్చ జరిగింది. దీనిపై ఇప్పటికే ఏపీతో ఒప్పందం చేసుకున్నట్టు ఎన్ విడియా ఉపాధ్యక్షురాలు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటుతో పాటు హార్డ్‌వేర్ తయారీ యూనిట్ ఏర్పాటు సహా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం వహించే అంశంపై ఎన్ విడియా ఆసక్తి కనపరిచింది.




## సీఎం చంద్రబాబుతో ఇజ్రాయెల్ మంత్రి, ప్రతినిధుల భేటీ

**- యూఏవీ డ్రోన్ తయారీలో సహకారంపై చర్చ**

దావోస్ (చైతన్యరథం): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఇజ్రాయెల్ దేశ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ట్రేడ్ మిషన్ ప్రతినిధి షిర్ స్లట్స్కీ మంగళవారం సమావేశం అయ్యారు. విశాఖ- చెన్నై కారిడార్ లో యూఏవీ డ్రోన్ తయారీ, తీర ప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగానికి డ్రోన్ల తయారీ సాంకేతికతపై ఇజ్రాయెల్ దేశ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. డీశాలినేషన్, పారిశ్రామిక అవసరాల కోసం వ్యర్థ జలాల రీసైక్లింగ్ సాంకేతికతపై సహకారం అందించే అంశంపై చర్చ జరిగింది. క్వాంటం కంప్యూటింగ్‌తో పాటు సెమీకండక్టర్ల తయారీలో జపాన్, కొరియా పారిశ్రామిక క్లస్టర్ల లాగే ఇజ్రాయెల్ కూడా ఓ పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు. కట్టుదిట్టమైన సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం అందించే అంశంపైనా ఇరువురు నేతల మధ్య చర్చలు జరిగాయి.

# దావోస్‌లో నేడు సీఎం చంద్రబాబు మూడోరోజు పర్యటన

- **పారిశ్రామిక పురోగతిపై డబ్ల్యూఈఎఫ్ సెషన్‌లో ప్రసంగించనున్న సీఎం**
- **పలువురు పారిశ్రామిక వేత్తలతో భేటీకానున్న ముఖ్యమంత్రి**

దావోస్ (చైతన్యరథం): స్విట్జర్లాండ్ లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనమిక్ ఫోరం- డబ్ల్యూఈఎఫ్)లో తొలి రెండు రోజులపాటు పలు సమావేశాల్లో పాల్గొని, ప్రముఖ కంపెనీల చైర్మన్లు, సీఈఓలతో చర్చలు జరిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు మూడో రోజు బుధవారం కూడా కీలకమైన సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రముఖ కంపెనీల సీఈఓలతో ముఖాముఖి భేటీ కానున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో పారిశ్రామిక పురోగతి అంశంపై నిర్వహించే సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. హెూరైసిస్ చైర్మన్ ఫ్రాంక్ రిచర్ తోనూ సీఎం భేటీ కానున్నారు. తమారా హాస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ సృష్టి శిబులాల్, ఆ సంస్థ సీఓఓ కుష్బు అవస్థి, కాలిబో ఏఐ అకాడెమీ సీఈఓ రాజ్ వట్టికుట్టి, స్కాట్ శాండ్స్ఫ్రఫర్‌లు ముఖ్యమంత్రితో సమావేశమై చర్చలు జరుపుతారు. అనంతరం ఏపీ సీఎన్ఎఫ్ నిర్వహించే..హీలింగ్ ప్లానెట్ త్రూ రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్.. పేరిట జరిగే చర్చా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. ఆ తర్వాత.. ట్రిలియన్ డాలర్ పైవోట్ రీరైటింగ్ మార్కెట్ సిగ్నల్స్ ఫర్ నేచర్ పాజిటివ్ గ్రోత్.. అనే అంశంపై చర్చా కార్యక్రమంలోనూ సీఎం పాల్గొంటారు. బ్లూమ్ బెర్గ్ సంస్థ నిర్వహించనున్న.. ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూమెంట్ ట్రాన్స్ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ.. సెషన్‌లో ముఖ్య వక్తగా ప్రసంగించనున్నారు. ఏపీ లాంజ్‌లో నిర్వహించే బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రులతో కలిసి సీఎం హాజరు అవుతారు. వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ రీజెనరేషన్ మొబిలైజింగ్ కేపిటల్ పేరిట నిర్వహించే మరో కార్యక్రమంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు.

# విశాఖ డేటా సెంటర్ పనులు వేగవంతం

**- బ్రూక్ ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీకి మంత్రి లోకేష్ వినతి**




దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): బ్రూక్ ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... ఇటీవల విశాఖ సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు గిగా వాట్ స్కేల్ క్లీన్ ఎనర్జీ పవర్డ్ డేటా సెంటర్ ప్లాట్‌ఫాం పనులను వేగవంతం చేయాలని కోరారు. గ్రిడ్ స్కేల్ స్టోరేజీ అవసరాలకు అనుగుణంగా బ్యాటరీ స్టోరేజి, సోలార్ సెల్, మాడ్యుల్ తయారీ సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయండి. కృష్ణపట్నం పోర్టు పరిసరాల్లో పారిశ్రామిక క్లస్టర్ల సమీపాన గ్రీన్ మాలిక్యూల్/ హైడ్రోజన్ లింక్డ్ పైలట్ ప్రాజెక్టుల ఏర్పాటును పరిశీలించండి. ఏపీ ఐటి కారిడార్ లో మిశ్రమ వినియోగానికి లార్జ్ స్కేల్ కమర్షియల్ ఐటీ ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేయండి. బ్రూక్ ఫీల్డ్ – ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టులకు సహకరించేందుకు నిర్మాణాత్మక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ తెలిపారు.

బ్రూక్ ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో 12 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు బ్రూక్ ఫీల్డ్ ఇప్పటికే ఒప్పందం చేసుకుందన్నారు. ఎనర్జీ, డిజిటల్ ఇన్ ఫ్రా, రియల్ ఎస్సెట్స్ రంగాలు భారత్‌లో దీర్ఘకాలిక వృద్ధి మార్కెట్ గా మేం గుర్తించాం. క్లీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, క్లీన్ ఎనర్జీ ఆధారిత డేటా సెంటర్లు, ఇండస్ట్రియల్ స్కేల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలు మా ప్రాధాన్యతలుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని టెస్కీ పేర్కొన్నారు.

# విశాఖలో రీజనల్ టెక్నాలజీ ఆపరేషన్స్ హబ్

**- ఐరన్ మౌంటైన్ ప్రెసిడెంట్ విలియంతో భేటీలో మంత్రి లోకేష్ వినతి**




దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): గ్లోబల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, డేటా సెంటర్ సర్వీసుల్లో పేరెన్నికగన్న యూఎస్‌ఏకి చెందిన బహుళజాతి సంస్థ ఐరన్ మౌంటైన్ (Iron Mountain) ప్రెసిడెంట్,సీఈవో విలియం ఎల్.మీనీతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... జాతీయస్థాయి డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్నందున స్కిల్డ్ వర్క్‌ఫోర్స్, గ్లోబల్ కనెక్టివిటీని మెరుగుపర్చడానికి డేటా సెంటర్లకు మద్దతుగా విశాఖపట్నంలో రీజనల్ టెక్నాలజీ ఆపరేషన్స్ హబ్ నెలకొల్పాలని కోరారు. డేటా మేనేజ్‌మెంట్, సెక్యూర్ స్టోరేజి టెక్నాలజీస్, నెక్స్‌ట్ జెన్ డిజిటల్ ఇన్‌ఫ్రాక్ట్రక్చర్‌లపై దృష్టిసారిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని పబ్లిక్ యూనివర్సిటీల్లో అప్లయ్‌డ్ ఇన్నోవేషన్స్, టాలెంట్ డెవలప్‌మెంట్, ఆర్ అండ్ డి అభివృద్ధికి సెంటర్ ఆఫ్ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విలియం ఎల్.మీనీ మాట్లాడుతూ...రాబోయే 3-5 సంవత్సరాలలో క్లౌడ్, ఎంటర్‌ప్రైజ్, హైపర్‌స్కేల్ విభాగాల నుంచి డిమాండ్‌ను అంచనా వేస్తూ, అభివృద్ధి చెందుతున్న క్యాంపస్‌లలో ఏఐ-రెడీ మౌలిక సదుపాయాలను నిర్మించడంపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు.(ఐరన్ మౌంటైన్ సంస్థ 2021లో వెబ్‌వర్క్స్ భాగస్వామ్యంతో భారతదేశ డేటా సెంటర్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. భారత్‌లో రాబోయే రెండేళ్లలో ఈ సంస్థ 150మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని భావిస్తోంది.)

# విశాఖలో డెడికేటెడ్ సెంట్రలైజ్డ్ స్కిల్లింగ్ క్యాంపస్

**- కాగ్నిజెంట్ ఉన్నతస్థాయి బృందానికి మంత్రి లోకేష్ వినతి**

దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ సింగిశెట్టి, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ జతిన్ దలాల్, ప్రెసిడెంట్ అమెరికాస్ సూర్య గుమ్మడిలతో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్‌లో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో కాగ్నిజెంట్ ఐటీ క్యాంపస్ పనులను వేగవంతం చేయాలని కోరారు. తాత్కాలిక సౌకర్యాల ద్వారా ముందస్తు ఉద్యోగుల సంఖ్యను పెంచే అంశాన్ని పరిశీలించండి. ఏఐ, జెన్ ఏఐ,క్లౌడ్, డేటా,డిజిటల్ ఇంజనీరింగ్, సీటీఎస్ నియామక అవసరాలకు విశాఖలో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యాన డెడికేటెడ్ సెంట్రలైజ్డ్ స్కిల్లింగ్ క్యాంపస్ ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్నోవేషన్స్, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH)తో భాగస్వామ్యం వహించండి. దీనిద్వారా ఏఐ, డిజిటల్ ప్రొడక్ట్ స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రైజ్ మెంటరింగ్, పైలట్ ప్రాజెక్టుల విస్తరణపై దృష్టి సారించవచ్చు. ఏపీ స్టార్టప్‌లను ఎంటర్‌ప్రైజ్-రెడీ సొల్యూషన్స్‌గా మార్చడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రపంచ అవసరాల కోసం డైరెక్ట్ టాలెంట్ పైప్‌లైన్ అందించేందుకు ఏపీ విశ్వవిద్యాలయాలతో కలిసి ఏఐ ల్యాబ్‌లు, అప్లయ్‌డ్ రీసెర్చ్, ఇంటర్న్‌షిప్‌లు, హైర్-లింక్డ్ క్యాప్‌స్టోన్ ప్రోగ్రామ్‌లకు పరిశ్రమ-విద్యాచట్రాన్ని రూపొందించేందుకు ఇండస్ట్రీ-అకడమియా కొలాబరేషన్‌కు ముందుకురావాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.



# ఏపీలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

- లక్ష ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టులు
- ముందుకొచ్చిన ఆర్ఎంజడ్ సంస్థ
- దావోస్‌లో మంత్రి లోకేష్ సమక్షంలో ఆర్ఎంజడ్ ప్రకటన
- విశాఖలో 50 ఎకరాల్లో జీసీసీ పార్క్
- 1 గిగావాట్ లక్ష్య సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్
- రాయలసీమలో 1000 ఎకరాల్లో పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్
- మంత్రి లోకేష్ చర్చలు ఫలవంతం




దావోస్/స్విట్జర్లాండ్) (చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపీలో మరో భారీ పెట్టుబడికి ఆర్ఎంజడ్ (RM) సంస్థ ముందుకు వచ్చింది. దావోస్‌లో ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్ మెండాతో మంగళవారం మంత్రి లోకేష్ జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆర్ఎంజడ్ సంస్థ ముందుకు వచ్చింది. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించడం, విశాఖనగరంలో జీసీసీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విశాఖపట్నం కాపులుప్పాడ ఫేజ్-1 ఐటీ పార్క్‌లో సుమారు 50 ఎకరాలలో 10 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో జీసీసీ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి ఆర్ఎంజడ్ గూప్ అంగీకరించింది. దావోస్‌లో జరుగుతున్న 2026 వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్ మెండా ఈ వ్యూహాత్మక పెట్టుబడి భాగస్వామ్యాన్ని ప్రకటించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మిక్స్‌డ్ యూజ్, డిజిటల్, పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుంది. రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామిక, లాజిస్టిక్స్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తూనే, విశాఖపట్నాన్ని నెక్స్ట్ జెన్ మిక్స్‌డ్ యూజ్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా మార్చాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఆర్ఎంజడ్ ఈ పెట్టుబడులు పెట్టనుంది.

విశాఖపట్నం ప్రాంతంలో దశలవారీగా 1 గిగావాట్ వరకు లక్ష్య సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కూడా ఆర్ఎంజడ్ గ్రూప్ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. దీనికి విశాఖపట్నం ప్రాంతంలో సుమారు 500 నుండి 700 ఎకరాల భూమి అవసరం. ఈ ప్రాజెక్ట్ నెక్స్ట్ జెన్ డిజిటల్, ఏఐ వర్క్ లోడ్‌కు మద్దతు ఇస్తుంది. స్థిరత్వం, గ్రీన్ పవర్ ఇంటిగ్రేషన్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. ఇదిలావుండగా రాయలసీమలో టేకులోడు వద్ద ఆర్ఎంజడ్ గ్రూప్ సుమారు 1,000 ఎకరాలలో పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించింది. ఈ ప్రాంతంలో పారిశ్రామిక తయారీ, గిడ్డంగులు, లాజిస్టిక్స్ కార్యకలాపాలను అభివృద్ధి చేస్తుంది. ఈ ప్రాజెక్టులన్నింటిపై కలిపి రాబోయే ఐదేళ్లలో ఆర్ఎంజడ్ సంస్థ సుమారు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడిని పెట్టనుంది. దీని ద్వారా ఐటీ, డేటా సెంటర్లు, పారిశ్రామిక, లాజిస్టిక్స్ రంగాలలో సుమారు లక్ష మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది. సింగిల్ విండో విధానం ద్వారా కాలపరిమితులతో కూడిన అనుమతులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై ఏపీ ప్రభుత్వం తమ కమిట్‌మెంట్‌ను మరోసారి స్పష్టం చేసింది. ఏపీ ప్రభుత్వం అనుసరిసరిస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.

# గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు



- 2029 నాటికి సాధించటమే లక్ష్యం
- ఏపీకి ఇప్పటికే రూ.5.22 లక్షల కోట్ల మేర క్లీన్ ఎనర్జీ పెట్టుబడులు
- తద్వారా పునరుత్పాదక శక్తి, అనుబంధ రంగాల్లో 2.7 లక్షల ఉద్యోగాల కల్పన
- సస్టెయినబులిటీపై సీఐఐ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్

దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): గ్రీన్ ఎనర్జీ రంగంలో 2029 నాటికి రూ.10లక్షల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యం.. క్లీన్ ఎనర్జీ రంగంలో ఏపీ ఇప్పటికే రూ.5.22 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది.. తద్వారా పునరుత్పాదక శక్తి, అనుబంధ రంగాల్లో 2.7లక్షల ఉద్యోగాలు రానున్నాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సుస్థిరతను విస్తృతస్థాయిలో అమలుచేయడం: ప్రపంచ పరివర్తనకు మార్గాలు (Sustainability at Scale: Pathways for Global Transformation) అనే అంశంపై సీఐఐ (Confederation of Indian Industry) ఆధ్వర్యంలో దావోస్‌లో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఐఐ నిర్వహించిన ఈ సమయోచిత చర్చలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. సస్టెయినబులిటీ ఇప్పుడు ఉద్దేశాల దశను దాటి అమలు దశలోకి ప్రవేశించింది. ఇది కార్యాచరణకు అంకితమైన దశాబ్దం. సస్టెయినబులిటీని మూడు విధాలుగా చూస్తున్నాం. మొదటిది ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రిగా మేం 6 గిగావాట్ల డేటా సెంటర్ల సామర్థ్యాన్ని రాష్ట్రంలో నెలకొల్పుతున్నాం. ఇందుకు అవసరమైన విద్యుత్‌ను కాలుష్యరహితంగా అందించడానికి ప్రభుత్వం 24 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. విశాఖలో గూగుల్ ఏఐ హబ్‌ను ఇప్పటికే ప్రారంభించాం. ఇది భారతదేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి. ఇది డిజిటల్ గ్రోత్, క్లీన్ ఎనర్జీ ఒకేసారి ముందుకు సాగాల్సిన అవసరాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు.

## ఫలితాలపైనే దృష్టి

రెండోది ఉద్యోగాల కల్పన కోసం ఏర్పాటైన కేబినెట్ కమిటీ ఛైర్మన్‌గా నేను అవుట్‌కమ్స్ పైనే దృష్టి పెడతాను. ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక శక్తి, అనుబంధ రంగాల్లో అమలులో ఉన్న ప్రాజెక్టుల ద్వారా 2.7 లక్షలకు పైగా ఉద్యోగాలు రానున్నాయి. మూడోది ఏపీలో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని ఆమోదించాం. తద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో 2029 నాటికి 125 బిలియన్ డాలర్ల (రూ.10 లక్షల కోట్లు) పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇవి సౌర, పవన, నిల్వ (స్టోరేజ్), గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో రానున్నాయి. మేం కేవలం కెపాసిటీ మాత్రమే కాకుండా మ్యానుఫ్యాక్చరింగ్, స్కిల్స్, సప్లయి చైన్స్ సహా పూర్తి ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నాం. ఏపీలో గత 18 నెలల కాలం ఇందుకు బలమైన నిదర్శనమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## జర్మనీకి గ్రీన్ అమ్మోనియా ఎగుమతి

గతేడాది, సీఐఐ వేదికలపై కుదిరిన ఎంవోయూల ద్వారా ఆంధ్రప్రదేశ్ 65 బిలియన్ డాలర్ల (రూ.5.22 లక్షల కోట్లు) విలువైన క్లీన్ ఎనర్జీ పెట్టుబడులను ఆకర్షించింది. ఆయా పెట్టుబడులు పునరుత్పాదక శక్తి, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో 2.7 లక్షల ఉద్యోగాలను కల్పిస్తాయి. భారతదేశ సౌర రంగం ఇప్పుడు మాడ్యూళ్ల విషయంలో స్వయం సమృద్ధిని సాధించింది. తదుపరి దశ సెల్స్, ఇంగాట్స్, వాఫర్లలో ఉంది. ఇందులో భారతదేశ టాప్ 10 సౌర పరికర తయారీదారుల్లో 5 సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఒక ప్రాజెక్ట్ భారత్ నుంచి జర్మనీకి ప్రపంచంలోనే తొలి దీర్ఘకాలిక గ్రీన్ అమ్మోనియా ఎగుమతి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇప్పటికే నిర్మాణం ప్రారంభమైంది. ఇది కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాదు, మొత్తం భారతదేశానికి కీలక మలుపు. ఎనర్జీ దిగుమతిదారుడి నుంచి ఎనర్జీ ఎగుమతిదారుడిగా మారుతున్న దిశలో ఒక చారిత్రక అడుగుగా మంత్రి లోకేస్ పేర్కొన్నారు.

## మా విధానాలపై నమ్మకం

రాూజుూ కేవలం ఏడు నెలల్లోనే 600 మెగావాట్ల ప్లాంట్‌ను ప్రారంభించింది. ఇప్పటికే తదుపరి 550 మెగావాట్ల ప్రాజెక్టును కూడా ప్రారంభించింది. రెన్యూ(ReNew) సంస్థ 2.5 గిగావాట్ల హైబ్రిడ్ ప్రాజెక్టుతో మొదలుపెట్టి, ఇప్పుడు విశాఖపట్నం సమీపంలో 6 గిగావాట్ల వాఫర్, ఇంగాట్ తయారీ యూనిట్‌లో పెట్టుబడి పెడుతోంది. టాటా పవర్ 7 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రారంభించి, ఇప్పుడు 10 గిగావాట్ల తయారీ సదుపాయం ఏర్పాటు చేయడానికి తిరిగి వస్తోంది. ఈ పెట్టుబడులే మా విధానాలపై ఉన్న నమ్మకానికి అతిపెద్ద సాక్ష్యం. మా లక్ష్యం 2.7 లక్షల గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాలు. దీనికి విస్తృత స్థాయిలో నైపుణ్యాభివృద్ధి మద్దతుగా ఉంది. ఎనర్జీ ట్రాన్‌సిషన్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్, ఐఐటీ తిరుపతితో ఒప్పందం కుదుర్చుకుంటామని మంత్రి లోకేష్ తెలిపారు.

## నాలుగు అంశాలు కీలకం

భవిష్యత్ లక్ష్యాలను నాలుగు అంశాలు దిశానిర్దేశం చేస్తున్నాయి. పర్యావరణ వ్యవస్థకు ప్రాధాన్యత - విద్యుత్ ఉత్పత్తి నుంచి గ్రీన్ ఫ్యూయెల్స్ తయారీ వరకు సమగ్ర దృష్టి. జాతీయ పీఎల్ఐ మద్దతు పొందిన పది కంపెనీల్లో ఐదు ఆంధ్రప్రదేశ్ లోనే ఉన్నాయి. రియల్-టైమ్ గవర్నెన్స్ - అమలు, పారదర్శకత, బాధ్యతను మెరుగుపరచడానికి డేటా ఆధారిత పర్యవేక్షణ. గ్రీన్ జాబ్స్, స్కిల్స్ - ఐదేళ్లలో 3 లక్షల క్లీన్ ఎనర్జీ ఉద్యోగాలతోపాటు అన్ని రంగాల్లో కలిపి 20లక్షల ఉద్యోగాల విస్తృత లక్ష్యానికి తోడ్పాటు. విధాన స్థిరత్వం, సామర్థ్యం - 2030-31 నాటికి రూ.8వేల కోట్ల శక్తి సామర్థ్య పెట్టుబడులు. ఎందుకంటే కేవలం సామర్థ్య పెంపే ఉద్గారాల తగ్గింపులో దాదాపు 40% సామర్థ్యాన్ని అందించగలదు. సమగ్ర పాలన ద్వారా ఎలాంటి ఫలితాలు వస్తాయనేందుకు ఏపీ నిదర్శనంగా నిలుస్తోంది. కేవలం ఆశయాలు, లక్ష్యాల గురించి మాట్లాడకుండా, వాటిని అమలు చేయడంపై ప్రభుత్వాలు, పరిశ్రమలు, పెట్టుబడిదారులను ఏకం చేయడానికి ఇలాంటి రౌండ్ టేబుల్ సమావేశాలు చాలా అవసరం. విస్తృతస్థాయి ఆవిష్కరణ, ప్రజా స్వామ్య న్యాయబద్ధత, బలమైన అమలు సామర్థ్యంతో ఇండియా, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు ప్రపంచ భాగస్వామ్యాలకు సిద్ధంగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐఐ ఇండియా సస్టెయిన బులిటీ టాస్క్ ఫోర్స్ ఛైర్మన్ జయంత్ సిన్హా, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# మారిటైమ్ మౌలిక సదుపాయాల్లో జపాన్ పెట్టుబడులకు సహకరించండి

- సీబీఐసీ కారిడార్ వెంట జపాన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ అభివృద్ధి చేయండి
- జేబీఐసీ ఎండీ షిగెటోకు మంత్రి లోకేష్ వినతి

దావోస్/స్విట్జర్లాండ్ (చైతన్యరథం): జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (JBIC) ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ హషియామా షిగెటోతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్‌లో మంగళవారం భేటీ అయ్యారు. ఏపీలో భారీఓడరేవుల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇంధన భద్రత, ఇతర కేంద్రీకృత రంగాలకు నిధులు సమకూర్చడం, ఎఫ్‌డీఐలను సులభతరం చేయడంలో ఆంధ్రప్రదేశ్‌తో సంస్థాగత భాగస్వామ్యం వహించాలని కోరారు. షిప్ బిల్డింగ్, సెమీ కండక్టర్లు, ఆటోమొబైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో జపాన్ పెట్టుబడులకు మార్గనిర్దేశం చేయడంలో సహకారం అందించండి. ఆంధ్రప్రదేశ్‌లోని మూలపేట, మచిలీపట్నం, దుగరాజపట్నంలలో రాబోయే నౌకా




నిర్మాణ క్లస్టర్‌లలో నౌకానిర్మాణం, నౌకా మరమ్మత్తు సౌకర్యాలను స్థాపించడానికి జపాన్ నౌకానిర్మాణం, మారిటైమ్ ఇంజనీరింగ్ కంపెనీలను ప్రోత్సహించండి. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ) వెంట ఆంధ్రప్రదేశ్‌లో జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ (జేఐటీ) అభివృద్ధి చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

మంత్రి లోకేష్ వినతిపై జేబీఐసీ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ హషియామా షిగెటో మాట్లాడుతూ... పబ్లిక్ ప్రాజెక్టుల కోసం జాతీయ పెట్టుబడి, మౌలిక సదుపాయాల నిధుల ద్వారా భారతదేశంలో జేబీఐసీ పెట్టుబడులను కొనసాగిస్తోందన్నారు. ఎన్‌టీపీసీకి విద్యుత్ సరఫరా చేసే ఎస్‌బీజీ క్లీన్‌టెక్ ప్రాజెక్ట్‌కు, 350 మెగావాట్ల కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్కుకు (2017) జేబీఐసీ ప్రాజెక్ట్ ఫైనాన్స్ రుణం ద్వారా నిధులు సమకూర్చింది. విశాఖపట్నంలోని అచ్యుతాపురం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న టైర్ల తయారీ కర్మాగారం (ఏటీసీ టైర్స్ - యోకోహామా) విస్తరణ కోసం పర్యావరణ పరిశీలనను పూర్తి చేసింది. జేబీఐసీ మద్దతుతో భారతదేశంలో జపాన్ పెట్టుబడులు ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ సేవలు, తయారీ, మౌలిక సదుపాయాల రంగాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి.

జపాన్ సంస్థలకు అత్యంత ఆశాజనకమైన పెట్టుబడి గమ్యస్థానాల్లో భారతదేశం స్థిరమైనదిగా ఉంది. పునరుత్పాదక ఇంధనం, తదుపరి తరం ఇంధనం, ఇంధన-సామర్థ్య ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడానికి పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్ తో రూ.6,500 కోట్ల గ్రీన్ క్రెడిట్ లైన్‌ను జేబీఐసీ ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని హషియామా షిగెటో చెప్పారు.

# కాకినాడ తీరాన హరిత విప్లవం

## ప్రపంచ ఇంధన రాజకీయాల్లో ఆంధ్రప్రదేశ్ కొత్త అధ్యాయం

నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రలో కొన్ని సందర్భాలు కేవలం ఒక రోజు సంఘటనలుగా కాకుండా,దశాబ్దాల ప్రభావం చూపే మలుపులుగా నిలుస్తాయి. కాకినాడ తీరంలో ఏఎం గ్రీన్ సంస్థ నిర్మిస్తున్న గ్రీన్ అమోనియా ప్లాంట్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శంకుస్థాపన చేసిన రోజు అలాంటి ఘట్టాల్లో ఒకటి. ఇది ఒక పరిశ్రమకు వేసిన పునాది కాదు; ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తుకు, ప్రపంచ ఇంధన పరివర్తన ప్రస్థానంలో రాష్ట్ర స్థాయిలో వేసిన పునాది.

ప్రపంచం నేడు ఒక కీలక దశలో ఉంది. శిలాజ ఇంధనాలపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలు పర్యావరణ ఒత్తిడితో ఊపిరాడక, ప్రత్యామ్నాయ శక్తి వనరుల వైపు వేగంగా మళ్లుతున్నాయి. యూరోప్, జపాన్, కొరియా వంటి దేశాలు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియాను భవిష్యత్తు ఇంధనాలుగా ప్రకటించాయి. ఇలాంటి సమయంలో, కాకినాడ తీరంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌ను కేవలం దేశీయ పరిశ్రమల మ్యాప్‌లో కాదు, అంతర్జాతీయ ఇంధన రాజకీయాల్లోనూ ఒక కీలక కేంద్రంగా మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

ప్రస్తుతం ప్రపంచంలో గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో సౌదీ అరేబియాలోని చీజూవీ, నార్వేలోనిగ్‌ఖేతీఖు వంటి ప్రాజెక్టులే ప్రధానంగా వినిపిస్తున్న పేర్లు. వాటి సరసన ఇప్పుడు కాకినాడ పేరు చేరుతోంది. వార్షికంగా 1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్ ప్రపంచస్థాయిలోనే అతిపెద్దప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుంది. మరింత ముఖ్యంగా, ఇప్పటికే ఉన్న పాత ప్లాంట్‌ను గ్రీన్ ప్లాంట్‌గా మార్చే Brownfield Conversion విధానంలో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా రికార్డు సృష్టించబోతోంది.ఇది కేవలం పర్యా వరణ హితమైన మార్పు మాత్రమే కాదు;ఖర్చు, సమయం, వనరుల వినియోగంలోనూ సమర్థతనుచాటే నమూనా.

దేశంలో ఒడిశా, గుజరాత్ వంటి పారిశ్రామిక రాష్ట్రాలు గ్రీన్ అమోనియా ప్రాజెక్టులపై ప్రతిపాదనలు, ఒప్పందాల దశలో ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ఆచరణలో ముందడుగు వేసింది. 'విజన్'ను 'ఎగ్జిక్యూషన్'గా మార్చడంలో ఏపీ చూపుతున్న ఈ వేగమే రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపునిస్తోంది. దేశంలోనే తొలి గ్రీన్ అమోనియా ఎగుమతిదారుగా నిలవడం అంటే, భారత్ గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా మారినట్టే.

ఈ ప్రాజెక్ట్‌ను ప్రత్యేకంగా నిలబెట్టే అంశం దాని ఎనర్జీ ఆర్కిటెక్చర్. గ్రీన్ అమోనియా ఉత్పత్తికి నిరంతర విద్యుత్తు అవసరం. దానికి సమాధానంగా 7.5 గిగావాట్ల సోలార్,విండ్ పవర్‌తో పాటు పిన్నపురంలో నిర్మిస్తున్న పంప్‌డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టును అనుసంధానం చేయడం ఒక వ్యూహాత్మక నిర్ణయం. ఇది 'రౌండ్ ది క్లాక్ గ్రీన్ పవర్' అనే భావనను ఆచరణలోకి తెస్తుంది. స్వచ్ఛమైన విద్యుత్తు ఉత్పత్తి, నిల్వ, వినియోగం -ఈ మూడు అంశాలను ఒకే వ్యవస్థలో కలిపినప్పుడు మాత్రమే గ్రీన్ ఎనర్జీ నిజమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది. కాకినాడ ప్రాజెక్ట్ ఆ మోడల్‌ను ప్రపంచానికి చూపబోతోంది.

ఇది కేవలం అమోనియా ప్లాంట్ మాత్రమే కాదు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో కీలకమైన ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను 2GW సామర్థ్యంతో, రూ.2,000 కోట్ల పెట్టుబడితో ఇక్కడే ఏర్పాటుచేయడం ఈ ప్రాజెక్ట్‌ను ఒక సమగ్ర ఇండస్ట్రియల్ ఎకోసిస్టంగా మార్చుతోంది. ఇప్పటివరకు ఈ పరికరాల కోసం భారత్ విదేశాలపై ఆధారపడేది. ఇప్పుడు కాకినాడలోనే తయారీ జరగడం వల్ల దేశీయ తయారీ రంగానికి బలం చేకూరడమే కాకుండా, 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా మారుతోంది.

అంతర్జాతీయ మార్కెట్ల స్పందన ఈ ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను మరింత స్పష్టం చేస్తోంది. జర్మనీకి చెందిన యూనిపర్, నార్వేకు చెందిన యారా వంటి ప్రపంచ స్థాయి ఎనర్జీ దిగ్గజాలతో ఇప్పటికే ఒప్పందాలు కుదిరాయి. 2027నాటికి కాకినాడ నుంచి యూరోప్ దేశాలకు నౌకల ద్వారా గ్రీన్ అమోనియా ఎగుమతులు ప్రారంభమవుతాయి. ఇది కేవలం వాణిజ్య లావాదేవీ కాదు; కార్బన్ న్యూట్రాలిటీ లక్ష్యాల వైపు ప్రపంచం సాగిస్తున్న ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ భాగస్వామిగా నిలుస్తున్న సంకేతం.

పర్యావరణ పరిరక్షణ కోణంలో ఈప్రాజెక్ట్ ప్రభావం విస్తృతమైనది. ఏడాదికి సుమారు రెండు మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించడం అంటే, లక్షలాది వాహనాలను రోడ్ల నుంచి తొలగించినంత ప్రభావం. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పు వంటి సమస్యలు ఇప్పుడు భవిష్యత్తు తరాల సమస్యలు కాదు; వర్తమాన రాజకీయాల కేంద్ర బిందువులు. ఆ సమస్యల పరిష్కారాల వైపు అడుగులు వేస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తన గుర్తింపును చాటుతోంది.

ఆర్థికంగా ఈ ప్రాజెక్ట్ ప్రభావం మరింత లోతైనది. ప్రాథమికంగా రూ.13వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభమై, దశలవారీగారూ.90 వేల కోట్ల వరకు విస్తరించే ఈ ప్రాజెక్ట్ ద్వారా నిర్మాణ దశలో సుమారు 8,000 మందికి ఉపాధి, ప్రాజెక్ట్ పూర్తయ్యాక 2,600 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయి. ఇది కేవలం సంఖ్యల కథ కాదు. కాకినాడ ప్రాంతంసామాజిక-ఆర్థిక రూపురేఖలను మార్చే ప్రక్రియ ఇది. పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి, హైటెక్-క్లీన్ ఎనర్జీ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు కాకినాడ నగరం అడుగులు వేస్తోంది.

చంద్రబాబు దశాబ్దాలుగా చూపిస్తున్న పారిశ్రామిక దృష్టి ఈప్రాజెక్ట్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. హైదరాబాద్‌ను ఐటీ రాజధానిగా మార్చిన అనుభవం ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతోంది. పర్యావరణ పరిరక్షణను అడ్డంకిగా కాకుండా, అభివృద్ధికి బాటగా మార్చే ఆలోచన ఈప్రాజెక్ట్ వెనుక ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భాగస్వామ్యం ఈ ప్రాజెక్ట్‌కు ప్రజాస్వామ్య మద్దతు, సామాజిక అంగీకారాన్ని మరింత బలపరుస్తోంది.

కాకినాడ తీరంలో మొదలైన ఈ గ్రీన్ ప్రయాణం రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాదు. ఇది భారతదేశం గ్రీన్ ఎనర్జీ రంగంలో ప్రపంచానికి చెప్పబోయే చరిత్రలో ఒక కీలక అధ్యాయం. 2027లో ఇక్కడి నుంచి తొలి గ్రీన్ అమోనియా ఎగుమతి నౌక సముద్రంలోకి దూసుకెళ్లిన క్షణం, ఆంధ్రప్రదేశ్ పేరు ప్రపంచ ఇంధన పటంలో శాశ్వతంగా ముద్రపడుతుంది. అది కేవలం ఒక నౌక ప్రయాణం కాదు; ఒక రాష్ట్రం భవిష్యత్తు దిశగా సాగుతున్న ప్రయాణానికి చిహ్నం.

### నాడు గ్రీన్‌కో 'పీక' నొక్కి.. నేడు క్రెడిట్ కోసం డ్రామా?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో "సిగ్గు" అనే పదానికి కొత్త అర్థాలు జోడించాల్సిన అవసరం వచ్చిందా అన్న సందేహం ఇప్పుడు సహజంగానే కలుగుతోంది. కాకినాడ తీరంలో గ్రీన్‌కో(ఏఎం గ్రీన్) సంస్థ రూ.83వేల కోట్ల భారీ పెట్టుబడులతో మెగాప్రాజెక్టుకు భూమిపూజ చేస్తుంటే, తాడేపల్లి ప్యాలెస్ గోడల మధ్య నుంచి వినిపిస్తున్న ఆవేదన మాత్రం రాజకీయంగా హాస్యాన్ని మించిన స్థాయిలో ఉంది. "ఇది మా జగనన్న విజయం.. మా హయాంలోనే సంతకాలు జరిగాయి"అంటూ నీలి మీడియా చేస్తున్న హడావిడి చూస్తుంటే, నిన్న దాడి చేసిన వాడే ఈ రోజు బాధితుడి తరపున మాట్లాడుతున్నట్టి అనిపిస్తోంది. రాజకీయాల్లో జ్ఞాపకశక్తి ఎంత చిన్నదైపోయిందో, లేదా ప్రజలను ఎంత సులభంగా మర్చిపోయేలా చేయవచ్చని భావిస్తున్నారో అర్థమవుతోంది.

జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న అత్యంత వివాదాస్పదనిర్ణయాల్లో ముందువరుసలో నిలిచింది విద్యుత్‌రంగంపై చేసిన దాడే. ముఖ్యంగా పునరుత్పాదక శక్తి రంగంలో అప్పటికే అమల్లో ఉన్న పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లను(పీపీఏ) ఏకపక్షంగా పున:పరిశీలించి రద్దుచేయాలన్న నిర్ణయం, రాష్ట్ర పెట్టుబడి వాతావరణానికి పెద్ద దెబ్బ. ఆ సమయంలో గ్రీన్‌కో వంటి సంస్థలు జగన్ మాటల్లో 'చంద్రబాబు అనుకూల సంస్థలు', 'దోపిడీదారులు'. ఒప్పందాల పవిత్రతను పక్కన పెట్టి, న్యాయసూత్రాలకు విరుద్ధంగా సంస్థల మెడపై కత్తి పెట్టిన జగన్ చరిత్ర రాష్ట్రానికి తెలిసిందే. గ్రీన్‌కో వంటి సంస్థలను మూడేళ్లపాటు ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేసిన వాస్తవాన్ని ఇప్పుడుఎవరు ఖండించగలరు? తమ పెట్టుబడులు కాపాడుకోవడానికి ఆ సంస్థ హైకోర్టు మెట్లు ఎక్కిజగన్ ప్రభుత్వంతో న్యాయపోరాటం చేయాల్సి వచ్చిన పరిస్థితి రావటం ఒక పెట్టుబడిదారుడికి ఎంత అవమానకరమో, రాష్ట్రానికి కూడా అంతేస్థాయిలో అపకీర్తి. చివరికి కోర్టు మొట్టికాయలు వేసి, "బకాయిలు చెల్లించాల్సిందే" అని ప్రభుత్వం నుండి ముక్కు పిండి వసూలు చేయించే వరకు, పాలకుల్లో కనీస చలనం రాలేదు.

ఇదంతా జరిగిన తరువాత అంతర్జాతీయ స్థాయిలో క్రెడిట్ రేటింగ్ దెబ్బతింది, పెట్టుబడిదారుల్లో భయం పెరిగింది, "ఆంధ్రప్రదేశ్ అంటే ఒప్పందాలకు విలువ లేని రాష్ట్రం" అన్న భావన ప్రపంచానికి వెళ్లింది. ఈ నష్టానికి కారణం ఎవరు? పీపీఏలు రద్దు చేస్తూ, పరిశ్రమలను తరిమేస్తూ, కోర్టుల చుట్టూ తిప్పిన పాలన ఎవరిది? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసినప్పటికీ, ఇప్పుడు అదే సంస్థ పెట్టుబడులు పెడితే "అంతా మా హయాంలోనే జరిగింది" అని చెప్పుకోవడం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ట.

నిజానికి గ్రీన్‌కో సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో నిలబడిందంటే అది జగన్ విధానాల వల్ల కాదు. న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసం వల్ల, ఒప్పందాల పవిత్రతను తిరిగి ప్రతిష్టించాలన్న ప్రస్తుత కూటమి ప్రభుత్వ స్పష్టమైన సంకల్పం వల్ల మాత్రమే. పరిశ్రమలకు భరోసా కల్పిస్తామన్న సంకేతాలు, విధానాల్లో స్థిరత్వం, పెట్టుబడిదారులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ - ఇవన్నీ కలిసే ఇప్పుడు ఇలాంటి మెగా ప్రాజెక్టులకు మార్గం వేసాయి. దీనిని పక్కన పెట్టి, నాడు పరిశ్రమలను తరిమేసినవారే నేడు క్రెడిట్ కొట్టేయాలనుకోవడం ప్రజలను అవమానపరచడమే.

ఒక ఊరిని తగలబెట్టిన వాడు, అక్కడ కొత్త ఇల్లు కడుతుంటే "ఆ మంటలు నేనే పెట్టాను కాబట్టే అభివృద్ధి జరిగింది" అని చెప్పుకున్నట్టుగా ఉంది ఈ క్రెడిట్ డ్రామా. జగన్ హయాంలో గ్రీన్‌కోకు ఇచ్చింది పెట్టుబడుల ప్రోత్సాహం కాదు, షోకాజ్ నోటీసులు. భరోసా కాదు, భయం. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల వెనుక ఉన్నది పూర్తిగా భిన్నమైన పాలనా విధానం.

చివరగా ఒక విషయం స్పష్టంగా చెప్పుకోవాలి. క్రెడిట్ కొట్టేయడంలో చూపిన శ్రద్ధ, ఆనాడు 'సాంక్టిటీ ఆఫ్ కాంట్రాక్ట్స్' కాపాడటంలో చూపించి ఉంటే, రాష్ట్రానికి ఈ స్థాయి నష్టం జరిగేది కాదు. జగన్ విత్తిన విధ్వంసపు విత్తనాల నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. ఆ మధ్యలో ఈ క్రెడిట్ గోల ఎందుకు? అభివృద్ధిని అడ్డుకుని, ఆ తర్వాత అదే అభివృద్ధిపై హక్కులు చెప్పుకోవడం రాజకీయ నీతికి, ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధం.

**- జమ్ము సాయి కల్యాణ్,**
**అనలిస్టు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

# రైతు ద్రోహి - వై'ఛీ'పి పాలిటిక్స్?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక అబద్ధాన్ని పదే పదే చెబితే అది నిజం అయిపోతుందని నమ్మే జగన్ రెడ్డి, తన సొంత మీడియాలో రైతులకు పచ్చి అబద్ధాలను వండి వడ్డిస్తున్నారు. అబద్ధాన్ని వండటంలో వై'ఛీ'పి పాలిటిక్స్ శైలే వేరు. ముఖ్యంగా రైతులకు అందాల్సిన పంటల బీమా విషయంలో జగన్ రెడ్డి ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుతూ అభూత కల్పనలు ప్రచారం చేస్తున్నారు. తామేదో ఉద్ధరించామని, కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ, గడిచిన పదేళ్ల గణాంకాలను చూస్తే రైతులను నిలువునా ముంచింది ఎవరో, అసలైన రైతు ద్రోహి ఎవరో స్పష్టంగా అర్థమవుతుంది.

### కూటమి ప్రభుత్వ 18 నెలల ప్రగతి ప్రస్థానం

వైసీపీ పాలనలో ధాన్యం అమ్ముకున్న డబ్బుల కోసం నెలల తరబడి రోడ్లెక్కి ధర్నాలు చేసిన రైతులు, నేడు కూటమిప్రభుత్వంలో గర్వం గాతల ఎత్తుకుంటున్నారు. బాధ్యతలు చేపట్టిన 18నెలల్లోనే వ్యవసాయ రంగాన్ని చంద్రబాబు ప్రభుత్వం గాడిలో పెట్టింది. ధాన్యం కొనుగోలుచేసిన 24గంటల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు జమచేస్తూ అన్నదాతకు ఆర్థిక భరోసా కల్పించింది. గతంలో అటకెక్కిన డ్రోన్లు, ఆధునిక వ్యవసాయ యంత్రాలను భారీ సబ్సిడీలతో రైతులకు అందిస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. ఒకప్పుడు ఆత్మహత్యల ఆంధ్రప్రదేశ్‌గా పేరుతెచ్చిన వైసీపీ చీకటి పాలనను అంతంచేస్తూ, నేడు పారదర్శక పాలనతో రైతుల ఆత్మహత్యలనుగణనీయంగా తగ్గించింది. రైతు కష్టాన్ని దోచుకునే దళారీ వ్యవస్థను అరికట్టి, క్షేత్రస్థాయిలో రైతుకు మద్దతుగా నిలుస్తూ ఈ కూటమి ప్రభుత్వం నిజమైన 'రైతు పక్షపాతి' అని నిరూపించుకుంటూ ముందుకు అడుగులు వేస్తుంది.

### గత టీడీపీ ప్రభుత్వంలో పంటల బీమాపై భరోసా..

2014-19 మధ్య చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఆ ఐదేళ్లలో ఖరీఫ్, రబీ సీజన్ల కింద ఏకంగా రూ. 4,787 కోట్ల పంటల బీమాను రైతులకు అందజేసి కొండంత అండగా నిలిచింది. అప్పట్లో రైతులు తమ వంతుగా కేవలం 1.5% నుండి 2% ప్రీమియం చెల్లిస్తే, మిగిలిన సింహభాగాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భరించేవి. దీనివల్ల ఇన్స్యూరెన్స్ కంపెనీలకు జవాబుదారీతనం ఉండేది, రైతులకు సకాలంలో క్లెయిమ్స్ వచ్చేవి. కానీ జగన్ రెడ్డి రాగానే 'ఉచితం' అనే రంగు పూసి, లోపల భారీ స్కామ్‌కు తెరలేపారు. ఆయన హయాంలో రైతులు ప్రీమియం కట్టినప్పటికీ, అర్హత పొందిన వారందరికీ పరిహారం అందకుండా ఈ-క్రాప్ పేరుతో కోతలు విధించారు.

### ప్రీమియం ఎగ్గొట్టి.. పోర్టల్ మూయించిన ఘనుడు

జగన్ రెడ్డి చేసిన అతిపెద్ద తప్పు ఏమిటంటే.. ఇన్స్యూరెన్స్ కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియంను గాలికి వదిలేయడం. 2019-24 మధ్య కాలంలో గత ప్రభుత్వం రబీ, ఖరీఫ్ సీజన్లకు సంబంధించి ఏకంగారూ. 2,200 కోట్లకు పైగా ప్రీమియం బకాయి పెట్టింది. ఈ బకాయిల కారణంగా కేంద్ర ప్రభుత్వ పీఎంఎఫ్‌బీవై (ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన)పోర్టల్ ఏపీకి బ్లాక్ అయిపోయింది. 2023-24 సీజన్ లో 33 లక్షల మంది రైతులు రిజిస్టర్ చేసుకున్నా, ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో ఒక్క పైసా కూడా క్లెయిమ్ లభించలేదు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రైతులు దాదాపురూ. 3,000 కోట్లకు పైగా బీమా సొమ్మును నష్టపోయారు. ఇదీ... జగన్ రెడ్డి ఇచ్చిన 'ఉచిత' కానుక!

### కూటమి ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లు

జగన్ రెడ్డి పెట్టిన ఈ రూ. 2,200 కోట్ల బకాయిల వల్ల, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు బీమా అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో సాంకేతికంగా ఇబ్బందులు వస్తున్నాయి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, ఆ బకాయిలను నాలుగు విడతల్లో చెల్లించేలా ఒప్పించారు. మొదటి విడతగా రూ. 172 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇది పూర్తయితేనే పీఎంఎఫ్‌బీవై పోర్టల్ ఏపీకి తిరిగి అందుబాటులోకి వస్తుంది. గత ప్రభుత్వం చేసిన పాపాలను కడుగుతూ, రైతులకు తిరిగి బీమా రక్షణ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తోంది.

### సాక్షి అబద్ధాల వెనుక అసలు నిజం

వైసీపీ ప్రభుత్వం చేసిన బకాయిల వల్ల పోర్టల్ ఆగిపోతే, ఆ నిజాన్ని దాచిపెట్టి ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏదో ఎగ్గొట్టేస్తోందని సాక్షిలో అవాస్తవాలు రాస్తున్నారు. రైతులకు రావలసిన రూ. 3,000 కోట్ల బీమా సొమ్మును జగన్ రెడ్డి సర్కార్ మింగేసిందన్నది నగ్న సత్యం. గతంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా భూములపై రైతుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేసినట్లే, ఇప్పుడు బీమా విషయంలో కూడా అబద్ధపు ప్రచారంతో రైతులను మభ్యపెట్టాలని చూస్తున్నారు.

అప్పుల కుప్పగా మార్చిన వ్యవసాయ శాఖను మళ్ళీ గాడిలో పెట్టడం కూటమి ప్రభుత్వానికి సవాలుగా మారింది. కానీ, రైతుల ప్రయోజనాల కోసం చంద్రబాబు ప్రభుత్వం బకాయిలు చెల్లించి, పోర్టల్ ఓపెన్ చేయించే ప్రయత్నంలో నిమగ్నమై ఉంది. జగన్ రెడ్డి సాక్షిలో అబద్ధాలు వండి వడ్డించడం మానేసి.. ఆయన పాలనలో రైతులు కోల్పోయిన ఆ రూ. 3,000 కోట్లకు సమాధానం చెప్పాలి!

### 2014-19 నుండి 2019-24 వరకు పంటల బీమా వివరాలు

2014-19 — ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.4,787 కోట్లు క్రాప్ ఇన్స్యూరెన్స్ ద్వారా రైతులకు చంద్రబాబు ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది.

| సం. | ఖరీఫ్ | | | రబీ |
|---|---|---|---|---|
| | ప్రీమియం చెల్లించిన రైతులు | బీమా అర్హత పొందిన రైతులు | రైతులు పొందిన బీమా నగదు మొత్తం | |
| 2019-20 | 16.77 లక్షలు | 9.48 లక్షల మంది | రూ.1,252 కోట్లు | 0 |
| 2020-21 | 35.20 లక్షలు | 13 లక్షల మంది | రూ.1,739 కోట్లు | 0 |
| 2021-22 | 36.06 లక్షలు | 15.61 లక్షల మంది | రూ.2,977 కోట్లు | 0 |
| 2022-23 పీఎంఎఫ్‌బీవై | 38.05 లక్షలు | 10.26 లక్షల మంది | రూ.1,117 కోట్లు | 0 |
| 2023-24 | 33.01 లక్షలు | ప్రభుత్వం ప్రీమియం చెల్లించనందున క్లెయిమ్ లభించలేదు | | 0 |

నోట్: *2019-24 మధ్య గత వైసీపీ ప్రభుత్వం రబీ, ఖరీఫ్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం రూ.2,200 కోట్లకు పైగా చెల్లించకుండా బకాయిలు పెట్టింది. దీనివల్ల రైతులు రూ.3 వేల కోట్లకు పైగా రైతులు బీమా పరిహారం కోల్పోయారు. అంతేకాదు పీఎంఎఫ్‌బీవై పోర్టల్ మూతపడడానికి ఇదే ప్రధాన కారణం.*



## పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి నిమ్మల రామానాయుడు

భీమవరం: వాసవీ అమ్మవారు అబల కాదు.. ఆది పరాశక్తి, స్త్రీ శక్తికి ప్రతీకగా నిలిచారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం పశ్చిమ గోదావరి పెనుగొండ పుణ్యక్షేత్రంలో శ్రీవాసవీమాత కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ రోజును పురస్కరించుకొని పలు కార్యక్రమాలు చేపట్టారు. దీనికి హాజరైన మంత్రి రామానాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. ముందుగా ఆలయానికి చేరుకున్నమంత్రికి వేద పండితులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవాసవీ మాత కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ రోజును రాష్ట్ర పండుగగా సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. ప్రభుత్వం పెనుగొండను వాసవి పెనుగొండగా పేరు మార్చి ఆర్యవైశ్యులపై ఉన్న ప్రేమను చాటుకుందన్నారు. సమాజంలో శాంతి, ఐక్యత, సత్యమార్గం నిలవాలని ఆకాంక్షించారు.

## కూటమి ప్రభుత్వం.. రైతు పక్షపాత ప్రభుత్వం

**పల్నాడును హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం**
**ప్రత్తిపాటి ఆధ్వర్యంలో ఎడ్లపందేలు అభినందనీయం**
**సీమలోనూ ఘనంగా నిర్వహించాలనుకుంటున్నాం**
**బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**గత పాలనలో రైతులకు తీరని ద్రోహం: జీవీ**
**వినుకొండలోనూ పోటీలు నిర్వహిస్తాం: మక్కెన**



చిలకలూరిపేట(చైతన్యరథం): స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతితో మొదలై.. లోకేష్ జన్మదినం వరకు ఆరురోజులు ఘనంగా జాతీయ స్థాయి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి, చిలకలూ రిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వా హకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు మంత్రి సవిత తెలిపా రు. జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలలో భాగంగా మూడో రోజు ప్రత్యేక అతిథులుగా మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్ విఫ్ జీవీ.ఆంజనేయులు, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు హాజరయ్యారు. పోటీలకు వచ్చిన వారిని ప్రత్తిపాటి, ఎడ్లపందేల నిర్వాహకులు, రైతు సంఘాల నాయకులు ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎడ్ల పందేల్లో గెలుపొందిన ఎడ్ల విజేతల కు మంత్రి బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేశా రు. అనంతరం మంత్రి సవిత ఎడ్ల పందేలకు విచ్చేసిన రైతులు.. ప్రజలను ఉద్దేశించి సభలో ప్రసంగించారు. ఎడ్లపందేలకు రావా లని ప్రత్తిపాటి ఆహ్వానించారు. ఇక్కడకు వచ్చి చూశాక మా రాయ లసీమలో కూడా ఇంతకంటే ఘనంగా ఎడ్ల పందేలు నిర్వహించా లనే ఆలోచన వచ్చిందని సంతోషం వ్యక్తంచేశారు. ప్రత్తిపాటి పుల్లారావు స్వర్గీయ ఎన్టీఆర్ వద్ద శిష్యరికం చేశారు..అలాంటి గొప్ప నాయకుడి స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మనందరికీ గర్వకారణమని ప్రశంసించారు. రాయలసీమను ముఖ్యమంత్రి చంద్రబాబు హార్టికల్చర్, ఇండస్ట్రియల్, అగ్రికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారని ఆమె చెప్పారు. అదేవిధంగా పల్నాటి ప్రాంతాన్ని కూడా హర్టికల్చర్ హబ్‌గా మారుస్తారన్నారు. 2019-24లో రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడా జరగలేదని, పరదాలు చాటున తిరిగారని, గాల్లో పోతున్నా కింద ఉన్న చెట్లను నరికించారని ఎద్దేవా చేశారు. ఇప్పుడున్నది రైతుల పక్షపాత ప్రభుత్వమని, కాబట్టే రైతులకు సంతోషాన్నిచ్చే ఇలాంటి కార్యక్ర మాలు ఎంతో కోలాహాలంగా జరుగుతున్నాయని తెలిపారు. అసెంబ్లీలో, బయట తామెలా ప్రవర్తించాలో నిర్దేశించే హెడ్మాస్టర్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు..ఆయనకు ప్రత్యేక అభి నందనలు తెలియచేస్తున్నట్టు తెలిపారు.

### పల్నాడులో పండ్లతోటల సాగు: జి.వి.ఆంజనేయులు

చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో రాక్షస పాలనలో రాష్ట్రం నట్టేట మునిగింది.. రైతులకు తీరని ద్రోహం జరిగింది. ఒక్క అవకాశమని నమ్మించి మోసగించిన వారిని ప్రజ లు చివరకు ఇంటికి పంపారు. కూటమి ప్రభుత్వం తప్పకుండా 15 ఏళ్లు అధికారంలో ఉంటుంది. దానిలో ఎలాంటి సందే హం లేదు. పల్నాడు జిల్లాలో కూరగాయలు, పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలని తాను, ప్రత్తిపాటి ఒక నిర్ణయానికి వచ్చాం. ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తామని తెలిపారు. జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిం దని, ప్రత్తిపాటి పుల్లారావు వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు సమస్యను నాటి..నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లా రని, ఆయన చొరవ వల్లే నేడు సంబరాన్ని తలపించేలా ఎడ్ల పందేలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

### వినుకొండలోనూ ఎడ్ల పందేలు: జీడీసీసీ చైర్మన్ మక్కెన

జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతూ జాతీయస్థాయి వృషభరాజాల బలప్రదర్శన పండుగను తలపిస్తోందని అన్నారు. ప్రత్తిపాటిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌లో జీవీ. ఆంజనేయులు ఆధ్వర్యంలో వినుకొండలో ఎడ్లపందేలు నిర్వహి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వా హకులు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దారు, సర్వేయర్ల అవినీతి బాగోతం

**182 గజాల స్థలం 18 గజాలుగా..**
**భూమిని తగ్గించి తప్పుడు నివేదిక ఇచ్చారు**
**న్యాయం చేయాలంటూ బాధితుడి విజ్ఞప్తి**
**అర్జీలు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు**




మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా మంగళవారం అర్జీలు స్వీక రించారు. అనకాపల్లికి చెందిన శ్రీనివాసరావు సమస్యను వివరిస్తూ తమ గ్రామంలో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా సర్వే నంబర్ 1306/1లో 0.98 సెంట్ల భూమి వచ్చింది. ఈ భూమికి సంబంధించి 2006 నుంచి తన దగ్గర అన్ని రకాల పక్కా ఆధా రాలు, పత్రాలు ఉన్నాయి. భూమిని రికార్డుల్లో నమోదు చేయమని అధికారులను అడిగితే వారు పట్టించుకోవడం లేదు. పైగా బాగా డబ్బు ఉన్న వారికి బెదిరింపులు చేసే వారికి అనుకూలంగా రికా ర్డులను మారుస్తున్నారు. తమ భూమిని తనకు కాకుండా వేరే వారికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరిం చాలని అధికారులకు మొరపెట్టుకున్నా వారు చాలా నిర్లక్ష్యంగా, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**తహసీల్దారు, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి**

కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం గ్రామానికి చెందిన మంగాపతి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు వారసత్వంగా సర్వే.నెం.331లో 182 చదర పు గజాల ఖాళీ స్థలం ఉంది. దీనికి సంబంధించి 1947 నాటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ (నెం.14/1947) తమకు అనుకూలంగా వచ్చిన కోర్టు తీర్పులు కూడా ఉన్నాయి. తమ స్థలం కొలతలు వేయమని 06.05.2023న దరఖాస్తు చేశాను. ఉన్నతాధికారులు సాయిప్రసాద్, అజయ్ జైన్, కలెక్టర్ కొలతలు వేయమని ఆదేశిం చినప్పటికీ మండల తహశీల్దారు, సర్వేయర్ మాత్రం కేవలం "18 గజాలే ఉంది" అని తప్పుడు రిపోర్ట్ ఇచ్చారు. తమ స్థలం సరిహ ద్దుదారుడైన దూపాటి శేషయ్య వద్ద తహసీల్దారు రూ.10 లక్షలు లంచం తీసుకుని తమ 182 గజాల స్థలాన్ని అతనికి అప్పగిం చాలని చూస్తున్నారు. ఉన్నతాధికారులు కొలతలు పెట్టమని చెప్పి నా స్థానిక అధికారులు మాత్రం కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**పైపులైన్ వేయకుండా అడ్డుకుంటున్నారు**

తిరుపతి జిల్లా బాలాయపల్లికి చెందిన రవణమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. సుమారు 45 ఏళ్ల క్రితం ప్రభుత్వం వారు తమ గ్రామంలో సర్వే నెం.126/1లో 5.04 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని తమకు మంజూరు చేశారు. ఈ భూమి పూర్తిగా వర్షాధార భూమి కావడంతో నీరు లేకపోతే పంటలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. బాలాయపల్లి గ్రామానికి చెంది న అంజయ్య, రాములమ్మ, రాజయ్య అనే వారు పైపులైన్ వేయకుండా అక్రమంగా అడ్డుకుంటున్నారు. ఈ పైపుల లైన్ వెళ్ళే ప్రాంతం చెరువుకు చెందిన పోరంబోకు స్థలం ఉంది. ఆ స్థలాన్ని ఆక్ర మించలేదు. కేవలం 3అడుగుల లోతులో భూమి కింద పైపుల లైన్ వేస్తానని స్పష్టంగా తెలియ జేసినా వారు వినకుండా అడ్డుకుం టున్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

**న్యాయవాదినంటూ మోసం**

అనంతపురం జిల్లా రాయదుర్గానికి చెందిన లక్ష్మీ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..ఒంటరి మహిళనైన తన పరిస్థితిని అవకాశంగా మార్చుకున్న ఒక వ్యక్తి తనను తాను లాయర్ (న్యాయవాది) అని పరిచయం చేసుకుని లాయర్ ఐడీ కార్డు చూపిస్తూ తనకు నమ్మకం కలిగించాడు. "నీకు, నీ పిల్లలకు మంచి చేస్తాను అని చెప్పి మోసం చేశాడు. ఇల్లు, ప్లాట్, బంగారం తీసుకున్నాడు. రెండేళ్లుగా పరారీలో ఉన్నాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా అతను కలవడం లేదు స్పందించడం లేదు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరిం చాలని కోరారు.

**భూమి మ్యూటేషన్ చేయకుండా కాలయాపన**

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంకు చెందని సన్యాసి రావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో తన తల్లి పడెల పెంటమ్మ పేరున సర్వే నెం.27/1లో 4 ఎకరాలు 52 సెంట్ల భూమి ఉంది. ఆమె మరణానంతరం తన పేరున మ్యూటేష న్ చేయాలని కోరుతూ పలుమార్లు మండల రెవెన్యూ కార్యాల యా న్ని సంప్రదించిన పట్టించుకోవడం లేదు. అదేవిధంగా చిదిమిచార శీతారాంపేట గ్రామంలో సర్వే నెం. 25/1-171లో ఉన్న భూమికి పేరు మార్పు చేయాల్సి ఉంది. ఈ విషయమై మండల తహసీల్దార్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లినా స్పష్టమైన సమాధానం ఇవ్వ కుండా కాలయాపన చేస్తున్నారు. చట్టబద్ధంగా చేయాల్సిన మ్యూటేషన్ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లకుండా, పరోక్షంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పేరు మార్పు జరగకపోవడంతో భూమి సాగు, బ్యాంకు పనులు, ప్రభుత్వ పథ కాలకు సంబంధించిన లబ్ధి పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నాను. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**లంచం ఇవ్వలేదని రికార్డుల్లో పేరు తొలగించారు**

అనకాపల్లి జిల్లా నక్కాపల్లి గ్రామానికి చెందిన అప్పారావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నంబర్ 51లో గల 16 సెంట్ల భూమి 1938 నుంచి తమ పూర్వీకుల ఆధీనంలోనే ఉంది. 1965వ సంవత్సరంలో ప్రభు త్వం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే సమయంలో అప్పటి నక్కపల్లి కరణం తమ వద్ద నుంచి లంచం ఆశించారు. ఇవ్వక పోవడంతో కక్ష గట్టి తమ పేర్లను రికార్డుల నుంచి తొలగించారు. ఆ భూమిని దేవదాయ శాఖ రికార్డుల్లోకి మార్చడం జరి గింది. అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# బోరెడ్డిగారిపల్లిలో ప్రజాదర్బార్

**- అర్జీలు స్వీకరించిన మంత్రి మండిపల్లి**



రాయచోటి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో పేదరికంలేని సమాజం కోసం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అంద డమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. చిన్నమండెం మండలం బోరెడ్డి గారిపల్లిలో తన స్వ గృహంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అధికారులు, ప్రజలతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. ఈ సందర్భం గా ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజలు మంత్రిని సత్కరించారు.

# పారదర్శకంగా భూముల రీ సర్వే

**- గత ప్రభుత్వంలో అన్నీ తప్పుల తడకలే**
**- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్**



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో పూర్తి కచ్చి తత్వంతో రీ సర్వే 2.0 చేపడుతున్నట్లు రెవెన్యూ మంత్రి అనగా ని సత్యప్రసాద్ తెలిపారు. ఇప్పటికి మూడు దశల్లో 2,097 గ్రామాల్లో సర్వే పూర్తి అయినట్లు చెప్పారు. నాలుగో దశలో 1613 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతున్నట్లు వివరించారు. రైతుల సంపూర్ణ భాగాస్వామ్యంతో రీ సర్వే 2.0 జరుగుతుందని చెప్పారు. రోవర్లను అధిక సంఖ్యలో ఉపయోగించి తప్పులకు అవకాశం లేకుండా సరిదిద్దుతున్నట్లు తెలిపారు. రీ సర్వే కాలాన్ని 90 రోజుల నుంచి 143 రోజులకు పెంచినట్లు వివరించారు. గత ప్రభుత్వంలో రీ సర్వేలో అన్ని తప్పుల తడకలేనని, అందువల్లే ప్రజల నుంచి గత ప్రభుత్వ రీ సర్వేపై 7.5 లక్షల ఫిర్యాదులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం పాస్ పుస్తకాలపై ముద్రించిన క్యూర్ కోడ్ పెద్దగా ఉపయోగపడలేదన్నారు. కూటమి ప్రభుత్వ క్యూఆర్ కోడ్‌లో రియల్ టైమ్ డేటాతో పాటు నావిగేషన్ సిస్టమ్‌తో రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. రీ సర్వే క్రెడిట్ తనదే అని జగన్ అంటుంటే రైతులు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు.

# నూతన ఆర్టీఐ కమిషనర్ల ప్రమాణ స్వీకారం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర సమాచార కమిషన్‌కు నూత నంగా నియమితులైన కమిషనర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ కమి షనర్ సహా ఇతర కమిషనర్లను నియమించింది. రాష్ట్ర సమా చార కమిషన్ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు తో ముందుగా సీఎస్ విజయానంద్ ప్రమాణం చేయించారు. అనంతరం పరవాడ సింహాచలం నాయుడు, వంటేరు రవిబాబు, ఆదెన్న గాజుల, శరత్‌చంద్ర కళ్యాణ చక్రవర్తి వట్టికూటలతో సమాచార కమిషనర్లుగా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్లకు సీఎస్ పుష్పగుచ్చాలు అందించి రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఆర్టీఐ అధికారులు, నూతన ఆర్టీఐ కమిషనర్ల కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠాత్మకంగా విశాఖ ఉత్సవ్ వేడుకలు

*24 నుంచి వారం పాటు నిర్వహణ - మంత్రుల సమీక్షలో నిర్ణయం*



విశాఖపట్నం(చైతన్యరథం): విశాఖ ఉత్సవ్‌పై స్థానిక కలెక్టరే ట్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షకు హాజరైన మంత్రులు కందుల దుర్గేష్, అనిత, సంధ్యారాణి, డోలా బాలవీరాంజ నేయస్వామి, కొల్లు రవీంద్ర, ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ, పంచకర్ల విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, బండారు సత్య నారాయణమూర్తి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఏపీటీడీసీ ఎండీ శ్రీమతి ఆమ్రపాలి కాట, విశాఖపట్నం కలెక్టర్ హరేందిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, విశాఖపట్నం సీపీ శంకబ్రత బాగ్చి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జన వరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు విశాఖ ఉత్సవ్ నిర్వహించాలని నిర్ణయించారు. విశాఖతో పాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ ఒకేసారి ఉత్సవాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణ యించారు. విశాఖలో ఉత్సవాల ప్రారంభ వేడుక, అనకాపల్లి జిల్లాలో ముగింపు వేడుక నిర్వహించాలని సమీక్షలో నిర్ణయించారు.

# రూ.26 కోట్లతో తెనాలిలో ఆయుష్ హాస్పిటల్

**- అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్ పక్కనే నిర్మాణం**

**- ప్రజలకు మెరుగైన వైద్యసేవలకు నిర్ణయం**

**- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్**



తెనాలి (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ఆయుష్ వైద్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రానికి ఐదు ఆయుష్ హాస్పిటల్స్ మం జూరు చేయగా అందులో భాగంగా తెనాలికి రూ.26 కోట్ల వ్యయంతో 50 పడకల ఆయుష్ హాస్పిటల్ మంజూరు చేసినట్లు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సంద ర్భంగా తెనాలిలోని కొత్తపేటలో ఉన్న పాత గవర్నమెంట్ హాస్పి టల్ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఆయుర్వేదంతో ఆరోగ్యం సాధ్య మవుతుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కాలుష్య సమ స్యల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఆయుర్వేద వైద్యా నికి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో తెనాలికి 50 పడకల ఆయుష్ హాస్పిటల్ మంజూరు కావడం గర్వకారణమని అన్నారు. సుమారు 120 సంవత్సరాల చరిత్ర కలిగిన తెనాలి పాత గవర్న మెంట్ హాస్పిటల్ ప్రాంగణంలోనే, ఇప్పటికే ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్ పక్కనే ఈ నూతన ఆయుష్ హాస్పిటల్ నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం పాత భవనం శిథిలావస్థలో ఉండటంతో ఆ ప్రాంగణాన్ని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వినియోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నూతన ఆయుష్ హాస్పిట ల్‌లో ప్రత్యేక అవుట్ పేషెంట్ విభాగం, 50 పడకల ఇన్ పేషెంట్ సౌకర్యం, ఆధునిక ల్యాబొరేటరీలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేసే అవకాశమూ ఉంద న్నారు. తెనాలికి ఆయుష్ హాస్పిటల్ మంజూరు చేసినందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, అలాగే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు తెనాలి ప్రజల తరపున మంత్రి నాదెండ్ల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆధ్యాత్మిక నగరంగా నెల్లూరును తీర్చిదిద్దుతున్నాం



నెల్లూరు(చైతన్యరథం): నెల్లూరు మూలపేట రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులను వేమిరెడ్డి విజ యభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలిం చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం పురస్కరించుకుని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కోట్లాది రూపాయ లతో పురాతన ఆలయాలను పునర్నిర్మించి పూర్వవైభవం తీసుకొస్తున్నాం. రూ.17 కోట్లతో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీలైనంత త్వరలోనే పనులను పూర్తి చేసి భక్తులకు గొప్ప ఆలయాన్ని అందించేందుకు నిరంతరం పనుల పురోగతిని పరిశీలి స్తున్నాం. నవాబుపేటలో పురాతన శివాలయం నిర్మాణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తాం. జిల్లాలోని సోమశిల సోమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. బిట్రగుంట వెంకటేశ్వర స్వామి ఆలయం, నర్రవాడ వెంగమాంబ అమ్మవారి ఆలయం, ఉదయగిరి వేణుగోపాల స్వామి వారి ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు జనవరి 20వ తేదీన ఆర్య వైశ్యులు అత్యంత వేడుకగా నిర్వహించుకునే వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పండుగగా ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. పెనుగొండ వాసవీ అమ్మవారి ఆలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు ప్రభుత్వం తరపున ప్రభుత్వ లాంఛనాలతో అమ్మవారికి పట్టువస్త్రా లను అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా ఐదువేల పైగా ఆలయాలను నిర్మిం చాలని సంకల్పించినట్టు తెలిపారు. రాష్ట్రంలో భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

## మహిళా కానిస్టేబుల్‌కు హోంమంత్రి అభినందన



విశాఖపట్నం (చైతన్యరథం): కాకినాడలోని కెనాల్ రోడ్డులో శనివారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కెనాల్ రోడ్డులో సామర్లకోట వద్ద వాహనాలు భారీ సంఖ్యలో నిలిచి పోయాయి. సామర్లకోట నుంచి కాకినాడకు వస్తున్న ఓ లారీ.. సాంకేతిక సమస్యలో రైల్వే గేటు వద్ద రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారుగా ఐదారు కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించిపోయాయి. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో విధి నిర్వహణలో లేకపోయినా.. బిడ్డను చంక నెత్తుకుని రంగంపేటకు చెందిన మహిళా కానిస్టేబుల్ జయశాంతి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. దాంతో హోంమంత్రి అనిత ఫోన్ చేసి ఆమెకు అభినందనలు తెలిపారు. ఇటువంటి ఘటనలు పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం పెంచుతాయని ప్రశంసించారు. కానిస్టేబుల్ జయశాంతి కుటుంబం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమను కలవాలని హోంమంత్రి అనితను కోరగా త్వరలోనే కలుద్దామని సానుకూలంగా స్పందించారు.

## టీడీపీలోకి 350 కుటుంబాలు

*ఆహ్వానించిన మంత్రి సవిత*



కడప(చైతన్యరథం): జమ్ములమడుగు నియోజకవర్గం ఉప్పలపాడు గ్రామంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఎం.బి.శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో సుమారు 350 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో మంత్రి సవితమ్మ, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారికి ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించా రు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లా డుతూ ప్రజలకు నమ్మక మైన పాలన అందించడమే టీడీపీ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేసే నాయకత్వం చంద్రబాబు దేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైభవంగా అప్పన్నస్వామి చందనోత్సవం

**- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలి**

**- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశం**




విశాఖపట్నం (చైతన్యరథం): సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవం ఏప్రిల్ 20న జరగనున్న దృష్ట్యా కార్యక్రమానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. మంగళవారం విశాఖ కలెక్టరేట్‌లో అధికా రులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందనోత్సవం వేడుకను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. టిక్కెట్ల విక్రయ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, నగర పరిధిలోని అనుకూల ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలోగా టిక్కెట్ల విక్రయాల ప్రక్రియను పూర్తి చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. రూ.1500, రూ.1,000, రూ.300 ధరల మేరకు టిక్కెట్ల జారీ ప్రక్రియను ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. టిక్కెట్టుపై క్యూఆర్ కోడ్ వచ్చేలా రూపొందిం చాలని, దర్శనాల సమయంలో స్కాన్ చేసేందుకు స్కానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కొండపైకి వాహనాల రాకపోకలను తగ్గించాలని సూచించారు. ఫిబ్రవరి తొలి వారంలో జరగబోయే మలివిడత సమీక్ష నాటికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయా లని ఆదేశించారు. అనువంశిక ధర్మకర్త, తితిదే నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే వారికి, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూ ర్తులకు, దాతలకు అంతరాలయ దర్శనాలు కల్పించే విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని, స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతించాలని, ఇతర కార్యకలాపాలు నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. 19వ తేదీన రాత్రి 6.00 గంటల నుంచే సాధారణ దర్శనాలు నిలిపివేస్తామనే విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా భక్తులకు తెలియపరచాలని సూచిం చారు.

# వ్యవసాయ సీజన్ నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి

- లో ఓల్టేజ్ కు చెక్ పెట్టేందుకు రూ. 800 కోట్లతో 250 సబ్ స్టేషన్లు
- రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6 వేల కోట్లతో విద్యుత్ సరఫరా వ్యవస్థ పటిష్టం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

కనిగిరి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 6 వేల కోట్ల వ్యయంతో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని పేర్కొన్నారు. లో ఓల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రూ. 800 కోట్లతో ఇప్పటివరకు 250 సబ్ స్టేషన్లను నిర్మించినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే వ్యవసాయ సీజన్ నాటికి జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. గత ప్రభుత్వం విద్యుత్ శాఖపై రూ. 30 వేల కోట్ల భారం మోపిందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం ట్రూ డన్ విధానంలో 13 పైసలు తగ్గించిందని స్పష్టం చేశారు. అంతేగాకుండా ఇటీవల ప్రజల మీద భారం పడకుండా డిస్కంలకు రూ. 4 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. మంగళవారం నాడు మార్కాపురం జిల్లా, కనిగిరిలో స్థానిక శాసన సభ్యులు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డిలతో కలిసి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కనిగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యుత్ రంగ పటిష్టత, గ్రామీణ రహదారుల విస్తరణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.



**నూతన డివిజనల్ ఆఫీసులను మంజూరు**

మార్కాపురం జిల్లా కనిగిరిలో పర్యటన సందర్భంగా విద్యుత్ శాఖకు చెందిన శిథిలావస్థకు చేరిన డివిజన్ ఆఫీసును గొట్టిపాటి రవి కుమార్ మంత్రి పరిశీలించారు. కార్యాలయ భవనం దయనీయ స్థితిలో ఉన్న తీరును గమనించిన మంత్రి, అక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులతో వెంటనే మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే ఆధునిక మౌలిక సదుపాయాలు అవసరమని పేర్కొంటూ, కనిగిరిలో కొత్త విద్యుత్ శాఖ డివిజన్ ఆఫీసు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు 30 రోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, కొత్త భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు.

అనంతరం పామూరు మండలంలోని అయ్యవారిపల్లిలో ఎన్.టి.ఆర్. విగ్రహాన్ని, నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా అవసరాలకు అనుగుణంగా గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు.

**సీబీజీ ప్లాంట్ల నిర్మాణ పనులు వేగవంతం**

కనిగిరిలో నిర్మాణంలో ఉన్న సీబీజీ (కంప్రెస్డ్ బయోగ్యాస్) ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతిపై రిలయన్స్ సీబీజీ ప్లాంట్ ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్లాంట్ నిర్మాణం ఏ దశలో ఉందో అడిగి తెలుసుకున్న మంత్రి, పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దీనికి స్పందించిన రిలయన్స్ ప్రతినిధులు, జూన్ నెల నాటికి సీబీజీ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తవుతాయని మంత్రికి వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, భూగర్భ జలాల మట్టాన్ని పెంచే దిశగా ప్లాంట్ పరిసరాల్లో పాండ్స్ (నీటి గుంతలు) ఏర్పాటు చేయాలని రిలయన్స్ ప్రతినిధులకు మంత్రి సూచించారు. అభివృద్ధితో పాటు పర్యావరణ సమతుల్యత కూడా అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో సోలార్ పార్క్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని మంత్రి తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెంచడం ద్వారా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా యువతకు జిల్లాలోనే ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, సీబీజీ ప్లాంట్లు, సోలార్ పార్కులు వంటి పరిశ్రమలతో స్థానికంగా ఉద్యోగాల సృష్టి జరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.

# జగన్‌రెడ్డి పాలనలో దళితులపై మారణకాండ

- 210 మంది దళితులను పొట్టనపెట్టుకున్నారు
- వైసీపీ నాయకులు మరిచిపోయారేమో
- ఆయన పాలనను ప్రజలు మరచిపోలేదు
- మారణకాండపై చర్చించే దమ్ము ఉందా?
- వారి గురించి మాట్లాడే హక్కు మీకు లేదు
- అనంతబాబుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు
- దళితులపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన చరిత్ర మీది
- ఊచకోత కోసి నేడు కపట ప్రేమ నటిస్తున్నారు
- వైసీపీ నేతల చేతిలో దళితులు మళ్లీ బలికావొద్దు
- మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

మంగళగిరి(చైతన్యరథం): జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో 210 మంది దళితులను పొట్టనపెట్టుకున్న నరరూప రాక్షసులు వైసీపీ నేతలు నేడు దళితుల గురించి, దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మడకశిర ఎమ్మెల్యే, టీడీపీ పాల కమండలి సభ్యులు, శ్రీ సత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు అన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదానికి రాజకీయ రంగు పులిమి, ఆ వివాదాన్ని ఎమ్మెల్యేకు ముడిపెట్టి నీచ రాజకీయాలకు పాల్పడడం వైసీపీ నేతల దిగజారుడు రాజకీయా లకు నిలువుటద్దం అని పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎం.ఎస్.రాజు మీడియాతో మాట్లాడుతూ జగన్ పాలనలో దళిత మారణకాండపై చర్చించే దమ్ము వైసీపీ నేతలకు ఉందా? అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో దళితులను ఊచకోత కోసిన విషయాన్ని వైసీపీ నేతలు మరచిపో యినట్లు నటిస్తున్నారు. ఈ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా దళితులు ఎవరూ ఆ అమానవీయ ఘటనలను నేటికీ మరచిపోలేదు. వైసీపీ పాలనలో దళిత మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, దుర్మార్గాలపై చర్చించే దమ్ము వైసీపీ నేతలకు ఉందా? చర్చిం చడానికి నేను రెడీ అని సవాల్ విసిరారు. దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడే వైసీపీ నేతలకు అసలు మనస్సాక్షి అనేది ఏమైనా ఉందా? దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు దారుణంగా హత్య చేసి, శవాన్ని డోర్ డెలివరీ చేశా రు..ఆయనపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదు? దళిత డాక్టర్ సుధాకర్ మాస్కు అడిగినందుకు పిచ్చివాడిని చేసి, నడి రోడ్డుపై చొక్కా తీసి, చేతులు వెనక్కి కట్టి ఈడ్చుకెళ్లి, తన మరణా నికి కారణమైంది జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నేతల దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు.

**నాగమ్మ హత్య కేసులో జగన్‌పై కేసుపెడదామా జూపూడి?**

చేతిలో అధికారం ఉందని జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో విశృంఖలంగా వ్యవహరించాడు. పులివెందులలో దళిత మహిళ నాగమ్మపై హత్యాచారం జరిగితే, ఆ కుటుంబానికి జరిగిన అన్యా యంపై పోరాడిన దళిత నాయకులమైన మాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసి టీ కేసులు పెట్టిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి. కూటమి పాలనలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణలో ఒక వ్యక్తి చనిపోతే దానిని ప్రభు త్వ హత్య అని, ప్రభుత్వంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని జూపూడి ప్రభాకర్ లాంటి సెల్ఫ్ డిక్లేర్డ్ మేధావి మాట్లాడడం చాలా హాస్యాస్పదం. పులివెందులలో నాగమ్మ హత్యకు సంబంధించి జగన్మోహన్ రెడ్డిపై కేసుపెడదామా? డాక్టర్ సుధాకర్ మరణానికి కారణం అప్పటి ప్రభుత్వమే.. దానికి కూడా జగన్‌పై కేసు పెడదామా? డాక్టర్ అచ్చెన్న మరణానికి కారణం



వైసీపీ ప్రభు త్వమే జగన్‌పై కేసుపెడదామా జూపూడి? రేపల్లె రైల్వేస్టేషన్‌లో ఒక దళిత గర్భిణిపై తన భర్త, పిల్లల ఎదుట అత్యాచారం జరిగిన ఘటనపై ఎవరిపై కేసు పెట్టాలి? దళితులపై అడుగడుగునా దాడు లు, అవమానకర ఘటనలు, హత్యలు, అత్యాచారాలు జరిగితే ఆ ఐదేళ్లు ఏ కలుగులో దాక్కున్నావ్ జూపూడి ప్రభాకర్?

**దళితులకు అన్యాయం జరిగితే జగన్, అప్పటి హోం మంత్రులు నోరెత్తారా?**

వైసీపీ ఐదేళ్ల పాలనలో దళిత నరమేధం జరిగింది. కానీ ఏ ఒక్క ఘటనపైనా జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, మరియు అప్పటి హోంమంత్రులు ఎవరూ నోరు మెదపలేదు. ఏ ఒక్క బాధిత కుటుంబానికి న్యాయం చేయలేదు. అన్యాయం చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు వంటి దుర్మార్గులను జగన్మోహన్ రెడ్డి తన పక్కన కూర్చోబెట్టుకుని భోజనం వడ్డించడం దళితుల పట్ల తన కున్న చిన్నచూపుకు నిదర్శనం. కానీ మా ముఖ్యమంత్రి చంద్రబా బు రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా వెంటనే స్పందిస్తున్నారు. ఘటనపై ఆరా తీసి బాధిత కుటుంబాలకు అండగా నిలబడు తున్నారు. నేరస్తులకు తగిన శిక్షలు పడేలా చేస్తున్నారు. దళితుల పట్ల మా ప్రభుత్వానికి, మా నాయకులకు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిలువెత్తు నిదర్శనం. వైసీపీ నేతలు ఎవరికీ దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు లేదని హితవుపలికారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయ త్నాలు చేస్తున్నారు. జీడీ నెల్లూరులో అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నేతలే నిప్పుపెట్టి, ఏమీ తెలియనట్టు వాళ్లే ధర్నాలు చేసి హడావుడి చేశారు. టెక్నాలజీ ద్వారా ఆ కుట్రను మేం బయటపెడితే ఒక్క వైసీపీ నేత కూడా నోరు మెదపలేదు. అదేవిధంగా తిరుమల కొండపై మద్యం బాటిళ్లు తీసుకెళ్లింది వైసీపీ నేతలే....ఆ ఫోటోలను సాక్షి ఫొటోగ్రాఫర్ తీసి ప్రభుత్వంపై బురదజిమ్మడం కోసం ప్రయత్నం చేశారు. ఈ కుట్రను కూడా మా ప్రభుత్వం టెక్నాలజీతో ఛేదించి నిందితులపై తగిన చర్యలు తీసుకుంది. ఇటువంటి నీచ ప్రయత్నాలు మానుకోవాలని హితవుపలికారు.

**రౌడీషీటర్లకు డీజీపీ అపాయింట్మెంట్ ఇవ్వాలా?**

దళితులకు ఏదో అన్యాయం జరిగిపోయిందంటూ లేళ్ల అప్పిరెడ్డి లాంటి రౌడీషీటర్లను వేసుకుని వైసీపీ నేతలు డీజీపీ అపా యింట్‌మెంట్ కోరడం నిజంగా ఆశ్చర్యంగా ఉంది. రౌడీషీటర్లకు డీజీపీ అపాయింట్మెంట్ ఎందుకో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం జగన్మోహన్‌రెడ్డిపై ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో దళి తులకు అన్యాయం జరుగుతుంటే.. వైసీపీ దళిత నేతలు మొండి తోక అరుణ్‌కుమార్, జూపూడి ప్రభాకర్, మేరుగ నాగార్జున, కైలే అనిల్ కుమార్, సుధాకర్ లాంటి వాళ్లు ఏ ఒక్కరూ నోరు ఎందుకు మెదపలేదో ప్రజలకు సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు.

**ఈడీ పేరు చెబితే జగన్ వెన్నులో వణుకు**

జగన్‌రెడ్డికి ఈడీ పేరు చెబితే వెన్నులో వణుకు పుడుతోంది. అందుకే తన పార్టీ నేతలను హడావుడిగా పిలిచి ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు ఇచ్చా డు. కానీ వీటిని ప్రజలు ఎవరూ నమ్మడానికి సిద్ధంగా లేరు. తప్పు చేసిన వాళ్లకు శిక్ష తప్పదు. జగన్మోహన్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులు వైసీపీ అబద్ధాలను నమ్మి వారి చేతుల్లో బలికావొద్దని సూచించారు.

# దేశంలోనే ఏపీకే 25 శాతం పెట్టుబడులు

- సీఎం చంద్రబాబు పనితీరుకు నిదర్శనం
- అభివృద్ధే అజెండాగా కూటమి పాలన
- వైసీపీ ఐదేళ్లలో రోడ్లపై గోతులూ పూడ్చలేదు
- కూటమి రాగానే పక్కా రోడ్లు నిర్మిస్తున్నాం
- అభివృద్ధి చేస్తుంటే.. జగన్ కుట్రలు చేస్తున్నాడు
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- మాడుగులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అనకాపల్లి(చైతన్యరథం): రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనుక్షణం పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగ ర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండ లం కింతాడ గ్రామంలో రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, సీసీ కాలువలకు శంకుస్థాపన చేశారు. గొండుపాలెం నుంచి రంగలినాయుడుపాలెం వరకు రూ.1.68 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. తెలుగు వారికి ఈ స్థాయి గుర్తింపు తీసు కొచ్చినా, బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు కల్పించినా అది అన్న ఎన్టీఆర్ చలవే. దేశంలో తొలిసారిగా సంక్షే మ పథకాలకు అంకురార్పన చేసిన ఘనత ఎన్టీఆర్‌దే. తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి గుర్తింపు తీసుకొస్తే.. తెలుగు వారి ఆత్మవిశ్వాసం నినాదంతో చంద్రబాబు మన ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేశారు. అభివృద్ధి అనే పదాన్ని మరో మెట్టు పైకి ఎక్కించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీని అభివృద్ధి పథంలో నడిపించారు. అమరావతి పోలవరం పనుల్ని పరుగులు పెట్టించారు. అలాంటి సమయంలో ప్రభుత్వం మారిపోవడంతో రాష్ట్ర అభివృద్ధి ఒక్కసారిగా నిలిచిపోయింది. గత ఐదేళ్లు రాష్ట్రంలో అభివృద్ధిని నాశనం చేయడంతో పాటుగా.. నోరెత్తి మాట్లాడాలంటేనే భయపడాల్సిన పరిస్థితి కల్పించారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తున్నారన్న కక్షతో బీసీ వర్గాలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. బీసీలంటే బలహీన వర్గాలు కాదు.. పిడికిలి బిగించి పోరాడే వర్గాలని వైసీపీ అరాచకాలపై పోరాడాం. కూటమి వచ్చాక ఏడాదిన్నర కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో ఏపీలోనే 25 శాతం ఆకర్షించడం మన ముఖ్యమంత్రి పనితీరుకు నిదర్శనం. ఇప్పుడు కూడా దావోస్ వెళ్లి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వ లేక ప్రభుత్వంపై వైసీపీ నేతలు కుట్రలకు పాల్పడు తున్నారు. కులాలు మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలన కారణంగా రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి వెళ్లింది. పరిశ్రమలు అంటే మొన్నటి వరకు మంత్రిగా ఉన్న వ్యక్తులు.. కోడి, గుడ్డు అంటూ గుడ్డు కథ లు చెప్పారు. పెట్టుబడులను తరిమేశారు. ఐదేళ్లలో రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదు. నేడు కూటమి అధికారంలోకి రాగానే శాశ్వత రోడ్లు నిర్మిస్తున్నాం. ప్రజల కోసం మైనస్ 6 డిగ్రీల చలిలో కూడా పెట్టుబడుల కోసం చంద్రబాబు, నారా లోకేశ్ తపిస్తున్నారు. నిన్నటివరకు భోగాపురం విమానాశ్రయాన్ని వ్యతిరేకించిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు పూర్తవగానే క్రెడిట్ చోరీకి ఆరాటపడుతు న్నాడు. నీరుకొండలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలుగువారి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసిన వ్యక్తి ఎన్టీఆర్. అలాంటి ఆలోచనపై కూడా తప్పుడు ప్రచారం చేయడమంటే తెలుగు జాతిని అవమానించడమే. తెలుగు భాష పనికిరాదు అని చెప్పిన జగన్‌రెడ్డి.. నేడు తెలుగు జాతిని కూడా అవమానిస్తున్నారు. అలాంటి అరాచక శక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ, కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెన్సిల్‌తో మంత్రి నారా లోకేష్ చిత్రాలు

**కళాకారిణి జి.ఎన్.సాయిశ్రీ ప్రతిభ - అభినందినందించిన టీడీ జనార్ధన్**

అమరావతి (చైతన్యరథం): విజయవాడకు చెందిన బీఎస్సీ చదివిన కళాకారిణి జి.ఎన్.సాయి శ్రీ మంత్రి నారా లోకేష్ గారి వివిధ ఫొటోలను పెన్సిల్ స్కెచ్‌లుగా అద్భుతంగా రూపొందించారు. ఈ ప్రత్యేక చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్ ఈ చిత్రాలను వీక్షించి కళాకారిణి సాయి శ్రీ ప్రతిభను ప్రశంసించారు. ఇంత నైపుణ్యంతో చిత్రాలను రూపొందించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాకారిణి జి.ఎన్. సాయి శ్రీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడైన నారా లోకేష్ చిత్రాలను గీయడం తనకు గర్వకారణమని తెలిపారు. తన కళకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి లభిస్తున్న ప్రోత్సాహం మరింత ఉత్సాహాన్నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దీనీ ఇస్తేమాను విజయవంతం చేయాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష
- మంత్రులు ఫరూక్, మండిపల్లితో స్థల పరిశీలన



కడప (చైతన్యరథం): జనవరి 23, 24, 25 తేదీలలో జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి "శుభే ఆంధ్రాకే ఖురానోకా దీనీ ఇస్తిమా" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. మంగళవారం కడప జిల్లా సికె దిన్నె మండలం కొప్పర్తి పారిశ్రామికవాడలో జనవరి 23,24, 25వ తేదీలలో నిర్వహించే ఇస్తేమా కార్య క్రమ నిర్వహణ ఏర్పాట్లపై మైనారిటీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిలతో కలిసి సమీక్షించారు. ఇది చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసి చేసుకునే అతి పెద్ద మైనార్టీ పండుగగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని, ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేయాలని సూచించారు. మంత్రి ఫరూక్ మాట్లా డుతూ చంద్రబాబు మైనారిటీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. మూడురోజులు పాటు జరిగే ఇస్తేమా కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణ నుంచి కూడా పెద్దఎత్తున ముస్లిం సోదరులు రావడం జరుగు తుందనన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాల ని సూచించారు. ఈ సమీక్షలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తదితరులు పాల్గొన్నారు.

**ఇస్తేమా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి: మండిపల్లి**

ఈనెల 23, 24, 25వ తేదీలలో జరిగే ఇస్తేమా కార్యక్రమం ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి కమిటీ సభ్యులకు సూచించారు. మంత్రులు ఎస్. సవిత, ఫరూక్, జిల్లా కలెక్టం శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిలతో కలిసి ఇస్తేమా ఏర్పాట్లను పరిశీలించారు. 350 ఎకరాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ముస్లిం సోదరులు, పెద్దఎత్తున హాజరవుతారని, సమస్యలు తలె త్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పరిశ్రమలను తరిమేసిన క్రెడిట్ వైసీపీదే

- బాబాయిని వేసేసిన క్రెడిట్..
- తల్లిని, చెల్లిని గెంటేసిన క్రెడిట్..
- రాష్ట్రాన్ని ముక్కలు చేసిన క్రెడిట్ మీదే
- దావోస్ పర్యటనపై మాట్లాడటం సిగ్గుచేటు
- అభివృద్ధికి అడ్డుపడితే పుట్టగతులు ఉండవు
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజం



మంగళగిరి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో దావోస్ వెళ్లి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేలా పెట్టుబడులు తెస్తుంటే.. అది చూసి ఓర్వలేక జగన్ టీమ్ లేనిపోని విమర్శలు చేస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ చేసిన పనుల క్రెడిట్ తాము తీసు కుంటున్నామని గుడివాడ అమర్నాథ్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సొంత బాబాయిని వేసేసిన క్రెడిట్ ఎవరికైనా కావాలా? తల్లిని, చెల్లిని ఇంటి నుంచి బయటకు పంపించిన క్రెడిట్ ఎవరికైనా కావాలా? మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని ముక్కలు చేసిన క్రెడిట్ ఎవరికైనా కావాలా? అని నిలదీశారు. 2014-19 మధ్య చంద్రబాబు అభివృద్ధికి పునాదులు వేస్తే 2019-24 మధ్య జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. కియా, అమరరాజా వంటి కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. గతంలో పారిశ్రామిక మంత్రులుగా ఉన్నవారు దావోస్‌లో చలి ఎక్కువగా ఉంది.. మాకు జ్వరం వస్తుంది.. స్నానం చేయలేం" అని సాకులు చెప్పి పారిపోయారు. అలాంటి వారు ఇప్పుడు దావోస్ పర్యటన గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమ ర్శించారు. "మేము మళ్లీ అధికారంలోకి వస్తే భూమి కేటాయింపులు రద్దు చేస్తాం" అని పారిశ్రామికవేత్తలను భయపెట్టాలని చూడటం జగన్ టీమ్ అవివేకమం. అసలు జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని ఎవరూ అనుకోవడం లేదు.. అది కేవలం పగటి కలే అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే దావోస్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి చంద్రబాబు, ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను చూసి పారిశ్రామి కవేత్తలు ఆకర్షితులై ఏపీకి రావడానికి ఉత్సాహం చూపుతున్నా రని పేర్కొన్నారు. జగన్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమా లు ప్రజలందరికీ తెలుసునని.. గుడివాడ అమర్నాథ్ వంటి వారు అనవసరమైన విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. మీ హయాంలో విశాఖకు, ఉత్తరాంధ్రకు ఏం చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవుపలికారు. బయటి ప్రాంతాల భూస్వాములను తీసుకొచ్చి ఉత్తరాంధ్రను దోచుకోవడానికి సహకరించింది మీ ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. చంద్రబాబు విజన్‌తో పారిశ్రామికవేత్తలు వస్తుంటే జగన్‌రెడ్డి అండ్ కో 'ఫేక్' ప్రచారాలు చేస్తున్నారు. నిజానికి మీ పార్టీ పుట్టుక, మీ మనుషులు, మీ నాయకత్వమే ఒక పెద్ద 'ఫేక్'. ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని మండిపడ్డారు. కంపెనీలను కూడా అడ్డుకుంటూ భావితరాల ఆస్తిని, ఉద్యోగాల ను దూరం చేస్తున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే హైదరాబాద్ వెళ్లాను. అక్కడ ఐటీ కంపెనీలు, భవనాలు చూస్తుంటే ప్రజలకు చంద్రబాబు గుర్తొస్తున్నారు. ఆయన తెలుగుదేశం పార్టీకి మాత్రమే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఒక బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే భూములు రద్దు చేస్తామని పారిశ్రామికవేత్తలను వైసీపీ నాయకులు భయపెట్టడం మానుకోవాలని హితవుపలికారు. ఇప్పటికైనా జ్ఞానోదయం తెచ్చుకుని రాష్ట్రం కోసం చేసే పనులను స్వాగతించాలని కోరారు. దావోస్ పర్యటన ముగించుకుని వస్తున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర ప్రజల తరపున ధన్య వాదాలు తెలియజేస్తు న్నామని, ఏపీని దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. జగన్.. ఐదేళ్లు రాష్ట్రాన్ని నాశనం చేశారు, కనీసం ఇప్పుడైనా అడ్డుపడకుండా ఉంటే అది మీరు చేసే పెద్ద పుణ్యకార్యం అవుతుందని హితవుపలికారు.

## గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి : ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

● తాడికొండ గ్రామంలో ఘనంగా ముగిసిన "సంక్రాంతి సంబరాలు"



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి గారు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజులపాటు నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా ఇలాంటి పండుగ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలందరూ ఐక్యంగా ఉండి సుఖసంతోషాలతో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, బీజేపీ జిల్లా నాయకులు నిమ్మక సింహాచలం, తాడికొండ మాజీ సర్పంచ్ అడ్డాకుల కుసుమమ్మ, గంగరాజు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు అడ్డాకుల పకీరు, గ్రామైక్య సంఘ ప్రెసిడెంట్ మండంగి ప్రభావతి, ఉపాధ్యాయులు అడ్డాకుల శేషగిరి, తాడికొండ గ్రామ పెద్దలు, మహిళా మండలి సభ్యులు, శ్రీ మానిసిరమ్మ యువజన సేవా సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



విజయగరం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో కిమ్స్ వైద్యులు మంగళవారం విజయనగరం మండలం మలిచర్ల, సుంకర పేట పంచాయతీల్లో ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● రూ.54 వేల చెక్కులను అందించిన మంత్రి సంధ్యారాణి



సాలూరు (చైతన్యరథం): సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలం జైతి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి బాధితుడికి అందజేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో గ్రామానికి చెందిన పి.తేజ సాయికి రూ.54,184 విలువైన చెక్కును ఆమె అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదుకుంటున్నారని అన్నారు. సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## అర్జీలను తక్షణమే పరిష్కరించాలి... అధికారులకు గంటా దిశానిర్దేశం




భీమిలి (చైతన్యరథం): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి వారికి సమాచారం అందజేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. భీమిలి ఎండీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి పరిష్కార మార్గాలను సూచించారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రజల అర్జీల వివరాలను పట్టిక ద్వారా పొందుపరిచి ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించి 27 వినతులు రాగా.. అత్యధికంగా పంచాయతీ రాజ్ నుంచి 9, రెవిన్యూకు సంబంధించి 5 అర్జీలు అందాయి. ఎమ్మార్వో పి. రామారావు, ఎంపీడీఓ నరసింహారావు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గరికిన పరశు రాం, కోరాడ రమణ, గుడ్డాల ఎల్లయ్య, సూర్యనారాయణ, వై.ఆనంద్ ప్రసాద్, మహంతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల విడుదలకు ఎంపీ శ్రీ భరత్ కృషి

● బంగ్లాదేశ్ నుంచి ఉత్తరాంధ్ర మత్స్యకారుల విడుదల ఉత్తర్వులపై ఎంపీ హర్షం

●కృతజ్ఞతలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం



విశాఖపట్నం (చైతన్యరథం): బంగ్లాదేశ్ జైలు శిక్ష అనుభవిస్తున్న ఉత్తరాంధ్ర మత్స్యకారుల విడుదలకు విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ చేసిన కృషి ఫలించిందంటూ మత్స్యకార సంఘాలు ఆయన్ను స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపాయి. లాసన్స్ బే కాలనీలోని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ కార్యాలయంలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్‌కు వారు హాజరై తమ ఆనందాన్ని పంచుకున్నాయి. బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ సిబ్బందికి మత్స్యకారులు తొమ్మిది మంది పట్టుబడిన నాటి నుంచి నేటి వరకూ వారి విడుదలకు ఎం.పి.శ్రీభరత్ చూపిన చొరవ ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నాయి. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... ఉత్తరాంధ్రకు చెందిన మత్స్యకారులు పేద కుటుంబాలకు చెందినవారని, వారి జీవనోపాధి కోసం సముద్రంలోకి వెళ్లి అనుకోకుండా సరిహద్దులు దాటడం వల్ల ఈ పరిస్థితి ఎదుర్కోవడం జరిగిందన్నారు. ఇది చట్టపరమైన అంశమే అయినప్పటికీ మానవతాకోణంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి అనేకమార్లుతీసుకువెళ్లామన్నారు. ఢాకాలోని భారత హైకమిషన్ ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో దౌత్య మార్గాల్లో చర్చలు జరిపేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు..చేసిన అన్ని ప్రయత్నాలు ఫలించడంతో వారి విడుదలకు మార్గం ఏర్పడిందన్నారు...కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలబడుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నం పార్లమెంట సభ్యులను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పిసి అప్పారావు, అధ్యక్షులు లక్ష్మణరావు, ప్రధానకార్యదర్శి సూరవతి నర్సింగరావు, ఉపాధ్యక్షులు పరశురాముడు, కార్య దర్శి మున్నం బాలాజీ, జనసేన నాయకులు గరికిన రవి, చీకటి రమేష్, బోటు యజమాని సత్యనారాయణ వున్నారు.

**జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రతిష్ఠను కాపాడాలి**

ఇదిలా వుండగా విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన జనసేన నాయకుడు పన్నెంరెడ్డి సతీష్ విశాఖ పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ... జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రతిష్ఠను కాపాడే విధంగా తమవంతు పాత్ర పోషించాలని సూచించారు?... నేటి విద్యార్థులు,యువత గ్రంథాలయాలపై ఆసక్తిని పెంపొందించుకునే రీతిలో మారుతున్న పరిస్థితులకు తగినట్లుగా విజ్ఞానభాండాగారంగా వాటిని తీర్చిదిద్దాలన్నారు.

## సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో పొగలు... 20 నిమిషాలు పాటు నిలిపివేత




తుని (చైతన్యరథం): విశాఖ నుంచి గుంటూరు వెళ్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్లో నుంచి పొగలు వ్యాపించాయి. మంగళవారం ఉదయం విశాఖ నుంచి బయల్దేరిన తర్వాత సీ1 కోచ్ నుంచి పొగలు రావడాన్ని ప్రయాణికులు గుర్తించడంతో ఎలమంచిలి దాటిన తర్వాత గుల్లిపాడు రైల్వేస్టేషన్లో సుమారు 20 నిమిషాలు రైలును నిలిపివేశారు. బ్రేక్ సమస్య వల్ల పొగలు వచ్చినట్లు గుర్తించి సమస్యను పరిష్కరించిన అనంతరం రైలును ముందుకు నడిపారు. రైలు తుని దాటిన తర్వాత రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా సీ1, జనరల్ కోచ్ మధ్య నుంచి మళ్లీ పొగలు రావడం గమనించిన ప్రయాణికులు చైన్ లాగి బండిని నిలిపివేశారు. ఇక్కడ గంటన్నరకు పైగా రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరమ్మతుల అనంతరం రైలు ముందుకు కదిలింది. ఈ రైలు అన్నవరం స్టేషన్కు చేరుకుంటున్న సమయంలో ప్లాట్ఫాంపై ఉన్న ప్రయాణికులు కొంత గందరగోళానికి గురయ్యారు. ఒకటో నంబర్ ప్లాట్ఫాం పైకి రావాల్సిన సింహాద్రి ఎక్స్ప్రెస్ రెండో నంబర్ ప్లాట్ ఫాం పైకి వస్తుందని అనౌన్స్ చేయడంతో అప్పటికే ఒకటో నంబర్‌లో ఉన్న ప్రయాణికులు రెండో నంబర్ పైకి వెళ్లారు. తీరా రైలు ఒకటో నంబర్ ప్లాట్ఫాం పైకి రావడంతో మళ్లీ ఇక్కడికి చేరుకునే క్రమంలో గందరగోళానికి గురయ్యారు.

# రథసప్తమి వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు... పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

రథసప్తమి వేడుకల కోసం నగరంలో జరుగుతున్న ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గత సోమవారం రాత్రి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కోడిరామ్మూర్తి స్టేడియం, ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేఆర్ స్టేడియంలో నిర్వ హించే సాంస్కృతిక కార్యక్రమాలకు వేల సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉందని, గ్యాలరీలు, సిట్టింగ్ ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలన్నారు. చిన్నారుల కోసం స్టేడియంలో కిడ్స్ ఆటస్థలం, అమ్యూజ్‌మెంట్ పార్కులను పరిశీలించారు. కార్యక్రమాల వద్ద ఎక్కడా తోపులాటలు జరుగకుండా చూడాలని ఆదేశించారు. డ్వాక్రా బజార్, ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సందర్శకులకు ఎటు వంటి ఇబ్బంది కలుగకుండా విశాలమైన దారులు ఉండేలా చూడాలన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న 'హాట్? ఎయిర్? బెలూన్' పాయింట్ వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమ న్వయంతో పనిచేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు.

# రెండోరోజు పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలిన

పోలవరం ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా విదేశీ నిపుణుల బృందం రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. విదేశీ నిపుణులు హించ్ బెర్గర్, డేవిడ్ బి పాల్, ఫ్రాంకో డి సిస్కోలతో పాటు కేంద్ర జల వనరుల శాఖలోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. వీరు రెండో రోజు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్ ప్రతినిధులతో సమావేశమై తోలి రోజు ఫీల్డ్‌లో తమ దృష్టికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈ ఎన్‌సీకే నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ఈఆర్ రామచంద్ర రావు, ఎంఈఐఎల్ జనరల్ మేనేజర్ ఏ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి తదితరులు అంతర్జాతీయ నిపుణుల బృందంతో పాటు కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరాలు అందించారు. వారిచ్చిన వివరాలతో పాటు తాము ఫీల్డ్‌లో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకొని సందేహాలు తీర్చుకున్నారు. ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి, మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సీఎసచవతీతీచంఆరచవతీతీచస్ అధికారులు మనీష్ గుప్తా, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆరచవతీతీచస్ ప్రతినిధి వివిఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం. రఘురాం, డైరెక్టర్ కె.శంకర్, ఎన్ఐఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని ఉన్నారు.

**మొదటిరోజు పర్యటనలో పరిశీలించిన అంశాలు:** ఇదిలా ఉండగా మొదటిరోజు పర్యటనలో భాగంగా సోమవారం ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు డయాఫ్రంవాల్‌ను ఆనుకుని ప్లాస్టిక్ క్లేకోర్ ఉన్న ప్రాంతాల్లో షీప్ ఫుట్ రోలర్లు వాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అధికారులను ఆకృతులు, డ్రాయింగ్‌లకు సంబంధించి అనేక ప్రశ్నలు వేశారు. పనులు ఎలా జరుగుతున్నాయి? ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగారు. డి హిల్ గ్రౌటింగ్ పనులు సైతం దగ్గరుండి చూశారు. డయాఫ్రం వాల్? పనుల్లో గతంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించారా లేదా అని విదేశీ నిపుణులు ఆరా తీశారు. గతంలో తలెత్తిన బ్లీడింగ్, రాయిలోకి ఎంత లోతు వరకు ప్లాస్టిక్? కాంక్రీటు నింపాలి వంటి అంశాల్లో వచ్చిన సమస్యలు పరిష్కారమయ్యాయని అధికారులు సమాధానమిచ్చారు.

**డయాఫ్రం వాల్ పనులు:** డయాఫ్రం వాల్ పనుల్లో గతంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించారా లేదా అని విదేశీ నిపుణులు ఆరా తీశారు. గతంలో తలెత్తిన బ్లీడింగ్, రాయిలోకి ఎంత లోతు వరకు ప్లాస్టిక్ కాంక్రీటు నింపాలి వంటి అంశాల్లో వచ్చిన సమస్యలు పరిష్కారమయ్యాయని అధికారులు సమాధానమిచ్చారు. ఐఐటీ–తిరుపతి నిపుణులతో కలిసి సిద్ధం చేసిన మెథడాలజీ ప్రకారం డయాఫ్రం వాల్? పనులు చేయడంతో బ్లీడింగ్? సమస్య పరిష్కారమైందని వివరించారు. ఫిబ్రవరికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ పనులకు సంబంధించిన నాణ్యత నియంత్రణ పరీక్షల ఫలితాలను విదేశీ నిపుణులు పరిశీలించారు. పనుల డాక్యుమెంటేషన్? మరింత పక్కాగా ఉండాలని సూచించారు. అనంతరం పోలవరం ప్రాజెక్ట్? అథారిటీ, ప్రాజెక్ట్, జలవనరులశాఖ అధికారులతో సమావేశమై పనుల తీరుతెన్నులపై సమీక్షించారు.

# ఆర్య వైశ్యులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది

రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఆర్య వైశ్యులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరి గట్టున ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్య వైశ్యుల ఆహ్వానం మేరకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన పూజాది కార్యక్రమాల్లో మార్కండేయేశ్వర స్వామి ఆలయం మాజీ ఛైర్మన్, 23వ డివిజన్ ఇంచార్జ్ యిన్నమూరి దీపు, మాజీ కార్పొరేటర్ యిన్నమూరి రాంబాబు, పి సుభాష్, చొప్పర్ల భద్రరావు తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... వాసవి మాత తమ కుటుంబ సంప్రదాయం కోసం అగ్నిప్రవేశం చేసి ఆత్మార్పణ చేసినట్టు పురాణాలు చెబుతాయన్నారు. ఇది శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి త్యాగాన్ని గుర్తుచేస్తూ ఆర్యవైశ్య కులంలో ప్రతిపాదించబడిన పవిత్ర ఉత్సవమన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుగొండ మండలంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం ఆర్యవైశ్యులకు పవిత్ర క్షేత్రం అని అన్నారు. వాసవి మాత ఆత్మర్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా గౌరవిస్తూ, పెనుగొండ మండలాన్ని "వాసవి పెనుగొండ"గా మార్చి కూటమి ప్రభుత్వం వైశ్య కమ్యూనిటీని గౌరవించిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆర్య వైశ్యులకు ఇచ్చిన వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు.



# గ్రామాల ప్రగతికి మరింత కృషి : ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం (చైతన్యరథం): మన్యం మండలాల్లో గ్రామాల ప్రగతికి కూటమి ప్రభుత్వం మరింత కృషి చేస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాల్లో భాగంగా జీలుగుమిల్లిలో నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినతుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే చింతమనేని శంకుస్థాపన



దెందులూరు (చైతన్యరథం): "కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల సహకారంతో దెందులూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను చేపట్టడమే కాకుండా వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పీఎం జేఎవై పథకంలో భాగంగా దెందులూరు మండలంలోని వేగవరం, గోపన్నపాలెం గ్రామాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు, మంచినీటి బోరు నిర్మాణం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... శంకుస్థాపన చేసిన కార్యక్రమాలను 10 రోజుల్లో పూర్తి చేస్తామని, అదేవిధంగా గ్రామాలలో అవసరమైన పనులు ఉంటే అవి కూడా చేస్తామని తెలిపారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో గోపన్నపాలెం పెట్ కాలేజీని గోడలు కట్టేసి వదిలేశారు. ఆపనులు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఏలూరు జాతర మహోత్సవాలకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేయాలి

## ●ఏలూరు జాతర మహోత్సవాలు ఏర్పాట్లపై ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య సమీక్ష



ఏలూరు (చైతన్యరథం): జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం ఏలూరు జాతర మహోత్సవాలు ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ సంయుక్తంగా సంబంధిత అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ... ఏలూరు నగరంలో అత్యంత వైభవంగా జరిగే జాతర మహోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించారు. జాతరలో భక్తులు పెద్దఎత్తున పాల్గొనే అవకాశం ఉన్న దృష్ట్యా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు బందోబస్త్ ప్రణాలికను రూపొందించాలన్నారు. గత ఏర్పాట్లను పరిగణలోకి తీసుకుని ఈసారి జరగబోయే జాతర మహోత్సవాలను విజయవంతం చెయ్యాలని అన్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రక్షిత మంచినీరు, పారిశుధ్యం, నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా, రవాణా, జనరేటర్లు, టిపిటాప్ పందిర్లు, అవసరమైన చోట వైద్య శిబిరాలు, ట్రాఫిక్ నియంత్రణ, తదితర మౌలిక వసతులను సమకూర్చాలని అన్నారు. రహదారులుపై ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు, పార్కింగు ప్రదేశాలు, పట్టిష్టమైన భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. ఒక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటుచేసి 24 గంటలు పనిచేసేలా, టోల్ ఫ్రీ నెంబరు అందరికి తెలిసేలా డిస్ ప్లే చెయ్యాలని అన్నారు. జాతర ప్రాంగణంలో తాత్కాలిక వైద్య శిబిరాలు, శిబిరాల్లో హార్ట్ ఎటాక్ ఇంజక్షన్లు, ఫిట్స్ కు సంబంధించిన మందులు, అత్యవసర మందులతో పాటు ఓఆర్ యస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించి, చెత్త తొలగింపు పనులు నిరంతరాయంగా చేపట్టాలని అన్నారు. భక్తులు అధికారులు సూచించే నిబంధనలను పాటిస్తూ సహకరించాలని, పుకార్లు, వదంతులకు తావివ్వకుండా ప్రశాంతంగా జాతరను విజయవంతం చెయ్యాలని అన్నారు. జేబుదొంగలను, ఆకతాయిలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయంలో మహిళా పోలీసులను, యన్ సిసి, యన్ యస్ యస్ వాలంటీర్లను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలన్నారు. పలుసేవా, స్వచ్ఛంద సంస్థలు సేవలు వినియోగించు కోవాలని సూచించారు.

**ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ...** జాతర కమిటీ నిర్వాహకులు, పోలీసులు సమన్వయం చేసుకుంటే జాతర విజయవంతం అవుతుంది అన్నారు. ఏలూరు జాతర సందర్భంగా ఎవరు కూడా సంక్రాంతి పండుగ కూడా చేసుకోలేదని అన్నారు. ఇంకా కావలసిన ఏర్పాట్లు, సీసీ కెమెరాలు ఎన్ని కావాలో ముందుగా తెలియ జేసినట్లయితే యుద్ధ ప్రాతిపదికన జిల్లా యంత్రాంగం సహకారంతో పూర్తి చేస్తానన్నారు. జాతర మహోత్సవం సందర్భంగా అవసరమైన చోటకి వాటర్ ట్యాంకులు పంపిస్తామని, ప్రతి కుటుంబం ఇంటి అవసరాలతో పాటు ఎగస్ట్రాగా ఒక డ్రమ్ము వాటరు నింపుకోవాలని సూచించారు.జనవరి 25, 26 తేదీలు అమ్మవారికి కుంభం పోయుట, అమ్మవారు ఊరేగింపులు తూర్పువీధి, దక్షిణపు వీధి, పవర్ పేట, లక్ష్మీవారపు పేట, ఆదివారపు పేటలు అయిదు ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. ఫిబ్రవరి 01, 02 తేదీలు కుంభం పొయ్యుట, అమ్మవారు ఊరేగింపులు పడమర వీధిలో మాత్రమే జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 08, 09 తేదీలలో కుంభం పొయ్యుట, అమ్మవారు ఊరేగింపులు తంగేళ్లపూడిలో మాత్రమే జరుగుతాయని జిల్లా కలెక్టరుకు వివరించారు. ఇందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లకు సహకరించాలని కోరారు. ముందుగా ఏ గ్రామాల్లో అమ్మవారి జాతర జరుగుతుందో టామ్ టామ్ ద్వారా తెలియజేసినట్లయితే ఇబ్బందులు తలెత్తావని అన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పెనుగొండ (చైతన్యరథం): పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, ఆర్యవైశ్యుల కాశీగా పిలవబడే పెనుగొండలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మ పరిరక్షణ కోసం తన ప్రాణాలనే అర్పించిన వాసవి మాత



అమరత్వానికి ప్రతీక అని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. అహింసా మార్గంలో ధర్మాన్ని కాపాడిన అమ్మవారి ఆత్మార్పణ వృత్తాంతం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన అన్నారు.

# పేద కుటుంబాలను ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి



వినుకొండ (చైతన్యరథం): సీఎం సహాయనిధి పేదల పాలిట పెన్నిధని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 113 మంది లబ్ధిదారులకు, 59 లక్షలు 86 వేలు చెక్కులను మంగళవారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, జనసేన నాయకులు నిస్సంకర శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

# రూ.3.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా గళ్ళా మాధవి రూ.3.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. 23వ డివిజన్ పరిధిలోని హజరత్ కాలే మస్తాన్ వలి బాబా దర్గా వెనుక వైపు, ఐదీబీ బ్యాంక్ నుంచి మూడు బొమ్మల సెంటర్ వరకు ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.50 లక్షల వ్యయంతో CC రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి ఇప్పటికే కొంత భాగంలో మాత్రమే ఉండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, మొత్తం రోడ్డు ఒకే విధంగా జజ రోడ్డుగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం సుమారు 100 మీటర్ల పనులు ప్రారంభించగా, మిగతా భాగం కూడా టెండర్ ప్రక్రియ పూర్తయ్యాక త్వరలోనే పూర్తి కానుంది. రెండు మూడు నెలల్లోనే ఈ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి రానుంది. అదేవిధంగా, ఈ ప్రధాన రోడ్డుతో అనుసంధానమై ఉన్న అంతర్గత రోడ్లు కూడా చాలా పాతవని, లో-లెవెల్‌లో ఉన్నాయని గుర్తించిన ఎమ్మెల్యే, వాటిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి డ్రెయిన్లు, రోడ్లు కలిపి సమగ్ర అభివృద్ధి చేపడతామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. అదేవిధంగా 35 డివిజన్ పరిధిలో కృష్ణ నగర్ 1వ లైన్, 2వ లైన్ (ఉత్తరం వైపు) రామంజకుట్టం క్రాస్ రోడ్లు, టెంపుల్ రోడ్డు ప్రాంతాల్లో రూ.1.50 కోట్లతో CC డ్రెయిన్లు మరియు RCC కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... 23,35వ డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది. దర్గా వెనుక రోడ్ అనేది ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉండి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పుడు పూర్తి స్థాయిలో CC రోడ్డుగా అభివృద్ధి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు, డ్రెయిన్లను కూడా సమగ్రంగా అభివృద్ధి చేస్తాం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

**ఇటీవల గుంటూరు పశ్చిమంలో నిర్వహించిన సరస్ మేళాపై మాట్లాడుతూ...**

గతంలో ఇంతకుముందెన్నడూ చూడని విధంగా ఈసారి సరస్ మేళా అద్భుతంగా జరిగింది. ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదు, మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన వేదిక. దేశవ్యాప్తంగా మహిళలు సాధించిన స్వయం సాధికారతను పరస్పరం తెలుసుకునే అవకాశం లభించింది. రానున్న రోజుల్లో కూడా స్త్రీ సంక్షేమం, స్త్రీ సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# శ్రీ వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన

**టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి .రాజేంద్రప్రసాద్**

కంకిపాడు (చైతన్యరథం): శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా కంకిపాడులోని శ్రీ కన్యక పరమేశ్వరి ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు మొక్కులు చెల్లించుకున్నారు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్. మంగళవారం శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ చెందిన రోజున అమ్మవారి పూజా కార్యక్రమంలో నన్ను కూడా భాగస్వాములను చేసినందుకు ప్రత్యేకించి పేరుపేరునా అందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, అమ్మవారి కృపాకటాక్షాలు మనందరిపై ఉండాలని కోరుకుంటున్నానని రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిరోధకులు జగన్ సైన్యం : నసీర్ మండిపాటు

◆పరిశ్రమలను తరిమేసిన దుర్మార్గపు చరిత్ర వైసీపీది

◆గూగుల్ వంటి సంస్థలను ఏపీకి తెచ్చిన ఘనత కూటమిది

◆రూ.2.05 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో అభివృద్ధి నిరోధకులుగా జగన్ సైన్యం ఉందని, ప్రజలు సంతోషంగా ఉంటే ఓర్వలేకపోతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరు నగరంలోని సీతానగర్‌లో రూ.28.40 లక్షలు, షాప్ ఎంప్లాయిస్ కాలనీలో 30.50 లక్షలు, వినోభానగర్‌లో రూ.40 లక్షలు, బసవతారక నగర్ లో 37.50 లక్షలు, మద్దిరాల కాలనీలో రూ.37.50 లక్షలు, మోతీలాల్ నగర్‌లో రూ.31 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. దీంతో ప్రతి గడపలోనూ సంతోషాలు కనిపిస్తున్నాయని, సంక్రాంతి సంబరాల వైభవమే దీనికి నిదర్శనమని చెప్పారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లతో ప్రజలకు అందిస్తూ స్వర్ణాంధ్ర సాధన కోసం కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో అమరాన్, జాకీ వంటి గొప్పగొప్ప పరిశ్రమలను తరిమేసిన దుర్మార్గపు పాలన జగన్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో దావోస్ వేదికగా గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను తీసుకొచ్చారని, దీంతో యువతకు వేల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని తెలిపారు. వైసీపీ నేతలు అన్ని అభివృద్ధి పనులకు అడ్డు పుల్లలు వేయడం చూస్తుంటే ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని విమర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు.

# వాసవీ అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్యే తంగిరాల



నందిగామ (చైతన్యరథం): నందిగామ శ్రీపురంలోని వాసవీమాత మందిరంలో మంగళవారం అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాల్లో పవిత్ర జలాన్ని నింపి అమ్మవారికి అభిషేకం చేశారు. 1000 ఫలాలతో అర్చన చేశారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సారె సమర్పించారు.

# అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహంపై వైసీపీ ఫేక్ ప్రచారం

◆ విగ్రహ ఏర్పాటు నేపథ్యంలో కులాల మధ్య వైసీపీ చిచ్చుపెట్టేలా దుష్ప్రచారం



దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు విషయంలో వైసీపీ దుష్ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు నేపథ్యంలో కులాల మధ్య వైసీపీ చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తింది. ఫేక్ ఐడీలతో వైసీపీ సోషల్ మీడియా టీమ్ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది.

**తెలుగు ఫ్రైడ్ థీమ్‌తో ఎన్టీఆర్ విగ్రహం..**

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు నిధుల సమీకరణపై ఏపీ ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అమరావతిలో తెలుగు ఫ్రైడ్ థీమ్‌తో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. గుజరాత్ ఫ్రైడ్ పేరుతో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అదే తరహాలో తెలుగు ఫ్రైడ్ పేరుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా కూటమి సర్కార్ కసరత్తు చేస్తోంది. టూరిజాన్ని ఆకర్షించేలా.. ఎన్టీఆర్ విగ్రహం, ఫ్యూచర్ మ్యూజియం వంటివి ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

**పీపీపీ పద్ధతిలో..**

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, పార్కును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసేలా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని నీరుకొండ గ్రామస్తులు కూడా కోరారని ప్రభుత్వం స్పష్టం చేసింది. కులాల మధ్య చిచ్చు పెట్టేలా వైసీపీ వ్యవహరిస్తే... చర్యలు తీసుకోవాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఉండగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసేందుకు గత జగన్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని కూటమి నేతలు గుర్తుచేశారు.

# ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుంది



గన్నవరం (చైతన్యరథం): అనారోగ్య కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు లబ్ధిదారులకు సుమారు రూ.7 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఎల్ఓసీ పత్రాలను గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా బుద్దవరం గ్రామానికి చెందిన వల్లె రామారావుకి వైద్య చికిత్స నిమిత్తం రూ.3,04,687, అలాగే వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన పఠాన్ రిహాన్ ఖాన్‌కి రూ.4,00,807 చొప్పున ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఆపద సమయంలో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తూ, అవసరమైన వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చందపర్రు గ్రామ సమగ్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నా

**● రూ.20 లక్షలతో మంచినీటి సరఫరా అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన**



పాలకొల్లు (చైతన్యరథం): దళిత గ్రామమైన చందపర్రు గ్రామ సమగ్ర అభివృద్ధికి తానెప్పుడూ అధిక ప్రాధాన్యతనిస్తున్నానని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం చందపరు గ్రామంలో రూ 20 లక్షలతో మంచినీటి సరఫరా పథకానికి సంబంధించి మైక్రో ఫిల్టర్, పైప్ లైన్ విస్తరణ వంటి పనులకు ఆయన కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గ్రామస్తులకు సురక్షిత త్రాగునీరు అందించాలని ఉద్దేశంతోనే నిధులు తీసుకువచ్చి మంచినీటి సరఫరా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. 2014లో మొదటిసారి ఎమ్మెల్యేగా రూ 10 కోట్లతో పూలపల్లి నుంచి ఆగర్తపాలెం గ్రామం వరకు రోడ్ నిర్మాణం చేపట్టామని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో 7 కోట్లతో రోడ్డు పదిలంగా ఉండేలా మురుగు డ్రైన వెంబడి సీసీ వాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గ్రామంలో విద్యుత్ సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ అసంపూర్తి స్లాబ్ ను పూర్తిచేసే బాధ్యత తీసుకుంటానని, నిర్మాణ పనుల్లో శ్రమదానం కూడా చేస్తానని తెలిపారు. వచ్చే ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతి నాటికి పూర్తి చేసి వేడుకలు జరుపుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను అన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి సొంత కార్యక్రమం దళిత గ్రామం ఆర్య పేటలో అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ ల విగ్రహాల స్లాబ్ నిర్మాణ పనుల్లో శ్రమదానం చేసి పూర్తి చేయడం జరిగిందన్నారు. గ్రామంలో బరియల్ గ్రౌండ్ , చర్చి అభివృద్ధికి వ్యక్తిగతంగా సహకారం అందిస్తానని మంత్రి రామానాయుడు తెలిపారు. చంద పడుతోపాటు చందపర్రుతోపాటు వెలివెల, గోరంటాడ, ఆగర్తిపాలెం, సగం చెరువు నా సొంత గ్రామాలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, సర్పంచ్ కొయ్య అచ్చయ్య, మేడిది జాన్ రాజ్, నెక్కింటి ఆదినారాయణ, రాచమల్ల మీరయ్య, పరువు యేసు దయ, పరువు సుజాత, కర్ని ఇశ్రాయేలు, నక్క సామ్యూల్ రాజు, దేవ బత్తుల వెంకటేశ్వరరావు, నక్క నరసింహారాజు, నక్క రాహుల్, అని పే జాన్, బొడ్డుపల్లి విజయానందం,ముప్పైతిక అభిమన్యుడు, కొయ్య సందీప్, అడిదల పుష్పరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# గిగ్ వర్కర్‌గా మారిన పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**● ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం ఇదో మార్గం అంటున్న ప్రజాప్రతినిధి**



విజయవాడ శివారులోని పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సరికొత్త అవతారమెత్తి అందరినీ ఆశ్చర్యపరిచారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యేందుకు ఆయన ఎంచుకున్న తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సామాన్య డెలివరీ బాయ్ కష్టాలను తెలుసుకునేందుకు ఆయన స్వయంగా ఒక రోజు గిగ్ వర్కర్‌గా మారి వీధుల్లో చక్కర్లు కొట్టారు. మంగళవారం ఉదయం బోడె ప్రసాద్ ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టామార్ట్ డెలివరీ బాయ్ యూనిఫాం ధరించి, తలకు హెల్మెట్ పెట్టుకుని సిద్ధమయ్యారు. తన సొంత కారు పక్కన పెట్టి, ద్విచక్రవాహనంపై ఆర్డర్లను తీసుకుని కస్టమర్ల ఇళ్లకు వెళ్లారు. ఎమ్మెల్యే స్వయంగా సరుకులు పట్టుకుని ఇంటి తలుపు తట్టడంతో నియోజకవర్గ ప్రజలు అవాక్కయ్యారు. రాజకీయ నాయకుడంటే కేవలం సభలు, సమావేశాలకే పరిమితం కాకుండా, ఇలా సామాన్యుడిలా తమ మధ్యకు రావడం చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ వన్ డే డెలివరీ బాయ్ ప్రయోగం వెనుక ఒక బలమైన ఉద్దేశం ఉందని బోడె ప్రసాద్ చెబుతున్నారు. ఎండనక, వాననక గంటల తరబడి కష్టపడే డెలివరీ బాయ్స్ పడే ఇబ్బందులను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే తాను ఈ పని చేసినట్లు ఆయన వివరించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్ల పరిస్థితి, డెలివరీ రంగంలో ఉన్న ఒడిదుడుకులను ఆయన స్వయంగా అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. రాజకీయం అంటే కేవలం ఓట్లు వేయించుకోవడం మాత్రమే కాదు, ప్రజల జీవనశైలిని అర్థం చేసుకోవడం కూడా అని ఆయన చెబుతున్నారు. బోడె ప్రసాద్ ఎప్పుడూ వినూత్న కార్యక్రమాలతో వార్తల్లో నిలుస్తుంటారు. గతంలోనూ నియోజకవర్గంలోని పారిశు ధ్ద్య కార్మికులతో కలిసి పని చేయడం, సామాన్యులతో కలిసి హోటళ్లలో టీ తాగడం వంటి పనుల ద్వారా ఆయన పీపుల్స్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా యువతలో ఆయనకు ఉన్న క్రేజ్ ఈ తాజా డెలివరీ బాయ్ అవతారంతో మరింత పెరిగింది. ఆయన చేసిన ఈ పనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం వాట్సాప్ స్టేటస్‌లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో వైరల్ అవుతున్నాయి.

ప్రజాప్రతినిధులు ఏసీ గదులకే పరిమితం కాకుండా ఇలా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవడం మంచి పరిణామంగా భావిస్తున్నారు. 2014లో మొదటి సారి గెలిచిన ఆయన 2019లో రెండో సారి ఓడిపోయారు. ఆ సమయంలో కూడా నియోజకవర్గాల్లో పలు కాలనీల్లో పర్యటించి.. బైక్ మీద ఓటర్ల ఇంటికి తాను తప్పు చేసి ఉంటే క్షమించాలని కూడా అడిగారు.

# ఇస్తేమా కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



కడప (చైతన్యరథం): కడపలో మూడు రోజులపాటు జరగనున్న ఇస్తేమా సందర్భంగా కొప్పర్తి పారిశ్రామికవాడ సమీపంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జాతీయ స్థాయి తబ్లిగి జమాతే ఇస్తేమా నిర్వహిస్తున్నారు. దీనికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను సహచర మంత్రి ఫారూక్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్యరెడ్డి, మారెడ్డి రవీంద్ర రెడ్డి (బీటెక్ రవి), కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ నచికేత్, ఇతర సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత. ఇస్తేమా కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన అన్ని ఏర్పాట్లను మంత్రి సవితమ్మ సమగ్రంగా సమీక్షించారు. భద్రతా ఏర్పాట్లు, రవాణా నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్య సదుపాయాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను మంత్రి సవిత ఆదేశించారు.

# అతికారి వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాజంపేట (చైతన్యరథం): నియోజకవర్గం సిద్దవటంకి చెందిన టీడీపీ సీనియర్ రాజకీయ నాయకుడు అతికారి వెంకటయ్య ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వెంకటయ్య ఫోటోకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం




ఆదోని (చైతన్యరథం): ఆదోని నియోజకవర్గంలో 55 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మంగళవారం అందించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో రూ.22.59 లక్షల విలువైన చెక్కులను 55 బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం లాంటిదని, అనేక రకాలుగా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు భరోసానిస్తోందని తెలిపారు.

# లంచ్ బాక్సులో లంచం... రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



మదనపల్లి (చైతన్యరథం): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో లంచం దందా బయటపడింది. గుర్రంకొండలోని ఏబీసీ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్గ్రేడ్ చేయడానికి అనుమతులు ఇవ్వాలంటే లంచం ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేసిన విద్యాశాఖ అధికారులు చివరకు ఏసీబీకి చిక్కారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. గుర్రంకొండకు చెందిన ప్రైవేట్ స్కూల్ యజమాని శేషాద్రినాయుడు తన పాఠశాలను హైస్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు 2025 అక్టోబర్ నెలలో ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ ఫీజులు చెల్లించి, అవసరమైన అన్ని పత్రాలను మదనపల్లె డీవైఈఓ కార్యాలయంలో సమర్పించారు. నెల రోజుల తర్వాత ఆ ఫైల్ డీఈఓ కార్యాలయానికి చేరింది. అయితే అన్ని అర్హతలు, డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ అనుమతులు మంజూరు చేయకుండా కార్యాలయ అధికారులు లంచం డిమాండ్ చేయడం ప్రారంభించారు. డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మహబూబాబాషా అలియాస్ మున్నా కలిసి స్కూల్ అప్గ్రేడ్‌కు రూ.65 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత మొత్తాన్ని ఇవ్వలేనని శేషాద్రినాయుడు ప్రాధేయపడటంతో, చివరకు రూ.45 వేలకు బేరం కుదుర్చుకున్నారు. డబ్బులు ఇస్తే తప్ప ఫైల్ ముందుకు కదలదని స్పష్టంగా చెప్పడంతో శేషాద్రినాయుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. లంచం ఇవ్వడానికి నిరాకరించినందుకు జనవరి 5న ఫైల్‌పై రిమార్కులు రాసి తిరిగి డీవైఈఓ కార్యాలయానికి పంపించారు. ఈ విషయమై డీఈఓ కార్యాలయాన్ని కలిసిన శేషాద్రినాయుడికి, ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం రూ.45 వేలు ఇస్తేనే పని జరుగుతుందని, డబ్బులు సీనియర్ అసిస్టెంట్ మున్నా వద్ద అందజేస్తే సరిపోతుందని సూచించారు. అంతేకాదు, గ్రీన్ కలర్ లంచ్ క్యారియర్ బాక్సులో డబ్బులు పెట్టి సంక్రాంతి సెలవుల తర్వాత జనవరి 19న తీసుకురావాలని మున్నా చెప్పాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని శేషాద్రినాయుడు కడప ఏసీబీ కార్యాలయాన్ని ఆశ్రయించి డీఎస్పీ సీతారామరావుకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డీఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మున్నా లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరెవరి ప్రమేయం ఉందా అనే కోణంలో లోతుగా విచారణ చేపడతామని కడప ఏసీబీ డీఎస్పీ సీతారామరావు తెలిపారు. నిందితులు రాజశేఖర్, మున్నాను రిమాండ్ నిమిత్తం నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం కోరే అధికారులకు ఇది గుణపాఠమని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

## త్యాగానికి ప్రతీక వాసవీ మాత జగన్మాత ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి

**● ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి**



పుట్టపర్తి (చైతన్యరథం): త్యాగాలకు ప్రతీక వాసవీ మాత శ్రీకన్యకా పరమేశ్వరి అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కొనియాడారు. ఆర్య వైశ్యల ఆరాధ్య దైవమైన వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మాజీ మంత్రికి ఆర్యవైశ్యలు ఘనస్వాగతం పలికారు. వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్యవైశ్యుల కులదైవమైన వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఘనంగా ఆత్మార్పణ వేడుకలను జరుపుకొంటున్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. హిందువుల పవిత్రంగా కొలిచే మాతా వాసవి కన్యకా పరమేశ్వరి యావత్ ప్రజలు స్మరించుకొంటున్నారని అన్నారు. ఆర్య వైశ్యుల కుటుంబములో జన్మించిన మహిళా అయిన వాసవినీ విష్ణువర్ధనరాజు అనే రాజు బలవంతంగా కన్యకా పరమేశ్వరుని పెళ్లి చేసుకోవాలన్నప్పుడు తన వల్ల ఎవరు ఇబ్బంది పడకూడదని కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసి చరిత్రలో నిలిచిపోయిందని దానికి గుర్తుగా ఈ వేడుకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్య కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు. ఈ మూడు దేవాలయాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి ఆర్య వైశ్యుల సంఘం నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పూల మాల వేసి శాలువాతో సన్మానించారు. వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా ఆర్య వైశ్యుల సంఘం ఆధ్వర్యంలో అన్న వితరణ చేశారు.

**మాజీ ఎంపీపీ బాలును పరామర్శించిన మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**

బుక్కపట్నం మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ బాలు తీవ్ర అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న అతన్ని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మంగళవారం ఆ నివాసానికి వెళ్లి పరామర్శించారు. బాలు ఆరోగ్య పరిస్థితి మాజీ మంత్రి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. మంచి ఆహారాన్ని తీసుకొని సకాలంలో తగిన వైద్య మందులను వేసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకుని ఆరోగ్య జీవితం పొందాలని కోరారు. మాజీ మంత్రితో పాటు బుక్కపట్నం మండలానికి చెందిన టిడిపి నాయకులు కూటమి పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సహకారంతో ఊపందుకున్న బిటిపి కాలువ పనులు

**●క్రిష్ణ జలాలతో మారనున్న రాయదుర్గం రూపురేఖలు**



రాయదుర్గం (చైతన్యరథం): కరువు పీడిత ప్రాంతానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మరో అపర భగీరథుడయ్యారు. దశాబ్దాలుగా వర్షాభావం, తాగు, సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలకు క్రిష్ణ జలాలు అందించడమే లక్ష్యంగా నిరంతర శ్రమిస్తున్నారు. బోరంపల్లి ఒంటిమిట్ట, గంగవరం ప్రాంతాల్లో శరవేగంగా దూసుకుపోతున్న బిటిపి పనుల పురోగతిని మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత అధికారులతో కాలువపై కలియతిరిగారు. భూ సేకరణ, పనుల పురోగతికి ఎదురవుతున్న అవరోధాలు, అడ్డంకులను అడిగి తెలుసుకొన్నారు. పనుల్లో మరింత వేగం పెరిగేలా, నిర్దేశించిన గడువులోపు పూర్తయ్యేలా ఆయన పర్యటన కొనసాగింది. ఈ మహా జలయజ్ఞం అనంతపురం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టం.

**మారనున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం రూపురేఖలు**

అత్యంత వెనుకబడ్డ రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల రూపురేఖలు మార్చటానికి ఈ ఎత్తిపోతల పథకం దోహదపడుతోంది. జీడిపల్లి నుండి నీటి తరలింపు అంశం ప్రజల జీవితాల్లో ఆశాజ్యోతి వెలిగించబోతోంది. వర్షాల మీద మాత్రమే ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడుతూ, రెండు పంటలు సాగు చేసే దిశగా ఈ ప్రాంతం అడుగులు వేస్తోంది. కరువుకు శాశ్వత పరిష్కార దిశగా అడుగులు పడనున్నాయి. ప్రభుత్వంతో నిరంతర సమన్వయం, అధికారులతో సమీక్షలు, సాంకేతిక అధ్యయనాల ద్వారా ఈ పథకాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ఆయన విశేషంగా కృషి చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణ వ్యయం, సాగు విస్తీర్ణం పరిశీలిస్తే వీలుకాదని నిపుణులు వ్యతిరేకించినా ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆయనకున్న వ్యక్తిగత పరిచయం, సన్నిహిత్యంతో ఇక్కడి పరిస్థితిని వివరించి ప్రాజెక్ట్ మంజూరులో కీలకపాత్ర పోషించారు. రాయదుర్గం, కళ్యాణ్ దుర్గం నియోజకవర్గాల్లో దాదాపు 23 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు మరో 1.20 లక్షల మందికి తాగునీటి సమస్యను తీర్చడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. సుమారు రూ.968 కోట్ల విలువైన ఈ పథకాన్ని కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేక అనుమతులతో మంజూరు చేయించారు. 2018లో పనులు ప్రారంభించి 30 శాతం పూర్తి చేయగలిగారు. 2019లో వైకాపా అధికారంలోకి రావడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఐదేళ్ల జగన్ పాలనలో ఎటువంటి ప్రగతికి నోచుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. 2029 నాటికి జీడిపల్లి నుండి కృష్ణా జలాలను భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు తీసుకుపోయే లక్ష్యంతో పనులు వేగవంతమయ్యాయి. జీడిపల్లి వద్ద లిఫ్ట్ ద్వారా ప్రధాన కాలువకు నీటిని ఎత్తిపోస్తే దాదాపు 90కిలోమీటర్ల పొడవైన కాలువలు, ఉపకాలువల ద్వారా నీరు ప్రవహించనున్నాయి. 29 కిలోమీటర్ల ప్రధాన కాలువలో ఇప్పటి వరకు 16.400 కిలోమీటర్లు పూర్తి చేశారు. అలాగే గరుడాపురం నుండి ప్రారంభమయ్యే బీటీపీ ఉపకాలువ 32.625 కిలోమీటర్లు చేపట్టాల్సి ఉండగా 15.210 కిలోమీటర్లు పూర్తి చేశారు. 32.025 కిలోమీటర్ల పొడవైన కుందుర్పి ఉప కాలువలో 15.850 కిలోమీటర్లు పూర్తి చేశారు. కాలువ పొడవు మొత్తం 93.65 కి.మీ వెంబడి మట్టి తవ్వకం, ఫీడర్ చానెల్స్ వద్ద మట్టి తవ్వకం, వాగుల ట్రిమ్మింగ్ పనులు, 216 సంఖ్యల క్రాస్ మేసనరీ, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. భూ సేకరణ ప్రక్రియ కూడా వేగవంతమైంది. బి టి పి కింద 12 వేల ఎకరాల ఆయకట్టుతో సాగునీరు అందించటంతో పాటు గరుడాపురం నుండి కుందుర్పి కాలువ మధ్యన మరో 114 చెరువులకు మీరు ఇవ్వనున్నారు. 2029 లోపు బిటిపి ప్రాజెక్టుకు నీరు తీసుకెళ్లే లక్ష్యం దిశగా పనులు ఊపొందుకున్నాయి.

**నీటి ఎద్దడి నుంచి విముక్తి**

రైతు బతుకుల్లో మార్పు ఈ పథకం అమలుతో వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందే అవకాశముంది. ఎండిపోయిన పొలాల్లో మళ్లీ పచ్చదనం కనిపించనుండగా, రైతుల ముఖాల్లో చిరునవ్వులు వికసించనున్నాయి. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి ఎద్దడి నుంచి విముక్తి లభించనుంది. ప్రజలకు ఇచ్చిన మాటను ఆచరణలో చూపిస్తూ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రజల ఆశలకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు. ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా ఆయన చేస్తున్న ప్రయత్నాలు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతున్నాయి. కరువుపీడిత ప్రాంతానికి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తరలించే ఈ మహత్తర ప్రయత్నం భవిష్యత్తు తరాలకు వరంగా, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేసిన కృషికి ప్రతిరూపముగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

## బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించిన గజదొంగ జగన్

**● మండిపడ్డ ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న**

అనంతపురం (చైతన్యరథం): బీసీ సబ్‌ప్లాన్ నిధులు దోచుకుని బీసీలను మోసం చేసిన వ్యక్తి జగన్ అని ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న మండిపడ్డారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి 19 నెలల కాలంలో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్రాన్ని ఒక పక్కన అభివృద్ధి ఒక పక్క సంక్షేమం ముందుకు ముందుకు తీసుకెళుతున్నారు. సంక్రాంతి పండుగను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటుంటే వైసీపీ నేతలు మాత్రం ప్రశాంత వాతావరణన్ని చెడగొట్టి ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు హత్య రాజకీయాలకు పాల్పడ్డారు. తుని నియోజకవర్గం, కోటనందూరు మండలం, అల్లిపుడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, బీసీ నేత లాలం బంగారయ్యను వైసీపీ నేతలు అతికిరాతకంగా హతమార్చారు. వైసీపీ నేతలు అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేక అలజడులు సృష్టించే కుట్ర చేస్తున్నారు, రపరపా అంటూ పిలుపునిచ్చి దాడులకు ప్రోత్సహించారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగం ఇచ్చిన 39% రిజర్వేషన్లు కోత పెట్టడం వల్ల 16,800 మంది బీసీలకు ప్రతినిధులు రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరమయ్యారు.

**బీసీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్ళించారు**

వైసిపి హయాంలో సొంత జిల్లా అయినటువంటి ప్రొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన నందన్ సుబ్బయ్యను రోడ్డుమీద అతికిరాతకంగా హత్య చేశారు, అమర్నాథ్‌గౌడ్‌ని పెట్రోలు పోసి నిప్పంటించారు. పల్నాడులో జల్లయ్యయాదవ్, తోట చంద్రయ్య లాంటి వందలాది మంది బీసీలను హత్య చేశారు. అయ్యన్నపాత్రుడు, సబ్బంహరి, పల్లా శ్రీనివాస్ వంటి నేతల భవనాలను కూల్చేశారు, తోటలను నరికేశారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రపై అక్రమ కేసులు పెట్టి వేధించారు. బీసీ మహిళా నేతలను కూడా విడిచిపెట్టలేదు ఆదిరెడ్డి భవాని, గౌత శిరీష, పంచమర్తి అనురాధ వంటి నేతలపై జగన్ సోషల్ మీడియా మూక వ్యక్తిత్వ హననానికి తెగబడ్డారు. బీసీలకు దక్కాల్సిన రూ.75,760 కోట్లు సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి ఎనిమిది వేల ఎకరాల ఆన్‌సైడ్ భూములను లాక్కొని ఉపాధిని దెబ్బతీశారు.

## రాష్ట్ర అభివృద్ధి టీడీపీ లక్ష్యం... అరాచకం వైసీపీ లక్ష్యం

**● రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు గొల్ల నరసింహ యాదవ్**




తిరుపతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకుంటే, వైసీపీ వాళ్లు మాత్రం ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు హత్య రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజల అభివృద్ధి మా తెలుగుదేశం పార్టీ లక్ష్యం, వైసీపీ మాత్రం అరాచకాలు చేస్తుందని మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. తుని నియోజకవర్గం బీసీ నేత లాలం బంగారయ్యను వైసీపీ నేతలు అతికిరాతంగా హత మార్చారని, అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేక బడుగు, బలహీన వర్గాలపై వైసీపీ నేతలు ధమనకాండకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. బీసీలలో ఎదిగే నాయకులను అనచి వేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని, తప్పు చేసిన వారిని ఎవరిని వదిలి పెట్టేది లేదని చెప్పారు. గత మీ ప్రభుత్వంలో బీసీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించారని, ఆదరణ రద్దు చేశారని, బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసి ఇప్పుడు బీసీలపై వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అడుగడుగున అవమానాలే జరిగాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి సొంత జిల్లా పొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన నందన్ సుబ్బయ్యను రోడ్డు మీద అత్యంత కిరాతంగా హత్య చేశారని, అమర్నాథ్ గౌడ్‌ను నడిరోడ్డుపై పెట్రోల్ పోసి నిప్పంటించి చంపారని, పల్నాడులో జల్లయ్య యాదవ్ తోట చంద్రయ్య లాంటి వందలాదిమంది బీసీలను హత్య చేశారని ఆరోపించారు. ఎన్‌సిఆర్‌బి రిపోర్టు ప్రకారం 188 మంది ఎస్సీలు హత్య గావించబడ్డారని పేర్కొన్నారు. బిసి వర్గానికి చెందిన రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి చేసింది పెద్దిరెడ్డి ముఠామే అని మీకు తెలియదా? పద్మ అనే బిసి మహిళ వైసీపీలో చేరనన్నందుకు వీధుల్లోకి నగ్నంగా లాగి అవమానంతో ఆత్మహత్యకు ఉసుగొలిపింది మీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. గతంలో అయన్న పాత్రుడు, సబ్బం హరి, పల్లా శ్రీనివాస్ వంటి నేతల ఇండ్లు, భవనాలు కూల్చలేదా, బీసీల తోటలను నరికేసారు ఎందుకు? అని ప్రశ్నించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రపై అక్రమ కేసులు పెట్టి, యనమల రామకృష్ణుడుపై అట్రాసిటీ కేసు పెట్టలేదా? బీసీ వర్గాన్ని రాజకీయంగా కొట్టి, సామాజికంగా అవమానించి, ఆర్థికంగా దోచుకొని, భౌతికంగా టార్గెట్ చేసి, వ్యవస్థను అనగదొక్కారు అని చెప్పారు. బీసీలకు దక్కాల్సిన 75,760 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించి, ఎనిమిది వేల ఎకరాల అసైన్ భూములను లాక్కొని ఉపాధిని దెబ్బతీశారన్నారు. విద్య, నైపుణ్యం, పారిశ్రామిక రాయితీలు,ఆదరణ వంటి పథకాలు రద్దుచేసి, వివిధ కులవృత్తులు చేసుకునే బీసీ కుటుంబాల పొట్ట కొట్టి వారి భవిష్యత్తును అంధకారం చేశారని పేర్కొన్నారు.



## బీజేపీ నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్

**- ఢిల్లీ పార్టీ కార్యాలయంలో బాధ్యతలు**
**- అతి పిన్న వయస్కుడిగా రికార్డ్**
**- నా బాస్ అంటూ మోదీ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జాతీయ అధ్యక్షుడిగా బిహార్ నేత నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 45 ఏళ్ల వయసులో ఈ పదవిని స్వీకరించిన ఆయన బీజేపీ చరిత్రలో అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. ఆయన పార్టీకి 12వ జాతీయ అధ్యక్షుడు. నితిన్ నబీన్ 1980లో జన్మించారు (బీజేపీ స్థాపన సంవత్సరం). బీహార్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. గతంలో బీహార్ మంత్రివర్గంలో పలు శాఖలు నిర్వహిం చారు. ఇప్పటివరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబీన్ సిన్హా ఎన్నిక కావడం లాంఛనప్రాయమైంది. 45 ఏళ్ల చరిత్ర గల బీజేపీకి తొలిసారిగా పార్టీ కంటే పిన్న వయస్కుడైన నితిన్ నబీన్ తొలిసారి అధ్యక్షుడయ్యారు. పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడిని ప్రధాని నరేంద్రమోదీ పూలమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పుడు నితిన్ నా బాస్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాగా.. పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, హర్దీప్‌సింగ్ పురి, కిరిణ్ రిజుజు తదితరులు.. నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీ కె.లక్ష్మణ్‌కు ఈ నామినేషన్ పత్రాలను సమర్పించారు. వివిధ రాష్ట్రాల పార్టీ అధ్యక్షుల నేతృత్వంలో పార్టీ ముఖ్య నేతలు నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్లను దాఖలు చేయగా మొత్తం 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. బరిలో ఒక్కరే ఉండటంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. మంగళవారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ముఖ్య నేతల సమక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ, రిటర్నింగ్ ఆఫీసర్ కె.లక్ష్మణ్‌తో కలిసి నూతన అధ్యక్షుడి పేరును ప్రకటించా రు.

## టెకీ మృతి.. నొయిడా బిల్డర్ అరెస్ట్

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడా సెక్టార్ 150లో నీటిగుంటలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యువరాజ్ మెహతా మృతిచెందిన ఘటనకు సంబంధించి ఎంజీ విష్ టౌన్ సొసైటీ బిల్డర్ అభయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ ఘటనను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే 'సిట్'ను ఏర్పాటు చేశా రు. నొయిడా అథారిటీ సీఈవోను ఆ పదవి నుంచి తప్పించి వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచారు. మరో వైపు.. నొయిడా సెక్టార్ 150 పరిసరాల్లో రోడ్ల భద్రతను మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు చేపట్టినట్టు గ్రేటర్ నొయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథా రిటీ ప్రకటించింది. రోడ్లు, సమీప ప్రాంతాల్లో భద్రతపై తక్షణమే తనిఖీలు చేపట్టాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.జీ.రవికుమార్ అధికారులను ఆదేశించారు. గుంతలను వెంటనే పూడ్చాలని ఆదేశాలిచ్చారు. ప్రమాదాలకు అవకాశమున్న ప్రాంతాలను(బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి ప్రమాదాల నివారణకు మార్కింగ్ చేయాలని కూడా సీఈఓ అదేశించారు. సెక్టార్ 150లో నివాసముంటున్న 27 ఏళ్ల యువరాజ్ మెహతా.. జనవరి 16న తన ఇంటికి తిరిగి వెళుండగా ప్రమాదం జరిగింది. ఆయన కారు ఏటీ ఎస్ లే గ్రాండియోస్ కూడలి వద్ద అదుపుతప్పి మురుగు కాలువ గోడను ఢీకొట్టి పక్కనే ఉన్న నీటిగుంటలో పడింది. కాపాడమంటూ దాదాపు రెండు గంటలు ఆయన ఆర్తనాదాలు చేసినట్టు స్థానికులు తెలిపారు. అయితే నీటిలో ఊపిరాడక ఆయన ప్రాణాలు కోల్పోయారు. మున్సిపల్ యంత్రాంగం, రియల్ ఎస్టేట్ డెవలపర్ల నిర్లక్ష్యం వల్ల ఈ మరణం సంభవించినట్టు యువరాజ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంపై తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో మీరట్ జోన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సారథ్యంలో 'సిట్' టీమ్‌ను ఏర్పాటు చేశారు సీఎం యోగి. మీరట్ డివిజనల్ కమిషనర్, పీడబ్ల్యూడీ చీఫ్ ఇంజనీర్ కూడా ఈ ప్యానెల్‌లో ఉన్నారు.



# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్



## భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై ఈయూ చీఫ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: భారత్-ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న నేపథ్యంలో దీనిపై యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈయూ-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారయ్యే దశలో ఉందని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో వెల్లడించారు. భారీ వాణిజ్యం, దాని ప్రభావం రీత్యా ఈ ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా ఆమె అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక డీల్ అయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. 'ఈ ఒప్పందం దిశగా ఇంకా చేయాల్సిన వర్క్ ఉంది. మనం చారిత్రక ఒప్పందం కుదుర్చుకునే దిశగా మందుకు సాగుతున్నాం. కొందరు దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా చెబుతున్నారు. ఈ డీల్‌తో 200 కోట్ల మంది ప్రజలకు వస్తువులు, సేవల ఎగుమతి-దిగుమతులకు వీలుంటుంది. ఇది ప్రపంచ జీడీపీలోనే 25 శాతానికి సమానం' అని లియెన్ తెలిపారు. ఇండియా-ఈయూ వాణిజ్య ఒప్పందంపై చర్యలు 2007లో మొదలయ్యాయని, అయితే సుమారుగా పదేళ్లుగా నిలిచిపోయాని ఆమె చెప్పారు. రెండు వైపుల నుంచి రాజకీయ సపోర్ట్?తో తిరిగి 2022లో సంప్రదింపులు ప్రారంభమయ్యాయని, అప్పటి నుంచి చాలా వేగంగా చర్చల్లో పురోగతి ఉందని, ఇండియా-ఈయూ ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సహకారంతో క్రమం తప్పకుండా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. కాగా, గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని నాటో మిత్రదేశాలైన ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల 10 శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. తమ దారికి రాకుంటే మరో 25 శాతం సుంకాలు పెంచుతామని కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో భారత్-ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని ఉర్సాలా ప్రకటించడం ప్రాధాన్యత సంచరించుకుంది. వచ్చే వారం ఆమె భారత్?లో పర్యటించే అవకాశాలున్నాయి.

# రాసలీలలు..డీజీపీ స్థాయి అధికారి సస్పెన్షన్



బెంగళూరు: కర్ణాటక ప్రభుత్వం డీజీపీ(సివిల్ రైట్స్ ఎన్‌ఫో ర్స్‌మెంట్)గా సేవలందిస్తున్న కె.రామచంద్రరావును చివరికి సస్పెండ్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న కొన్ని వీడియోల్లో రామచంద్రరావు మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్టు ఉండటంతో ఈ మేరకు చర్యలు చేపట్టింది. మంగళవారం ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. రామచంద్రరావు ప్రభుత్వ ఉద్యోగిగా నిబంధనలు ఉల్లంఘించారని ప్రభుత్వం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇది ప్రభుత్వానికీ ఇబ్బందిగా మారిందని.. ఈ క్రమంలోనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సస్పెన్షన్ సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా రామచంద్రరావు హెడ్ క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని కూడా ఆదేశించింది. కాగా.. ఈ ఉదంతం మీద స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య.. సంబంధిత అధికారిపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సోమవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇలా ఉండగా.. కర్ణాటకలో డీజీపీ స్థాయి అధికారి అయిన కె.రామచంద్రరావు రాసలీలల వీడియోలు బహిర్గతం కావడం ఆ రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. తన ఆఫీసులోనే పోలీస్ డ్రెస్సుతో యువతులతో ఆ సీనియర్ ఐపీఎస్ అధికారి సరసాలాడటం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్‌ఈ) డీజీపీ రామచంద్రరావు శృంగార చేష్టల వీడియోలు సోమవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. యూనిఫామ్‌లో ఉన్న ఆయన తన ఛాంబర్‌లోనే యువతులను కౌగిలించుకుంటూ, ముద్దులు పెట్టే దృశ్యాలు ఆ వీడియోల్లో చూసి అంతా అవాక్కయ్యారు.

ఏపీలోని గుంటూరుకు చెందిన రామ చంద్రరావు 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2023లో ఆయన డీజీపీగా పదోన్నతి పొందారు. వచ్చే జూన్‌లో ఆయన రిటైర్ కానున్నారు. ఆయన పదవీ కాలంలో పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్నారు. ఆయన పెంపుడు కూతురు, సినీనటి రన్యారావ్ దుబాయ్ నుంచి పలుమార్లు బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చిన విషయం గతంలో దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఎయిర్‌పోర్టు నుంచి రన్యారావ్ ఎలాంటి చెకింగ్ లేకుండా ప్రొటోకాల్ ద్వారా బయటకు వచ్చేందుకు పోలీస్ వాహనాన్ని వినియోగించారు. ఈ కేసును సిట్ అధికారులు దర్యాప్తు జరిపారు. ఈ క్రమంలో డీజీపీపై అప్పట్లో సస్పెన్షన్ వేటు పడింది. గతేడాది చివర్లో మరోసారి రామచంద్రరావుకు పోస్టింగ్ ఇచ్చారు. పోలీస్ హౌసింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ సీఎండీగా పనిచేసిన సమయంలోనూ ఆయన కేసులు, అంతర్గత విచారణలు ఎదుర్కొన్నారు. దక్షిణ రేంజ్ ఐజీపీగా ఉన్నప్పుడు ఓ కేసులో పట్టుబడ్డ డబ్బులో పెద్ద మొత్తం మాయం చేశారనే ఆరోపణలూ రామచంద్రరావుపై వచ్చాయి.

## ఎం.కె.స్టాలిన్ ప్రభుత్వం వివాదం

**- జాతీయ గీతం ఆలపించలేదని..**

**అసెంబ్లీ నుంచి తమిళనాడు గవర్నర్ వాకౌట్**



తమిళనాడు అసెంబ్లీలో మంగళవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రభుత్వం మధ్య జాతీయ గీతం విషయంలో మరోసారి వివాదం చెలరేగింది. గవర్నర్ తన ప్రసంగాన్ని చదవకుండా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఈ ఏడాది అసెంబ్లీ తొలి సమావేశం సందర్భంగా గవర్నర్ రవి సభలో రాష్ట్ర గీతం అనంతరం జాతీయ గీతం వినిపించాలని కోరారు. అందుకు స్పీకర్ తిరు ఎం.అప్పవు నిరాకరించారు. తమిళనాడు సంప్రదాయం ప్రకారం రాష్ట్ర గీతం ఆలపించి, సభ ముగింపులో జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. ఈ విషయంలో గవర్నర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు.

## అబూ సలేంకు పెరోల్ ఇవ్వొద్దు..


**- ముంబై కోర్టుకు తెలిపిన మహారాష్ట్ర ప్రభుత్వం**



ముంబై: గ్యాంగ్‌స్టర్ అబూసలేంకు పెరోల్ ఇస్తే తీవ్రమైన పరిణామాలు ఎదురు కావొచ్చని మహారాష్ట్ర ప్రభుత్వం ముంబై హైకోర్టుకు తెలిపింది. పెరోల్ ఇస్తే అతను దేశం విడిచి పారిపోవచ్చని, దీనివల్ల ఇండియా, పోర్చుగల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ మేరకు హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. తన పెద్ద సోదరుడు మృతిచెందినందున తనకు 14 రోజులు పెరోల్ ఇవ్వాలని ముంబై హైకోర్టులో అబూ సలేం పిటిషన్ వేశాడు. దీనిని మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ, మరీ అవసరం అయితే ఎమర్జెన్సీ పెరోల్ కింద రెండురోజులకే పెరోల్‌ను పరిమితం చేయాలని సూచించింది. ఈనెల 28వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

# కేంద్ర ఉద్యోగులపై రాష్ట్ర పోలీసులు కేసులు పెట్టొచ్చు

కేంద్ర ప్రభుత్వ అధికారులపై అవినీతి ఆరోపణలు ఉంటే రాష్ట్ర పోలీసులు లేదా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖలు దర్యాప్తు చేయవచ్చని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సీబీఐ అనుమతి అవసరం లేదని తేల్చి చెప్పింది. రాష్ట్ర ఏజెన్సీ దాఖలు చేసిన చార్జ్‌షీట్ చెల్లుబాటు అవుతుందని, కేవలం కేంద్ర ఉద్యోగి అనే కారణంతో దాన్ని కొట్టివేయలేమని కోర్టు తెలిపింది. 'ఫెడరల్ షీల్డ్' (కేంద్ర రక్షణ) అంటూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రక్షణ ఉండదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఓ కేంద్ర ప్రభుత్వ అధికారిపై రాష్ట్ర ఏసీబీ నమోదు చేసిన అవినీతి కేసును కొట్టివేయడానికి రాజస్థాన్ హైకోర్టు నిరాకరించింది. ఆ తీర్పుపై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ తీర్పు



వెలువడింది. కేంద్ర ఉద్యోగిగా, తాను ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ పర్యవేక్షణకు మాత్రమే లోబడి ఉండాలని, తనపై రాష్ట్రం నేతృత్వంలో జరిగే ఏ దర్యాప్తు అయినా చట్టబద్ధంగా చెల్లదని పిటిషనర్ వాదించారు. ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అలాంటి రక్షణ ఉండదని తేల్చి చెప్పింది. ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వ అధికారులపై అవినీతి కేసులను కేవలం సీబీఐ మాత్రమే విచారణ చేయాలనే భావన ఉండేది. తాజా తీర్పుతో ఆ అపోహకు తెరపడింది. అవినీతి నిరోధక చట్టం, 1988 ప్రకారం కేంద్ర ఉద్యోగిని దర్యాప్తు చేయడం కోసం సీబీఐ ముందస్తు అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా, స్థానిక అవినీతి నిరోధక పరిశీలన నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ఉద్యోగులు తమ ఫెడరల్ హోదాను కవచంగా ఉపయోగించుకోకుండా ఈ తీర్పు నిరోధిస్తుంది.

# సరికొత్తగా అమెరికా స్వరూపం

**కెనడా, గ్రీన్‌ల్యాండ్, వెనెజువెలాతో మ్యాప్ - సోషల్ మీడియాలో షేర్ చేసిన ట్రంప్**



వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి ఆ దేశాన్ని స్వాధీనం చేసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం డెన్మార్క్ ఆధీనంలో ఉన్న గ్రీన్‌ల్యాండ్‌పై కన్నేశారు. అయి తే ట్రంప్ ప్రయత్నాలకు ఐరోపా దేశాలు ఎప్పటిలా వంత పాడడం లేదు. ట్రంప్ ఆలోచన తప్పని ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నాయి. ట్రంప్ వాణిజ్య సుంకాలతో బెదిరిస్తున్నా వెనక్కి తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో లు బాగా వైరల్ అవుతున్నాయి. కెనడా, గ్రీన్‌ల్యాండ్, వెనెజువెలాలను కలిగి ఉన్న అమెరికా మ్యాప్‌ను ట్రంప్ తాజాగా పోస్ట్ చేశారు. ఆ మ్యాప్‌ను ఏఐ ద్వారా రూపొందించారు. ఓవల్ ఆఫీసులో నాటో నాయకులతో ట్రంప్ సమావేశంలో ఉన్నట్టు ఆ ఫొటోలో కనిపిస్తోంది. ఆ ఫొటోలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ వంటి నాయకులు ఉన్నారు. పక్కనే ఉన్న అమెరికా మ్యాప్ సరికొత్తగా కనిపిస్తోంది. కెనడా, గ్రీన్‌ల్యాండ్, వెనెజువెలా కూడా అమెరికాలో భాగమే అన్నట్టు ఆ మ్యాప్‌లో ఉంది. ఇక, 'గ్రీన్‌ల్యాండ్, యూఎస్ టెరిటరీ, ఎస్ట్. 2026' అని రాసి ఉన్న ప్రాంతంపై తాను, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అమెరికా జెండాను నాటుతున్న మరో ఫొటోను కూడా ట్రంప్ పంచుకున్నారు. కాగా, రెండోసారి అమెరికా అధ్య క్షుడిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా చేయాలని ట్రంప్ కామెంట్లు చేస్తున్నారు. అయితే కెనడాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనే ట్రంప్ సూచనను గతేడాది మే నెలలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా వ్యతిరేకించారు. కోరికలకు, వాస్తవాలకు చాలా వ్యత్యాసం ఉంటుందని వ్యాఖ్యానించారు.

**గాజాలో శాంతికి సహకరించకుంటే**

# 200 శాతం సుంకం విధిస్తా

**ఫ్రాన్స్‌కు ట్రంప్ మరో హెచ్చరిక**



గాజాలో శాంతి స్థాపనకు మార్గాలపై అమెరికా, ఫ్రాన్స్‌ల మధ్య విభేదాలు అంత కంతకూ పెరుగుతున్నాయి. శాంతిస్థాపన కోసం అమెరికా అధ్యక్షుడు ప్రతిపాదించి న బోర్డ్ ఆఫ్ పీస్ కార్యక్రమంలో చేరేందుకు ఫ్రాన్స్ సుముఖంగా లేదు. ఈ క్రమంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయె ల్ మాక్రాన్‌పై మండిపడుతున్న డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఫ్రాన్స్ ఉత్ప త్తులపై ఏకంగా 200 శాతం సుంకం విధిస్తానని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం పత్రికా సమావేశంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. బోర్డ్ ఆఫ్ పీస్ కూటమిలో చేరేందుకు తాము రెడీగా లేమన్న ఫ్రాన్స్ అధ్యక్షుడి ప్రకటన గురించి విలేకరులు ప్రశ్నించారు. దీంతో, ట్రంప్ తన అసంతృప్తిని వెళ్లగక్కారు. 'అవునా.. అలా అన్నారా? అయినా, ఆయన ఎవ్వరికీ అవసరం లేదు. నేను ఫ్రెంచ్ మద్యం, షాంపేన్స్ పై 200 శాతం సుంకం విధిస్తాను. అప్పుడు ఆయనే దార్లోకి వస్తాడు' అని అన్నారు. అంతకుముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ప్రైవేటుగా పంపించిన మెసేజీలను కూడా ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో షేర్ చేశారు. సిరియా విషయంలో అమెరికాతో ఏకీభవిస్తున్నట్టు మాక్రాన్ చెప్పిన సందేశాలను పంచుకున్నారు. కాగా, బోర్డు ఆఫ్ పీస్‌లో చేరాలంటూ అమెరికా పంపించిన ఆహ్వానాన్ని తాము తిరస్కరించనున్నట్టు ఫ్రాన్స్ వర్గాలు ధ్రువీకరించాయి. ట్రంప్ ప్రతిపాదిత కార్యక్రమం లక్ష్యాలు గాజాకే పరిమితం కాలేదని పేర్కొన్నాయి. ఐక్యరాజ్య సమితి, ఆ సంస్థ సిద్ధాంతాల పరిధిలోకి చొచ్చుకొచ్చాయని అభిప్రాయపడ్డాయి. ఇక బహుళ ధ్రువ ప్రపంచానికి పునాది ఐక్యరాజ్య సమితి అని ఫ్రాన్స్ విదేశాంగ శాఖ కూడా తేల్చి చెప్పింది. ఇది చాలదన్నట్టు ట్రంప్ హెచ్చరిక లకు కొన్ని గంటల ముందే ఫ్రాన్స్ విదేశాంగ శాఖ ఓ సెటైరికల్ పోస్టును పెట్టింది. గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకో వాలన్న ట్రంప్ మొండిపట్టును ఎద్దేవా చేసింది. రష్యాతో ముప్పు ఎదురుకాక మునుపే గ్రీన్‌లాండ్‌కు అమెరికా భద్రత కల్పించాలని అమెరికా ట్రెజరీ స్కాట్ బెస్సన్ కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలకు ఫ్రాన్స్ విదేశాంగ శాఖ ఘాటు రిప్లై ఇచ్చింది. అగ్నిప్రమాదం జరగక ముందే.. ఇల్లు తగలబెట్టుకున్న రీతిలో ఆ ప్రతిపాదనలు ఉన్నాయని హేళన చేసింది.

# రెండు గంటల పర్యటనలో కీలక ఒప్పందాలు

**మోదీతో యూఏఈ అధ్యక్షుడి విస్తృత చర్చలు**

న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధికారిక బృందం సోమవారం రెండు గంటల పాటు భారత్‌లో పర్యటించి కీలక ఒప్పందాలను కుదుర్చుకొంది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ ఆధ్వర్యంలో వచ్చిన ఈ బృందంలో అబుదాబి, దుబాయ్ రాచకుటుంబాల సభ్యులు కూడా ఉన్నారు. యూఏఈ ఉప ప్రధాని, రక్షణ మంత్రిగా వ్యవహరిస్తున్న దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మహ మ్మద్ బిన్ మౌక్తం కూడా ఈ బృందంలో ఉన్నారు. వీరంతా ప్రధాని మోదీతో విస్తృతంగా చర్చలు జరిపి ఉగ్రవాద నిర్మూలన, కృత్రిమ మేథ, రక్షణ రంగంలో సహకారం, వ్యూహాత్మక పెట్టుబడులు తదితర రంగాల్లో ఒప్పందాలను కుదు ర్చుకొని పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఇందుకు సంబంధించి న వివరాలను భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రి వెల్లడించారు. భారత్-యూఏఈల మధ్య రక్షణ



రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన సంకల్ప లేఖ(లెటర్ ఆఫ్ ఇంటెంట్)పై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. ఏటా 50 లక్షల టన్నుల వంతున దీర్ఘకాలం పాటు ద్రవీకృత సహజ వాయువు(ఎల్ఎన్‌జీ) సరఫరాపై ఒప్పందం కుదిరింది. గుజరా త్‌లోని ధోలారాలో ఉన్న స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో యూఏఈ పెట్టుబడులకు సంబంధించిన సంకల్ప లేఖపై కూడా సంతకాలు జరిగాయి. ఆహార భద్రత, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. భారత్‌లో డాటా సెంటర్, సూపర్ కంప్యూటింగ్ క్లస్టర్, వినూత్నంగా 'డాటా ఎంబసీ' ఏర్పాటుపై చర్చలు జరిగాయి. సాంస్కృతిక రంగంలో సహకారంలో భాగం గా అబుదాబీలో 'హౌస్ ఆఫ్ ఇండియా' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**తిలకం పెట్టుకున్నాడని**

## పాఠశాలలో 8 ఏళ్ల విద్యార్థిపై వివక్ష

**లండన్ పాఠశాలలో వెలుగుచూసిన ఘటన**



బ్రిటన్ రాజధాని లండన్‌లోని ఓ పాఠశాలలో ఎనిమిదేళ్ల బాలుడు వివక్షను ఎదుర్కొన్న ఘటన వెలుగులోకి వచ్చింది. తిలకం పెట్టుకుని స్కూల్‌కు వెళ్లడం కారణంగా పాఠశాల యాజ మాన్యం అతడిని వేరుగా చూసినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితి వల్ల.. ఆ బాలుడు చివరకు పాఠశాల మార్చుకోవాల్సి వచ్చింది. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బ్రిటన్‌లో హిందువులు, భారతీయుల తరఫున పనిచేస్తున్న ఇన్‌సైట్ యూకే అనే సంస్థ ఈ విషయాన్ని బయటపెట్టింది. ఇన్‌సైట్ యూకే సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. లండన్‌లోని వికార్స్ గ్రీన్ అనే ప్రైమ రీ స్కూల్‌లో ఆ బాలుడు చదివేవాడు. తమ మత సంప్రదాయం ప్రకారం.. రోజూ తిలకం ధరించి తరగతులకు హాజరయ్యేవాడు. అయితే.. పాఠశాల సిబ్బంది అతణ్ని నిత్యం గమనిస్తూ.. మతాచా రాలపై పదే పదే ప్రశ్నలు వేయడం ప్రారంభించారు. విరామ సమయంలోనూ ప్రధానోపాధ్యాయులు బాలుడిపై ప్రత్యేక దృష్టి సారించడంతో అతడు భయపడిపోయాడని ఇన్‌సైట్ యూకే తెలిపింది. దీంతో ఇతర పిల్లలతో కలిసి ఆడటానికీ అతడు వెను కాడినట్టు పేర్కొంది. మత విశ్వాసాల కారణంగా ఏ విద్యార్థీ ఒంటరితనాన్ని ఎదుర్కోవడం సరికాదని సంస్థ అభిప్రా యపడిం ది. తిలకం పెట్టుకున్నాడనే కారణంగా ఆ బాలుడిని పాఠశాలలో పలు బాధ్యతల నుంచి తొలగించారని కూడా ఇన్‌సైట్ యూకే ఆరోపించింది. ఈ తరహా సంఘటనలు పిల్లల మనసుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వారి భద్రతపైనా సందేహాలు కలిగి స్తాయని విమర్శించింది. బాలుడి తల్లిదండ్రులు తమ మతాచా రాల గురించి స్కూల్ యాజమాన్యానికి వివరించడానికి ప్రయ త్నించినా.. ఎలాంటి మార్పూ కనిపించలేదని తెలిపింది. చివర కు అక్కడి పరిస్థితులను ఎదుర్కోలేక ఆ బాలుడు పాఠశాలను మార్చుకోవాల్సి వచ్చిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలు నిజమని తేలితే.. బ్రిటన్ చట్టాల ప్రకారం ఇది మత వివక్ష కిందకు వస్తుందని యూకే ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇలాంటి కారణాల వల్ల ఇదే పాఠశాల నుంచి ఇప్పటికే నలుగు రు విద్యార్థులు వెళ్లిపోయారని ఇన్‌సైట్ యూకే గుర్తు చేసింది.

## 2025 నోబెల్ ఎప్పటికీ మచాడోదే!

**- బదిలీ, రద్దు, పంచుకోవడం సాధ్యం కాదు**
**- నార్వేజియన్ నోబెల్ ఇన్‌స్టిట్యూట్ స్పష్టం**



వెనిజులా ప్రతిపక్ష నేత మరియా మచాడోకి ఇచ్చిన 2025 సంవత్సరం నోబెల్ శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇచ్చివేయడంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ నెలకొంది. పలువురు దీనిపై విమర్శలు వ్యక్తం చేస్తూ.. నోబెల్ ఫౌండేషన్ దాన్ని వెనక్కు తీసుకోవాలని లేదా మరొకరికి ఇవ్వా లని సూచిస్తున్నారు. దీనిపై స్పందించిన నార్వేజియన్ నోబెల్ ఇన్‌స్టిట్యూట్.. మచాడో నోబెల్ బహుమతిని ట్రంప్‌కు ఇచ్చినా.. ఆ గౌరవం ఆమెకే చెందుతుందని పేర్కొంది. దాన్ని బదిలీ చేయడం గానీ, పంచుకోవడం గానీ, రద్దు చేయడం గానీ సాధ్యం కాదని గత వారమే స్పష్టం చేసింది. ఎప్పటికీ ఇదే తుది నిర్ణ యమని, ఇందులో మార్పు ఉండదని పేర్కొంది.

# పొట్టి క్రికెట్‌లో సత్తా చాటుతారా?

## నేటి నుంచి కివీస్‌తో ఐదు మ్యాచ్‌ల టీ 20 సిరీస్ - నాగ్‌పూర్‌లో తొలి మ్యాచ్

భారత్, న్యూజిలాండ్ మధ్య బుధవారం నుంచి ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌కు నాగ్‌పూర్ ఆతిథ్యమివ్వనుంది. 2026 టీ20 ప్రపంచకప్ నకు జరిగే ఈ సిరీస్ రెండు జట్లకు సన్నాహకంగా ఉపయోగపడనుంది. భారత్‌లో వన్డే సిరీస్ ను 2-1తో కైవసం చేసుకున్న కివీస్.. టీ20ల్లోనూ గట్టి పోటీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. మరి పొట్టి ఫార్మాట్‌లో ఇరుజట్ల రికార్డు ఎలాఉందో చూద్దాం.

భారత్, న్యూజిలాండ్ మధ్య ఇప్పటివరకు 8 ద్వైపాక్షిక టీ20 సిరీస్లు జరిగాయి. ఇందులో న్యూజిలాండ్ మూడు, భారత్ ఐదింట విజయాలు సాధించింది. 2019-20లో న్యూజిలాండ్ పర్యటనలో సాధించిన సిరీస్ విజయం భారత జట్టుకు టీ20 క్రికెట్ చరిత్రలో చిరకాలం గుర్తుండిపోతుంది. 5 మ్యాచ్‌ల ఈ సిరీసు భారత్ 5-0తో క్లీన్ స్వీప్ చేసింది.

భారత్, న్యూజిలాండ్ దాదాపు మూడు సంవత్సరాల తర్వాత టీ20ల్లో తలపడనుండటం విశేషం. ఫిబ్రవరి 1, 2023న భారత్, న్యూజిలాండ్ మధ్య చివరి మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్లో టీమ్ ఇండియా 168 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 235 పరుగుల లక్ష్యఛేదనలో కివీస్ 66 పరుగులకే ఆలౌటైంది.




ఓవరాల్‌గా ఇప్పటివరకు ఇరుజట్ల మధ్య 25 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 14, న్యూజిలాండ్ 14 మ్యాచ్లో గెలిచాయి. ఒకదాంట్లో ఫలితం తేలలేదు.

భారత్ అత్యధిక స్కోరు 234/4, అత్యల్ప స్కోరు 79. కివీస్ అత్యధిక స్కోరు 219/6.. అత్యల్ప స్కోరు 66.

ప్రస్తుతం భారత జట్టులో ఉన్నవారిలో న్యూజిలాండ్‌పై కెప్టెన్ సూర్యకుమార్ అత్యధికంగా 284 పరుగులు (8 ఇన్నింగ్స్, స్ట్రైక్ రేట్ 153.41) చేశాడు. ఇందులో ఒక సెంచరీ (111 నాటౌట్) ఉంది. కివీస్ తరపున డారిల్ మిచెల్ 14 ఇన్నింగ్స్ల్లో 241 రన్స్ చేశాడు. మొత్తమ్మీద చూస్తే రోహిత్ శర్మ (511), కోలిన్ మున్రో (426) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

అత్యధిక సిక్స్‌ల విషయానికొస్తే.. ఓవరాల్గా రోహిత్ (27), మున్రో (24) టాప్‌లోఉన్నారు. ప్రస్తుతం జట్టులో ఉన్నవారిలో చూస్తే సూర్యకుమార్ 15, డారిల్ మిచెల్ 11 సిక్సర్లు బాదారు.

బౌలర్ల విషయానికి వస్తే ప్రస్తుతం జట్టులోఉన్న కివీస్ స్పిన్నర్ ఇష్ సోధీ భారత్‌తో 20 మ్యాచ్లు ఆడి 25 వికెట్లు పడగొట్టాడు. భారత్ తరపున బుమ్రా అత్యధికంగా 12 వికెట్లు (10 ఇన్నింగ్సులు) పడగొట్టాడు. అత్యుత్తమ ప్రదర్శన 3/12

**భారత్, న్యూజిలాండ్ టీ20 సిరీస్ షెడ్యూల్**

జనవరి 21 – తొలి టీ20 (నాగ్పూర్), జనవరి 23 – రెండో టీ20 (రాయపూర్), జవవరి 25 – మూడో టీ20 (గువాహటి), జనవరి 28 – నాలుగో టీ20 (విశాఖపట్నం), జనవరి 31 – ఐదో టీ20 (తిరువనంతపురం)

ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు రాత్రి 7 గంటలకే మొదలవుతాయి.

భారత్: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివమ్ దూబే, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, జస్ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి

న్యూజిలాండ్: మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), మార్క్ చాప్మన్, టిమ్ రాబిన్సన్, మైఖేల్ బ్రేసెవట్, డారిల్ మిచెల్, బెవాన్ జాకబ్స్, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, జకరీ ఫౌల్క్స్, డెవాన్ కాన్వే, మ్యాట్ హెన్రీ, జేకబ్ డఫీ, కైల్ జేమీసన్, ఐష్ సోధి, క్రిస్టియన్ క్లార్క్

# చరిత్ర సృష్టించిన ఆర్సీబీ



మహిళల ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. సోమవారం గుజరాత్ జెయింట్స్‌పై 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఆర్సీబీ.. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. ఇదే కాకుండా డబ్ల్యూపీఎల్ చరిత్రలో వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచిన తొలి జట్టుగా మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.

వడోదరలోని బీసీఏ స్టేడియం కోటాంబిలో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ ఆది నుంచి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. టోర్నీ నవీ ముంబై నుంచి వడోదరకు మారిన తర్వాత జరిగిన తొలి మ్యాచ్‌లోనే బెంగళూరు టీమ్ సత్తా చాటింది. గత సీజన్‌లో ఆఖరి మ్యాచ్ గెలవడంతో పాటు.. ఈ సీజన్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి వరుసగా ఆరు మ్యాచుల్లో విజయం సాధించిన ఏకైక జట్టుగా ఆర్సీబీ రికార్డులకెక్కింది.

ఈ సీజన్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లోనే గెలిచి 10 పాయింట్లు సాధించిన ఆర్సీబీ.. ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గతంలో ముంబై ఇండియన్స్ మహిళల జట్టు రెండు సార్లు(2023, 2023-24) వరుసగా ఐదు విజయాలు సాధించగా.. ఇప్పుడు ఆ రికార్డును అధిగమిస్తూ ఆర్సీబీ అగ్రస్థానానికి చేరుకుంది.

గుజరాత్‌తో మ్యాచ్ అనంతరం తమ విజయ రహస్యంపై కెప్టెన్ స్మృతి మంధాన స్పందించింది. ఇది ఆర్సీబీకి నిజంగా ప్రత్యేకమైన అనుభవం. పది రోజుల తర్వాత ఏం జరగనుందా అని ఆలోచించే కన్నా ప్రస్తుతం ఏం చేయాలన్న దానిపై శ్రద్ధపెట్టాలి. రోజూ మనం చేసే చిన్న విషయాలను కూడా దృష్టి పెట్టి చేయాలి. పని చిన్నదే కదా ఏదో చేసేద్దాం.. అన్నట్లు వదిలేస్తే అవే పెద్ద సమస్యలుగా మారతాయి. ఇప్పుడు మేం ప్రతి మ్యాచ్‌లోనూ చేసేది అదే. ఒక్కో మ్యాచ్‌ను ఒక్కో పాఠంగా తీసుకుంటున్నాం. గెలిచినప్పటికీ మా లోపాలను గుర్తించి వాటిపై దృష్టి సారిస్తున్నాం. అదే మా విజయ రహస్యం. దానికి తోడు జట్టులోని అందరూ ఎంతో కష్టపడుతున్నారు. మా సపోర్ట్ స్టాఫ్‌నకూ పూర్తి క్రెడిట్ ఇవ్వాలి. వారు జట్టును ఎప్పుడూ సానుకూలంగా, ఆనందంగా ఉంచుతున్నారు. అదే మాకు మంచి వాతావరణాన్ని ఇస్తోందని స్మృతి వెల్లడించింది.

**డీసీతో తదుపరి పోరు..**

షెడ్యూల్ ప్రకారం.. ఆర్సీబీ మహిళల జట్టు జనవరి 24న ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్ కూడా వడోదరలోని కోటాంబి స్టేడియంలోనే జరగనుంది. పాయింట్ల పట్టికలో ఆర్సీబీ అగ్రస్థానంలో కొనసాగుతుండగా ఢిల్లీ క్యాపిటల్స్ చివరి స్థానంలో ఉంది. జెమీమా రోడ్రిగ్స్ నాయకత్వంలో ఉన్న ఢిల్లీ జట్టు ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్కటే గెలిచింది. ఆర్సీబీతో జరిగే మ్యాచ్‌లో ప్రదర్శన మెరుగుపర్చుకోవాలని ఢిల్లీ ఆశిస్తోంది.

# రోహిత్, కోహ్లికి బీసీసీఐ షాక్?



టీమిండియా వెటరన్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు బీసీసీఐ షాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. 2026-27 సీజన్‌కు సంబంధించి సెంట్రల్ కాంట్రాక్టుల్లో కీలక మార్పులు చేసేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఈ క్రమంలో 'ఏ ప్లస్' కేటగిరీని పూర్తిగా తొలగించి.. మూడు కేటగిరీలను మాత్రమే ఉంచాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ప్రతిపాదించింది. దీనికి బోర్డు ఆమోదం తెలిపితే రో-కోపై ఎక్కువ ప్రభావం పడే అవకాశం ఉంది. రో-కో జంట ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఒకే ఫార్మాట్ ఆడుతున్న కారణంగా వారిని ఏ ప్లస్ కేటగిరీ నుంచి 'బీ గ్రేడ్'కు డిమోట్ చేసే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఏ ప్లస్ గ్రేడ్‌లో ఉన్న కోహ్లీ, రోహిత్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా ఏడాదికి రూ.7 కోట్ల వేతనం అందుకుంటున్నారు. 'ఏ' గ్రేడ్లో ఉన్నవారికి రూ.5 కోట్లు, 'బి' గ్రేడ్లో ఉన్నవారికి రూ.3 కోట్లు, 'సి' గ్రేడ్లో ఉన్న ప్లేయర్లకు రూ. కోటి చొప్పున బీసీసీఐ చెల్లిస్తుంది. ఒకవేళ ఏ ప్లస్ గ్రేడ్ రద్దయితే జడేజా, బుమ్రాలను గ్రేడ్ 'ఏ'కి మార్చే అవకాశముంది. త్వరలో జరగనున్న బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది. అదే సమయంలో ఏ ప్లస్ గ్రేడ్ రద్దయితే కొత్తగా 'డీ' గ్రేడ్ ప్రవేశ పెడతారా? అన్న అంశంపైనా చర్చ జరుగుతోంది.

# టీ 20 వరల్డ్‌కప్ ఆడతాం: పాక్

భారత్‌లో 2026 టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడబోమని బెట్టు చేస్తున్న బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్‌కూడా ఈ టోర్నమెంట్‌ను బహిష్కరిస్తుందటంటూ వస్తున్న వార్తలకు ఆ దేశం తెరదించింది. తమకు అలాంటి ఆలోచనేదీ లేదని పాకిస్థాన్ స్పష్టం చేసింది. భద్రతా కారణాలు, జాతీయ గౌరవాన్ని సాకుగా చూపుతూ కోల్‌కతా, ముంబయిలలో జరగాల్సిన తమ మ్యాచ్‌లు ఆడేందుకు భారత్ కు వచ్చేందుకు బంగ్లాదేశ్ నిరాకరిస్తోంది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా పాకిస్థాన్ కూడా ప్రపంచ కప్ మ్యాచ్‌లను బహిష్కరించాలని యోచిస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వార్తలపై పాకిస్థాన్ తాజాగా స్పందించింది. అవన్నీ ఊహాగానాలేనని స్పష్టం చేసింది. భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ మ్యాచ్‌లు ఆడొద్దని నిర్ణయించుకున్నా తాము మాత్రం టోర్నమెంట్‌ను బహిష్కరించబోమని వెల్లడించింది. 2025 ఆరంభంలో జరిగిన ఒప్పందం ప్రకారం ఈ టోర్నమెంట్‌లో మా మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో షెడ్యూల్ చేశారు. ఈ పరిస్థితుల్లో మేం టోర్నీ నుంచి ఎందుకు వైదొలగాలి? వివాదాన్ని మరింత పెద్దది చేయడానికి కొందరు ఇలాంటి విషయాలను తెరపైకి తెస్తున్నారని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వర్గాలు ఓ క్రీడా వెబ్‌సైట్‌కు వెల్లడించాయి.

**ఐసీసీ ఒత్తిడికి తలొగ్గం**

భారత్‌లో పర్యటించేందుకు బంగ్లా నిరాకరిస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తున్నట్లు వార్తలొచ్చాయి. కానీ, ఈ విషయం గురించి ఐసీసీ తమకు అధికారిక సమాచారం అందించలేదని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ అన్నారు. 'ఒత్తిడి చేసి మమ్మల్ని భారత్‌లో మ్యాచ్‌లు ఆడించలేరు. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడిస్తామని ఐసీసీ మాకు అధికారికంగా సమాచారం ఇవ్వలేదు.' అని నజ్రుల్ వివరించారు. మరోవైపు, ఐసీసీ తమతో ఇప్పటివరకు ఎలాంటి సంప్రదింపులు జరపలేదని స్కాట్లాండ్ పేర్కొంది.

# రికార్డులు వస్తుంటాయి.. పోతుంటాయి

బాక్సాఫీస్ వద్ద 'మన శంకరవరప్రసాద్ గారు' భారీ విజయాన్ని అందుకున్న సందర్భంగా చిత్ర కథానాయకుడు చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులు, అభిమానులకు విజయం పూర్తిగా నా ప్రియమైన తెలుగు ప్రేక్షకులది, నా ప్రాణసమానమైన అభిమానులది, నా



కృతజ్ఞతలు చెబుతూ ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. దశాబ్దాలుగా తన వెంట నిలబడిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. మన శంకరవరప్రసాద్ గారు' చిత్రానికి ప్రేక్షక దేవుళ్లు చూపిస్తున్న ఆదరణ, అపూర్వమైన విజయాన్ని చూస్తుంటే నా మనసు కృతజ్ఞత భావనతో నిండిపోతోంది. నేను ఎప్పుడూ చెప్పేది.. నమ్మేది ఒక్కటే. నా జీవితం మీ ప్రేమాభిమానాలతో ముడిపడింది. మీరు లేనిదే నేను లేను. ఈ రోజు మళ్లీ అదే నిజమని మీరు నిరూపించారు. ఈ డిస్ట్రిబ్యూటర్లది, సినిమాకు ప్రాణం పెట్టి పనిచేసిన ప్రతీ ఒక్కరిది. ముఖ్యంగా దశాబ్దాలుగా నా వెంట నిలబడి ఉన్నవారందరిది. వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే శక్తి. రికార్డులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ, మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం. ఈ బ్లాక్‌బస్టర్ విజయం వెనుక ఎంతో కృషి చేసిన మా దర్శకుడు హిట్ మెషీన్ అనిల్ రావిపూడికి, నిర్మాతలు సాహు, సుస్మితలకు, అలాగే మొత్తం టీమ్ అందరికీ, నాపై మీరందరూ చూపిన అచంచలమైన నమ్మకానికి ధన్యవాదాలు. ఈ సంబరాన్ని అలాగే కొనసాగిద్దాం. మీ అందరికీ ప్రేమతో... లవ్ యూ ఆల్. మీ చిరంజీవి" అని పేర్కొన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' రికార్డులు సృష్టిస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటించిన ఈ మూవీ అత్యంత వేగంగా రూ.300 కోట్ల క్లబ్‌లో చేరిన ప్రాంతీయ చిత్రంగా నిలిచింది.

## దసరా విడుదలైన వెంటనే..

### - మెగా సినిమాపై హింట్ ఇచ్చిన నిర్మాత



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'మన శంకర వరప్రసాద్?' చిత్రం సక్సెస్‌ను ఆనందిస్తున్నారు. సంక్రాంతి బరిలో రిలీజైన ఈ చిత్రం భారీ విజయం సాధించి రూ.300 కోట్లకు పైగా వసూళ్ల రాబట్టింది. మరో పక్క ఆయన నటించిన సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు నడుస్తున్నాయి. ఈ సినిమాను వేసవి లో విడుదల చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి వశిష్ట మల్లిడి దర్శకుడు. ఈ జోరు కొనసాగుతుండగానే చిరు తదుపరి చిత్రాలపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు చిత్రాలు రెడీగా ఉన్నాయి. అందులో ఒకటి దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని సమర్పణలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మెగా 157గా ఈ చిత్రం తెరకెక్కనుంది. మరొకటి కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం. శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నాని ప్యారడైజ్ చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఆ సినిమా విడుదల అయిన వెంటనే చిరంజీవి చిత్రాన్ని పట్టాలెక్కిస్తామని నిర్మాత సుధాకర్ చెరుకూరి తెలిపారు. అంతే కాదు ఈ సినిమా జానర్ కూడా చెప్పారు. 1970–74 సమయంలో సాగే పీరియాడిక్ డ్రామా ఇదని, ఈ చిత్రంలో చిరంజీవి సరికొత్తగా కనిపిస్తారని నిర్మాత చెప్పారు.

## గొల్ల రామవ్వగా తాళ్లూరి రామేశ్వరి





భారతదేశం గర్వించే రాజకీయ నాయకుడు, మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహా రావు గొప్ప సాహితీవేత్త అనే విషయం అందరికీ తెలిసిందే. ఈ బహు భాషాకోవిదుడు రచించిన అనేక కథలలో 'గొల్ల రామవ్వ' ప్రత్యేకమైంది. తెలంగాణ సాయుధ పోరాట గాథకు ఆ కథ అద్దం పడుతుంది. ఈ కథను నాటకంగా మలిచి రంగస్థలం మీద కూడా అనేకసార్లు ప్రదర్శించారు. ఇప్పుడీ కథకు ఈటీవీ విన్ లోని కథాసుధలో భాగంగా దృశ్యరూపం కల్పిస్తున్నారు. ప్రముఖ రచయిత, నిర్మాత, దివంగత ముళ్ళపూడి వెంకట రమణ తనయుడు వరా ముళ్ళపూడి దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ విశ్వాస్ హనూర్కర్, రాఘవేంద్ర వర్మ దీనిని నిర్మిస్తున్నారు. ఇందులో గొల్ల రామవ్వ పాత్రను ప్రముఖ నటీమణి తాళ్ళూరి రామేశ్వరి పోషిస్తున్నారు.

రజాకార్ల దాష్టీకానికి తెలంగాణ ప్రాంతం చిగురుటాకులా వణికిపోతున్న సమయంలో ఓ పల్లెలో జరిగే కథ ఇది. సాయుధ పోరాట యోధుడిని రక్షించడంలో భాగంగా గొల్ల రామవ్వ ఎలాంటి త్యాగానికి సిద్ధపడిందనే విషయాన్ని ఒళ్ళు గగుర్పొడిచేలా పీవీ నరసింహారావు రాశారు. అరగంట నిడివితో ఉండే దీనిని వీక్షకులు మెచ్చే స్క్రీన్ ప్లేతో తెరకెక్కించారు వరా ముళ్ళపూడి. ఈ సినిమా నిర్మాతల్లో ఒకరైన రాఘవేంద్ర వర్మ ఎడిటర్ కూడా. సాయి మధుకర్ సంగీతం అందిస్తున్న 'గొల్ల రామవ్వ'కు గంగనమోని శేఖర్ సినిమాటోగ్రఫర్‌గా వ్యవహరిస్తున్నారు. అజహర్ షేక్ సాహిత్యాన్ని సమకూర్చడంతో పాటు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 'గొల్ల రామవ్వ' రిపబ్లిక్ డే సందర్భంగా ఈటీవీ విన్ లో 26వ తేదీ ప్రసారం కానున్నట్టు తెలుస్తోంది.

## 90 రోజుల ముందే ఉత్తర్వులు ఇవ్వాలి

### - తెలంగాణలో సినిమా టిక్కెట్ రేట్ల పెంపుపై హైకోర్టు కీలక ఆదేశాలు

తెలంగాణలో సినిమా టికెట్ ధరల పెంపు ఉత్తర్వులపై ఆ రాష్ట్ర హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ఈ ఉత్తర్వులను 90 రోజుల ముందే ఇవ్వాలని రాష్ట్ర హోంశాఖను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రానికి టికెట్ ధరల పెంపు అంశంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదైంది. టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టులో సవాల్ చేశారు. 'రాజాసాబ్' సినిమా టికెట్ ధరలపై ఈనెల 9న వాదనలు జరిగాయి. అయితే, 8వ తేదీ అర్ధరాత్రి 'రాజాసాబ్' మూవీ టికెట్ ధరలు, ప్రీమియర్లకు (పలు చోట్ల) అనుమతి ఇస్తూ హోంశాఖ మెమో జారీ చేసింది. ఈ విషయాన్ని విజయ్ గోపాల్ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అదే సమయంలో 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రానికి కూడా టికెట్ ధరలు పెంచుతూ 8వ తేదీనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఆ ఉత్తర్వులను మాత్రం ప్రభుత్వ న్యాయవాది (జీపీ) కోర్టు దృష్టికి తీసుకురాలేదన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని జీపీని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వాయిదా వేసింది. దీనిపై న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై సినిమా విడుదలకు 90 రోజుల ముందుగానే టిక్కెట్ ధరల పెంపె ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించింది.





## అల్లరి నరేష్ తాత మృతి

సినీ నటుడు అల్లరి నరేశ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన తాత ఈవీవీ సత్యనారాయణ తండ్రి ఈవీవీ వెంకట్రావు (90) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న వెంకట్రావు మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నిడదవోలు మండలం కోరుమామిడిలో మంగళవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన సతీమణి వెంకటరత్నం 2019లో మరణించారు. వెంకట్రావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఈవీవీ సత్యనారాయణ 2011 జనవరి 21న మృతి చెందిన విషయం తెలిసిందే.

## ఇది 'బాస్ బస్టర్'

'మన శంకరవరప్రసాద్‌గారు' ఈ సంక్రాంతికి వచ్చిన బ్లాక్‌బస్టర్ మాత్రమే కాదని, ఇది సంక్రాంతి 'బాస్' బస్టర్ అంటూ అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ కితాబిచ్చారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది.. ఈ సందర్భంగా చిత్ర బృందానికి శుభాకాంక్షలు. చెబుతూ అల్లు అర్జున్ స్పెషల్ పోస్ట్ పెట్టారు. బాస్ ఈజ్ బ్యాక్.. నిజంగా ఇదొక అద్భుతం. మన మెగాస్టార్ చిరంజీవిని ఇలా చూడటం చాలా సంతోషంగా ఉంది. వింటేజ్ వైబ్స్‌తో వెండితెర వెలిగిపోయింది. వెంకీమామ కూడా అదరగొట్టారు. వెంకీగౌడగా చాలా బాగా చేశారు. నయనతార అందంతో అలరించారు. ఇక కేథరిన్ చక్కగా నవ్వులు పంచింది. సినిమాలో చేసిన ప్రతి ఒక్కరూ తమ నటనతో మెప్పించారు. ముఖ్యంగా సంక్రాంతి స్టార్ బుల్లిరాజు (కొరికేత్తాను.. కొరికేత్తాను..) ఇక హుక్‌స్టెప్, మెగా విక్టరీ పాటలు విజిల్స్ వేసేలా ఉన్నాయి. భీమ్స్ సిసిరోలియో మీకు అభినందనలు. టెక్నికల్ టీమ్, నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి సినిమాను అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చారు. ఇక బ్లాక్ బస్టర్ మెషీన్ దర్శకుడు అనిల్ రావిపూడికి శుభాకాంక్షలు. 'సంక్రాంతికి వస్తారు.. హిట్ కొడతారు.. రిపీట్.."అంటూ.. అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు.

